నవతెలంగాణ
1
మెదక్
గురువారం | 05 సెప్టెంబర్ 2024 | www.navatelangana.com

డీఎస్పీకి మట్టి వినాయకుడి ప్రతిమ బహూకరణ

నవతెలంగాణ-సంగారెడ్డి



హెల్పింగ్ హాండ్స్ ఆధ్వర్యంలో సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్యకు మట్టి వినాయక విగ్రహాన్ని హెల్పింగ్ హ్యాండ్ యూత్ నాయకులు అఖిల్ బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ భక్తిశ్రద్ధలతో వినాయక పండగను జరుపుకోవాలన్నారు. మట్టి విగ్రహాలు ప్రతిష్ఠించి పర్యావరణను కాపాడేందుకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలన్నారు. హెల్పింగ్ హ్యాండ్ చేస్తున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు శివకుమార్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మట్టి విగ్రహాలను పూజిద్దాం

నవతెలంగాణ-సదాశివపేట



పర్యావరణ పరిరక్షణకు మట్టి విగ్రహాలనే పూజించాలని సదాశివపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులు ప్రజలకు అవగాహన కల్పించారు. మట్టి విగ్రహాల వాడేలా ప్రజల్లో చైతన్యం తీసుకురాటానికి బుధ వారం రోజున ఈ కార్యక్ర మాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సిద్దులు మాట్లాడుతూ.. ప్రజల ందరూ మట్టి విగ్రహాలు వాడాలని కెమికల్ ఉపయోగించే విగ్రహాలు ఉపయోగించొద్దన్నారు. కెమికల్ విగ్రహాల వల్ల పర్యావరణం విచ్ఛిన్నం చెందుతుందన్నారు. కాబట్టి ప్రతీ ఒక్కరూ మట్టి విగ్రహాలనే ఆరాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో వృక్ష శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ సిద్ధులు, విద్యార్థులు పాల్గొన్నారు .

వర్షాలకు 14 వేల కోడిపిల్లలు మృత్యువాత

నవతెలంగాణ-సదాశివపేట



ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలకు మండలంలోని నిజాంపూర్ గ్రామ పరిధిలో గల ఎండి కౌసర్‌కు చెందిన కోళ్ల ఫారంలో 14,000 కోడి పిల్లలు మృత్యువాత పడ్డాయి. విషయం తెల్సుకున్న తహసీల్దార్ సరస్వతి, ఆర్ఐ అనంతయ్య, నిజాంపూర్ మాజీ ఎంపీటీసీ మాధవరెడ్డి బుధవారం ఘటనా స్థలా న్ని పరిశీలించారు. ఆర్ఐ పంచనామా ప్రకారం రూ.12 లక్షల ఆర్థిక నష్టం జరిగి నట్టు గుర్తించారు. కాగా ప్రభుత్వమే తనను ఆదుకోవాలని ఎండి కౌసర్ విజ్ఞప్తి చేశారు.

పొంగి పొర్లుతున్న ఊట్ల పెద్ద చెరువు



నవతెలంగాణ-జిన్నారం

మండల పరిధిలోని ఊట్ల గ్రామంలో గత మూడు రోజుల కురుస్తున్న భారీ వర్షాలకు పెద్దచెరువు నిండుకుండలా మారింది. చెరువు పొంగిపొర్లుతుండడంతో స్థానిక రైతాంగం, ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.

వినాయక చవితిని శాంతియుతంగా జరపాలి

నవతెలంగాణ-రాయికోడ్



వినాయక చవితి పండుగను శాంతియుతంగా జరుపుకోవాలని సీఐ జక్కుల హనుమంతు ఎస్ఐ కృష్ణయ్య అన్నారు. మండల కేంద్రమైన రాయికోడ్‌లోని పోలీస్ స్టేషన్ ఆవరణలో శాంతి సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండపాలకు అనుమతి గురించి ఆన్‌లైన్‌లో అప్లికేషన్ చేసుకోవాలన్నారు. డీజేలకు ఎట్టి పరిస్థితుల్లో పర్మిషన్ లేదన్నారు. శాంతి భద్రతలకు ఆటంకం కలిగించొద్దన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని మండపాల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శ్రావణమాసం పూజలు



నవతెలంగాణ-న్యాల్‌కల్

రేజింతల్‌లోని నిర్మాణంలో ఉన్న శివాలయంలో శ్రావణమాసం ముగింపు సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. ఎంతో పవిత్రంగా నెలరోజుల పాటు భక్తులు అభిషేకం, హారతితో పూజలు నిర్వహించారు. ముగింపు సందర్భంగా పూలు, పండ్లు సమర్పించి కలశపూజతో చేశారు. భక్తుల కోసం అన్నదాన ప్రసాదాలు ఏర్పాట్లు చేశారు.

హరీశ్ రావును కలిసిన పార్ట్ టైం టీచర్లు

నవ తెలంగాణ - సిద్దిపేట



సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో పనిచేస్తున్న పార్ట్ టైం టీచర్లను, సి ఓ ఈ లను విద్యా సంవత్సరం మధ్యలో, ముందస్తుగా తెలియచేయకుండా తొలగించడం బాధాకరమని, తమకు అండగా ఉండి ప్రభుత్వంతో మాట్లాడాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావును బుధవారం ఆయన క్యాంప్ కార్యాలయంలో పార్ట్ టైం టీచర్లు కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 6000 మంది పార్ట్ టైం టీచర్లు, 250 మంది సిఓఈ లు ఉన్నారని, అనేక సంవత్సరాలుగా విద్యార్థులకు అన్ని రకాలుగా సేవలందిస్తున్నామని, చెప్పా పెట్టకుండా తమ్మని తొలగించడం బాధాకరమని, తమ కుటుంబాలు ఈ నిర్ణయంతో రోడ్డున పడ్డాయని అన్నారు. ఈ సందర్భంగా హరీష్ రావు ప్రభుత్వంతో మాట్లాడుతానని, మీకు న్యాయం జరిగే విధంగా చూస్తానని, అండగా ఉంటానని అన్నారు.

నీట మునిగిన ఇండ్ల పరిశీలన..

నవతెలంగాణ-బెజ్జంకి



మండల పరిధిలోని గాగీల్లపూర్ గ్రామంలో నీట మునిగిన ఇండ్లను తహసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి,ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ తో కలిసి ఏఎంసీ చైర్మన్ పులి క్రిష్ణ బుధవారం పరిశీలించారు.బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అదుకునేల కృషి చేస్తామని పులి క్రిష్ణ తెలిపారు.కాంగ్రెస్ నాయకులు శంకర్, సంతోష్,శ్రీకాంత్,సాగర్,గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ పాల్గొన్నారు.


చీలాపూర్ గ్రామంలో..

మండల పరిధిలోని చీలాపూర్ గ్రామంలో వర్షాలకు కూలిన ఇండ్లను తహసిల్దార్ శ్రీనివాస్ రెడ్డితో కలిసి కాంగ్రెస్ శ్రేణులు సందర్శించి పరిశీలించారు. మండలంలో శిథిలావస్థలో ఉన్న ఇండ్లను ఖాళీ చేసి పునరావాస కేంద్రాలకు వెళ్లాలని తహసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి సూచించారు.ఆర్ఐ సతీష్,ఏఎస్ఐ శంకర్ రావు, కానిస్టేబుల్ యాదగిరి,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఓగ్గు దామోదర్,మండలాధ్యక్షుడు ముక్కీస రత్నాకర్ రెడ్డి,ఏఎంసి వైస్ చైర్మన్ చిలివేరు శ్రీనివాస్ రెడ్డి, డైరెక్టర్ బండిపెల్లి రాజు,జెల్ల ప్రభాకర్,శానగొండ శరత్ కుమార్,కొంకటి రాములు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-మద్దూరు

ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చేర్యాల సిఐ శ్రీను కోరారు .ఈ సందర్భంగా మండలంలోని చెరువులను, వాగులను, ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలు అత్యవసరం ఉంటే తప్ప బయటకు రావద్దని ఆయన కోరారు. పాతబడిన ఇండ్లు ఏవైనా ఉంటే వెంటనే వాటిని ఖాళీ చేయాలని ఆయన కోరారు. చెరువులు కుంటలు నిండినందున చేపల వేటకు ఎవరు వెళ్లవద్దని. చెట్ల కింద ఎవరు నిలబడవద్దని. కరెంటు స్తంభాలను ముట్టుకోవద్దని.ప్రయాణాలు చేసే సమయంలో జాగ్రత్తలు పాటించాలని ఆయన కోరారు. ఏదైనా అత్యవసర అవసరముంటే వెంటనే 100కు డయల్ చేయాలని ఆయన కోరారు. ఆయన వెంట ఎస్సై షేక్ మహబూబ్, ఏఎస్ఐ జిల్లా జగదీష్, కానిస్టేబుల్ క్రాంతి కుమార్ ,సిద్ధార్థ, సురేష్, తదితరులు ఉన్నారు.



'ఇన్‌స్పైర్' పై విద్యాశాఖ అశ్రద్ధ

జిల్లా	పాఠశాలలు	లక్ష్యం	దరఖాస్తులు
సిద్దిపేట	418	2090	350
సంగారెడ్డి	521	2605	450
మెదక్	241	1205	45

- విద్యార్థుల్లో సృజనాత్మకతను ప్రోత్సహించని వైనం
- వేలల్లో దరఖాస్తు చేయాల్సి ఉండగా వందల్లోనే
- ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా వెనకడుగు
- సంగారెడ్డిలో 450, సిద్దిపేటలో 350, మెదక్‌లో 45 మాత్రమే
- సైన్స్, పరిశోధనా దృక్పథం పెంచని ఉపాధ్యాయులు

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (డీఎస్‌టీ) తన ఫ్లాగ్‌షిప్ ప్రోగ్రామ్ ఇన్నోవేషన్ ఇన్ సైన్స్ పుర్స్యూట్ ఫర్ ఇన్‌స్పైర్ రీసెర్చ్ (ఐఎన్ఎస్‌పీఐఆర్‌ఈ) కింద 'ఇన్‌స్పైర్ మనక్' పథకాన్ని అమలు చేస్తుంది. మనక్ అనేది చిన్న వయస్సుల్లోనే ప్రతిభావంతులైన పాఠశాల విద్యార్థులను సైన్స్ అధ్యయనం చేయడానికి, పరిశోధనా వృత్తిని కొనసాగించడానికి వారిలో ఆవిష్కరణ సంస్కృతిని పెంపొందించడానికి ఒక ప్రత్యేకమైన చొరవ చూపుతుంది. ఈ పథకం 10-15 సంవత్సరాల మధ్య 6-10 తరగతి చదువుతున్న పాఠశాల పిల్లలకు అందిస్తుంది. ఇన్‌స్పైర్ పథకం ద్వారా ప్రతి ఏడాది దేశ వ్యాప్తంగా పది లక్షల ఆలోచనలను లక్ష్యంగా చేసుకుంటుంది. వీటిల్లో లక్ష ఐడియాలు ఇన్‌స్పైర్ అవార్డుకు ఎంపిక చేసి ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున ఇస్తారు. మధ్య, ఉన్నత పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులు ఇన్‌స్పైర్‌లో పాల్గొనేందుకు అవకాశముంది. ఆన్‌లైన్ మోడ్ ద్వారా 5 మంది విద్యార్థులు నామినేషన్లను అందించవచ్చు. నామినేషన్ వేసే సమయంలో విద్యార్థులు చేయాలనుకుంటున్న ప్రాజెక్టు యొక్క సంక్షిప్త ఆలోచనలతో సహా సంబంధిత అన్ని వివరాలను అందించాలి. విద్యార్థులు అందించిన ఆలోచనల ఆధారంగా ఆన్‌లైన్‌లో స్వీకరించిన నామినేషన్లను పరిశీలించి ఎంపికైన విద్యార్థులు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి ప్రదర్శనలు, పోటీలో పాల్గొంటారు. నేషనల్ లెవల్ ఎగ్జిబిషన్ అండ్ కాంపిటేషన్‌లో పాల్గొనే వారికి దేశంలోని ప్రముఖ విద్యా, సాంకేతిక సంస్థలతో మెంటర్‌షిప్ అందించబడుతుంది. ఇన్‌స్పైర్ మనక్ పథకంలో ఈ విద్యా సంవత్సరంలో కూడా ఆన్‌లైన్ మోడ్ ద్వారా నామినేషన్లను స్వీకరిస్తున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలోని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న 6-10 తరగతి విద్యార్థులు పాల్గొనేందుకు అవకాశముంది.

వివిధ అంశాలపై నమూనాల ప్రదర్శన

ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు కేంద్ర ప్రభుత్వం నిర్వహించే 'ఇన్‌స్పైర్ మనక్' కార్యక్రమంలో పాల్గొనేందుకు దరఖాస్తు చేసుకోవాలి. ఆయా పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులలో ఎవరెవరు ఏఏ అంశాలపై నమూనాలు ప్రదర్శిస్తారో గుర్తించి వారిని అందుకు సంసిద్ధం చేయాలి. సైన్స్, సమాజిక అంశాలు, మూడ నమ్మకాలు, అక్షరాస్యత, పర్యావరణం, సహజ వనరుల సంరక్షణ, సైన్స్ అండ్ టెక్నాలజీ వంటి అంశాలపై నమూనాలు ప్రదర్శించవచ్చు. హైడల్ పవర్ ప్రాజెక్టులు, వర్షపు నీటి సేకరణ, నీటి స్థాయి సూచిక, వర్మి కంపోస్ట్, వెర్మిన్ వాష్, లెటర్ బాక్స్ అలారం వంటి సాధారణ ఆలోచనలు, ప్రాజెక్టులు, శక్తిని ఉత్పత్తి చేయడానికి టర్బైన్‌లను ఉపయోగించడం, వ్యర్థ బ్యాటరీలు, పేడ, రవాణా, వేవ్ లేదా భూకంప అలారం ద్వారా విద్యుత్ ఉత్పత్తి వంటి ప్రదర్శనలు ఇవ్వొచ్చు. వృద్ధులకు సహాయ నడక సహాయం, స్వచ్ఛ భారత్, స్వస్థ భారత్, డిజిటల్ ఇండియా విషయాలపై ప్రదర్శనలు చేయొచ్చు. 6 నుంచి పదో తరగతి విద్యార్థుల్లో సైన్స్ సబ్జెక్ట్‌ల్లో లోతైన ఆలోచనలుంటాయి. వాటిని మరింత పెంపొందించేందుకు ఇన్‌స్పైర్ మనక్ పథకం ఎంతో ఉపయోగపడుతుంది. ప్రతి పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు సమన్వయంతో ఆసక్తి ఉన్న విద్యార్థుల్ని 5 మంది చొప్పున గ్రూపులు చేసి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేయాలి.

ఇన్‌స్పైర్ మనక్ పట్ల అశ్రద్ధ

ఇన్‌స్పైర్ మనక్ పథకంలో విద్యార్థులు పాల్గొనేలా చేయడంలో ఉమ్మడి మెదక్ జిల్లాల విద్యా శాఖ అశ్రద్ధ చూపుతోంది. ఇన్‌స్పైర్ మనక్ పథకంలో దరఖాస్తు చేసుకునే ప్రక్రియ ప్రారంభమై నెల రోజులు కావస్తున్నా ఇప్పటి వరకు అరకొరగానే దరఖాస్తులందాయి. నిర్దేశించిన లక్ష్యంలో పది శాతం కూడా దరఖాస్తు చేయలేదు. మూడు జిల్లాల్లోనూ ఇన్‌స్పైర్ మనక్ కార్యక్రమం గురించి జిల్లా స్థాయిలో విద్యా శాఖ అధికారులతో కలెక్టర్లు పలు మార్లు సమీక్ష నిర్వహించారు. జిల్లాల వారిగా నమూనా ప్రదర్శనల లక్ష్యాన్ని నిర్దేశించారు. సంగారెడ్డి జిల్లాలో 521 పాఠశాలల నుంచి 2605 నమూనాలను ప్రదర్శించేలా దరఖాస్తులు చేయాలని నిర్దేశించారు. ఇప్పటి వరకు కేవలం 450 మాత్రమే దరఖాస్తులు చేశారు. మెదక్ జిల్లాలో మరీ అధ్వాన్నంగా 241 పాఠశాలల నుంచి 1205 నమూనాలను ప్రదర్శించేందుకు దరఖాస్తు చేయాల్సి ఉండగా కేవలం 45 మాత్రమే చేశారు. సిద్దిపేట జిల్లాలో 418 పాఠశాలల నుంచి 2090 నమూనాలు చేసేలా చూడాల్సి ఉండగా కేవలం 350 మాత్రమే చేశారు. మూడు జిల్లాల్లోనూ ఇన్‌స్పైర్ పథకంలో పాల్గొనే విద్యార్థుల సంఖ్య చాలా పరిమితంగానే ఉంది. ముఖ్యంగా జిల్లా విద్యా శాఖ అధికారులు, మండల విద్యా అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సైన్స్ ఉపాధ్యాయులు శ్రద్ధ చూపకపవడం వల్లనే చాలా పరిమితంగా దరఖాస్తులు చేశారు. మరో పది రోజుల పాటే దరఖాస్తులకు అవకాశం ఉన్నందున వెంటనే ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు చొరవ తీసుకుని ఇన్‌స్పైర్‌లో పాల్గొనేలా దరఖాస్తుల్ని చేయించాలని కలెక్టర్లు ఆదేశించారు.

'ఇన్‌స్పైర్ మనక్' కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మక శక్తిని పెంచడం, శాస్త్రీయ దక్పథాన్ని అలవర్చడం, జటిలమైన సమస్యలకు పరిష్కారాలు కనుగొనడం, వివిధ అంశాలపై కొత్త కొత్త ఆవిష్కరణ చేసేలా ప్రోత్సహించాలి. తరగతి గదిలో భారత దేశ భవిష్యత్ రూపుదిద్దుకుంటుందని విద్యా వేత్తలు పేర్కొనడంలో అర్థం కూడా ఇదే. రేపటి భవిష్యత్ నేటి విద్యార్థులే. వివిధ రంగాల్లో కొత్త ఆవిష్కరణల ద్వారా శాస్త్ర సాంకేతికంగా ఎదిగేందుకు పాఠశాల స్థాయిలోనే పునాదులు పడాలి. అందుకు తరగతి ఉపాధ్యాయులే తగిన విద్యా బోధనతో పాటు విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలి. ఏఏ అంశాల పట్ల ఆసక్తి కనబర్చుతున్నారో గమనించి వారికి అవసరమైన సహకారం అందించాలి. బట్టీ చదువులతో నెట్టుకురావడం తప్ప సృజనశీలతను పెంచే ప్రయత్నం చేయకపోవడం వల్ల 80 శాతం విద్యార్థులు సర్టిఫికెట్స్ కోసం ఉత్తీర్ణతను సాధించడం తప్ప ప్రాక్టికల్ నాలెడ్జ్ లేకుండా పోతుందని విద్యా వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గ్రీన్ ట్రిబ్యునల్ చేయని పని.. హైడ్రా చేస్తోంది

నవతెలంగాణ-సంగారెడ్డి



ఎన్నో చెరువు, ప్రభుత్వ భూముల కబ్జాలకు సంబంధించి తెలంగాణ జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ కోర్టు నుంచి ఏండ్ల తరబడి తీర్పులు రాలేదని.. వచ్చినా అమలు కాలేదని కానీ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైడ్రాతో చెర్వుల ఆక్రమణకు విముక్తి కల్గుతున్నదని తెలంగాణ కాలుష్య నియంత్రణ జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ జి. హనుమాన్ గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెర్వులే కాకుండా నీరు ప్రవహించే నాళాలపై ఉన్న కట్టడాలను కూడా తొలగించాలని, దాని వల్ల సిటీలో రోడ్లపై నీరు నిలిచి ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. హైడ్రాకు చట్టబద్ధత లేదని కోర్టుల్లో నిలవదని మీడియాలో కొంతమంది మాట్లాడేవాళ్లు.. ఎన్విరాన్‌మెంట్ ప్రొటక్షన్ యాక్ట్‌లోని వెట్ ల్యాండ్స్ కన్జర్వేషన్ అండ్ మేనేజ్‌మెంట్ రూల్స్ 2010 సెక్షన్ 5 సబ్ సెక్షన్ 5న చదివితే అర్థమవు తుందన్నారు. ఆ సెక్షన్ ప్రకారం హైడ్రా కొరకు అసెంబ్లీలో ఏ చట్టం కాని, గరవ్నర్ ఆర్డినెన్స్ అవసరం లేదని స్పష్టం చేశారు. 30 నుంచి 50 ఏళ్ల క్రితం ఇండ్లు నిర్మించిన నిర్మాణాలను తొలగించడం వల్ల నిరాశ్రయులైన పేదలకు వెంటనే గతంలో నిర్మించి సిద్ధంగా ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్లను కేటాయించి న్యాయం చేయాలని సూచించారు. హైడ్రా ఏర్పాటు చేసిన ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. హైడ్రాకు ప్రజల నుంచి పెద్దఎత్తున ప్రసంశలు, మన్ననలు వస్తున్నాయన్నారు.

శిల్ప వెంచర్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఆర్డీఓకి వినతి

నవతెలంగాణ-సంగారెడ్డి



సదాశివపేట మండలంలోని నర్సంపల్లి, పెద్దాపురం గ్రామాల్లో ఉన్న నల్లవాగును శిల్పవెంచర్ కబ్జా చేసిందని.. కాబట్టి ఆ వెంచర్ యాజమాన్యం పై చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో సంగారెడ్డి ఆర్డిఓ రాజుకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సదాశివపేట మండల పరిధిలోని 65వ జాతీయ రహదారికి ఆనుకుని నల్లవాగు పరివా హక ప్రాంతం ఉన్నదన్నారు. సదాశివపేట మండల పరిధిలోని నాగ్సాన్‌పల్లిలో నల్లవాగు సుమారు మూడు మీటర్ల వెడల్పుతో పారుతున్నదన్నారు. అలాంటి నల్ల వాగు కబ్జాకు గురైందన్నారు. మూడు మీటర్ల పొడవు ఉండే వాగును కుదించి మీటరున్నరకే వాగు ప్రవాహం ఉండేలా శిల్ప వెంచర్ యాజమాన్యం ప్లాట్లు చేసి విక్రయిస్తున్నారన్నారు. వాగు పక్కనే ఆక్రమణలు కనిపించకుండా పార్కులను ఏర్పాటు చేసి అమ్మకాలు చేస్తున్నారన్నారు. బఫర్ జోన్‌ను కాపాడని ఇరిగేషన్ అధికారులపై, నల్ల వాగు ఆక్రమించిన వెంచర్ యాజమాన్యం పైచర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మండపాల సమచారం ఇవ్వాలి

నవతెలంగాణ-కొండాపూర్



గణేష్ మండపాల అనుమతి కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని.. స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని ఎస్సై హరి శంకర్ గౌడ్ సూచించారు. గోకుల్ ఫంక్షన్‌హాల్‌లో బుధవారం సమావేశం ఏర్పాటు చేసి ఎస్ఐ మాట్లాడుతూ.. గణేష్ మండపాల ఏర్పాటుకు ఈనెల 6వ తేదీ సాయంత్రం లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వాహనాలు వెళ్లే దారిలో మండపాలతో రోడ్డును పూర్తిగా బ్లాక్ చేయొద్దన్నారు. డీజేలకు ఎట్టి పరిస్థితుల్లో అనుమతి లేదన్నారు. ప్రయివేట్ స్థలంలో మండపాలు ఏర్పాటు చేస్తే, ఆ యజమాని అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. మండపాల వద్ద ఎలాంటి గొడవలు జరిగినా ఆర్గనైజర్లదే బాధ్యత అన్ని స్పష్టం చేశారు. కరెంటు, ఫైర్‌కు సంబంధించిన సేఫ్టీ విధానాలు పాటించాలన్నారు. ఏదైనా ప్రమాదవశాత్తు ఘటన జరిగితే డయల్100కు సమాచారం ఇవ్వాలన్నారు.

తెలంగాణ భూ పోరాటాల చరిత్ర

- మెదక్ జిల్లాను ప్రగతి పథంలో ముందు వరుసలో వుంచాలి
- అర్హులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలి
- ప్రతి వ్యక్తికి నాణ్యమైన ఉచిత విద్య, వైద్యమే ప్రభుత్వ ధ్యేయం
- మెదక్ ప్రభుత్వ ఆసుపత్రిలో 30 రోజుల్లో సిటీ స్కాన్ సెంటర్, అదనపు బెడ్స్ ఏర్పాటు
- మెదక్ జిల్లా అభివృద్ధి సమీక్ష సమావేశంలో వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోద రాజనర్సింహ



నవతెలంగాణ-హవేలి ఘనాపూర్

తెలంగాణ భూ పోరాట చరిత్ర అని, భూ సమస్యల పరిష్కారానికి గ్రామస్థాయిలో రెవెన్యూ సదస్సులు నిర్వహించాలని మెదక్ జిల్లాలో ప్రగతి పథంలో ముందు వరుసలో అభివృద్ధి చేసే విధంగా ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనరసింహ అన్నారు. బుధవారం స్థానిక కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో విద్య, ఆరోగ్య, పంచాయతీ, మున్సిపల్, వ్యవసాయ, ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్, ఇరిగేషన్, విద్యుత్, అభయ హస్తం, ఆర్టీసీ శాఖలపై జిల్లా అభివృద్ధి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ విద్యాలయాల్లో, రెసిడెన్షియల్ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన ఉచిత విద్యను అందించాలన్నారు. రాష్ట్రంలో జబ్బు పడ్డ ప్రతివారికి ఉచిత నాణ్యమైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. అక్షయపాత్ర అదనపు వంటగదిని మెదక్‌లో ఏర్పాటు చేసుకోవడానికి అధికారులు దృష్టి సారించాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలలో పెండింగ్ పనులు పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ దవఖానలో 30 రోజుల్లో సిటీస్కాన్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ట్రామా, డయాలసిస్ సెంటర్లు ఏర్పాటు చేసి ప్రభుత్వ ఆసుపత్రిలో బెడ్లు పెంచాల్సిన అవసరం ఉందన్నారు. నూతనంగా ఏర్పాటు చేసిన మండలాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు నెలకొల్పాలన్నారు. జిల్లాలో ఉన్న పారిశ్రామికవేత్తలు విద్యను ప్రోత్సహించడానికి నిధులు కేటాయించాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రైవేటు ఆసుపత్రులు నిబంధనలు కచ్చితంగా పాటించాలని, రోగుల సమాచారం రికార్డ్ చేయాలని, ధరలు సూచిని ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో నూతన మెడికల్ కళాశాలకు అభ్యర్థించామని, అది పరిశీలనలో ఉందన్నారు. వ్యవసాయం లాభసాటి చేయాలని, జిల్లాలో అర్హత గల రైతులందరికీ రుణమాఫీ వర్తిస్తుందన్నారు.

నిరంతరం విద్యుత్ సరఫరా జరగాలి

మెదక్ శాసనసభ్యులు డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న రోడ్లు, భవనాలను పూర్తిచేయాలన్నారు. మెదక్ ప్రభుత్వ హాస్పిటల్‌ను పరిశుభ్రంగా ఉంచాలని, దోమలు లేకుండా చూడాలని, నిరంతరం వైద్య సిబ్బంది, అందుబాటులో ఉండాలని, రోగులను ప్రవేట్ హాస్పిటల్ పంపించే ప్రయత్నాలు చేయవద్దన్నారు. దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. దుబ్బాక శాసనసభ్యులు కొత్త ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ విద్య సౌకర్యాలు కల్పించాలని, పాఠశాలల విద్యార్థులకు సన్న బియ్యంతో భోజనం, ఏకరూప దుస్తులు, పుస్తకాలు అందించి విద్యార్థులకు విద్యను ప్రోత్సహించాలన్నారు. నర్సాపూర్ శాసన సభ్యులు సునీత లక్ష్మారెడ్డి మాట్లాడుతూ నిరంతరం విద్యుత్ కొనసాగాలని, పెండింగ్ భవనాలు రోడ్లు పూర్తి చేయాలన్నారు. రుణమాఫీపై స్పష్టమైన విధానాన్ని రైతులకు వివరించాలన్నారు. ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో భూ సమస్యలు ఉన్నాయని, వాటి పరిష్కార దిశగా ప్రయత్నం చేయాలన్నారు. జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ సమీక్ష సమావేశం సందర్భంగా మంత్రి, శాసనసభ్యులు, అధికారులు ఇచ్చిన సూచనలు తూచా తప్పకుండా పాటిస్తామని తెలిపారు. అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జిల్లాలో ధరణి పెండింగ్ కేసుల పరిష్కారం దిశగా రోజువారి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ పరిరక్షణ కోసం ఎస్ఎఫ్ఐ సమరశీల పోరాటాలు

అందరికీ విద్య-అందరికీ ఉపాధి సాధన కోసం

దేశవ్యాప్తంగా ఐక్య ఉద్యమాలు

ఎస్ఎఫ్ఐ ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షులు అతిమేల మానిక్

నవతెలంగాణ-సంగారెడ్డి



విద్యారంగ పరిరక్షణ కోసం ఎస్ఎఫ్ఐ సమరశీల పోరాటాలు చేస్తున్నదని ఎస్ఎఫ్ఐ ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షులు అతిమేల మానిక్ అన్నారు. ఎస్ఎఫ్ఐ సంగారెడ్డి జిల్లా విద్యా వైజ్ఞానిక శిక్షణ తరగతులు రెండ్రోజులపాటు కేవల్ కిషన్ భవన్‌లో జరిగాయి. ఈ సందర్భంగా అతిమేల మానిక్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. విద్యా రంగ పరిరక్షణ కోసం, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాలపై ఎస్ఎఫ్ఐ సమరశీల పోరాటాలు నిర్వహించే సంఘం అని, అందరికీ విద్య అందరికీ ఉపాధి సాధన కోసం ఎస్ఎఫ్ఐ దేశవ్యాప్తంగా ఉద్యమాలు నిర్వహిస్తున్నదన్నారు. భారత రాజ్యాంగంలో ఉచిత నిర్బంధ విద్య అందరికీ విద్య ఉపాధి కల్పించాలని ఉన్న పాలకులు మాత్రం పట్టించుకునే పరిస్థితి లేదన్నారు. విద్యారంగానికి కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో 10 శాతం రాష్ట్ర బడ్జెట్లో 30 శాతం నిధులు కేటాయించాలని ఉన్నా.. తగ్గించి కేటాయిస్తున్నారన్నారు. ప్రభుత్వ విద్యా పట్ల ప్రభుత్వాలు వివక్షత చూపిస్తూ ప్రైవేటు కార్పొరేట్ విద్యను ప్రోత్సహిస్తున్నాయ న్నారు. దాంతో విద్య అనేది పేద విద్యార్థులకు అందని ద్రాక్ష మిగిలిపోతున్నదన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విద్యారంగంలో అశాస్త్రీయమైన భావాలను చొప్పిస్తుందని, దేశ ఐక్యతను దెబ్బతీసే మతోన్మాద విధానాలకు పాల్పడుతున్నదన్నారు. విద్యార్థులు ఐక్యంగా వాటిని తిప్పికొట్టాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాలపై ఎస్ఎఫ్ఐ సమరశీల పోరాటాలు నిర్వహించే సంఘం అన్నారు. దేశవ్యాప్తంగా బలమైన విద్యార్థి ఉద్యమం నిర్వహించాలన్నారు. అధ్యయనం పోరాటం నినాదంతో స్వాతంత్రం ప్రజాస్వామ్యం సోషలిజం లక్ష్యాలతో శాస్త్రీయ విద్య విధానం కోసం ఎస్ఎఫ్ఐ ఉద్యమిస్తుందని అన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎర్రోళ్ల మహేష్ మాట్లాడుతూ.. విద్యార్థులు అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారన్నారు. ప్రభుత్వాలు మాత్రం పట్టించుకునే పరిస్థితి లేదని అన్నారు. విద్యార్థులకు పోరాటాలు తప్ప మరో మార్గం లేదని అన్నారు. సంక్షేమ హాస్టల్ గురుకుల విద్యార్థుల మెస్ కాస్మోటిక్ ఛార్జీలు పెంచాలని పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా గర్ల్స్ కన్వీనర్ వాణి, జిల్లా ఉపాధ్యక్షులు హరీష్, జిల్లా కమిటీ సభ్యులు విష్ణువర్ధన్, అర్జున్, స్వప్న, ప్రశాంత్, నాయకులు పావని, ఎస్ఎఫ్ఐ కార్యకర్తలు పాల్గొన్నారు.

జలదిగ్బంధంలో కోహెడ

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూసుకోవాలి

నీటి ప్రభావిత ప్రాంతాలను పరిశీలించిన కలెక్టర్ మనుచౌదరి, సీపీ అనురాధ

నవతెలంగాణ-కోహెడ





కోహెడ మండల కేంద్రంలో అధిక వర్షాలతో బాదుగుల చెరువు పూర్తిగా నిండి అలుగు పడడంతో బుధవారం బంధం ఏరియాలో ఉన్న ఇండ్లలోకి నీరు చేరుకొని ప్రజలు ఇబ్బందులను ఎదుర్కొన్నారు. డ్రైనేజీ పూర్తిగా నిండిపోయి ఇండ్లలోకి నీరు చేరుకోవడంతో సమాచారం తెలుసుకున్న కలెక్టర్ ఎం.మనుచౌదరి, సీపీ అనురాధ చేరుకొని బాధితులతో మాట్లాడి భరోసా కల్పించారు. వర్షాపాతానికి దెబ్బతిన్న ఇంటింటికి తిరుగుతూ బాధితులతో మాట్లాడారు. అలాగే అధిక వర్షాలతో దెబ్బతిన్న ఇండ్ల వివరాలను త్వరితగతిన అందించాలని, గ్రామపంచాయితి సిబ్బందితో కలిసి గ్రామంలో, పరిసర ప్రాంతాలలో నిలిచిన నీటిని జెసీబీతో కాలువతీసి నీటి తీవ్రతను తగ్గించాలని సూచించారు. కాలువలలో ఉన్న పిచ్చి మొక్కలను, ముళ్ళపొదలను చదును చేయించి ప్రజలకు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలని అధికారులకు సూచించారు. అలాగే ఫాగింగ్, నిలువ నీళ్ళలో ఆయిల్‌బాల్స్ వేయాలని, నాలాలపై అక్రమ నిర్మాణాలను గుర్తించి నివేదిక ఇవ్వాలన్నారు. అలాగే అతి వర్షాలతో చెడిపోయిన డ్రైనేజీని పరిశీలించి వెడల్పు, లోతు చేయడం సంబంధిత పనులకు ప్రతిపాదనలు పంపాలని పంచాయితీరాజ్ ఇంజనీర్, తహశీల్దార్ సురేఖ, ఎంపీవో శోభలను ఆదేశించారు. అలాగే వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉన్నందున వాటిని పట్టించి జిల్లా కేంద్రంలో ఉన్న ఎనిమల్స్ బర్త్ కంట్రోల్ సెంటర్‌లో ఆపరేషన్ చేయించి వదిలిపెట్టాలని గ్రామపంచాయితి అధికారులను ఆదేశించారు. బాదుగుల చెరువు నుంచి తీగలకుంటపల్లి చెరువు వరకు నాలాను పూర్తిగా నిర్మించుటకు, ఇదివరకు ఉన్న వాల్‌కు రిటైనింగ్ వాల్ ఎత్తు పెంచడం, లోతు పెంచి నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. ఆయన వెంట హుస్నాబాద్ ఆర్డీవో రామ్మూర్తి, ఏసీపీ వాసాల సతీష్, ఎంపీడీవో కృష్ణయ్య, తహశీల్దార్ సురేఖ, ఎంపీవో శోభ, ఎస్సై అభిలాష్, ఇరిగేషన్‌శాఖ అధికారులు, తదితరులు ఉన్నారు.

వినాయక ఉత్సవాలను ప్రశాంతంగా జరపాలి



నవతెలంగాణ-హత్నూర

వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని జిన్నారం సీఐ సుధీర్ కుమార్, హత్నూర ఎస్సై సుభాష్‌లు సూచించారు. మండలంలోని కాసాల గ్రామ శివారులో గల బీఎస్‌రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించే నిర్వాహకులకు బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. కులమతాలకు అతీతంగా భక్తిశ్రద్ధ లతో వినాయక నిమజ్జనం జరుపుకోవాలన్నారు. నిమజ్జనం రోజున చెరువు కుంటల వద్ద ఉత్సవ కమిటీ సభ్యులు తగిన జాగ్రత్తలు తీసుకని.. ముందస్తుగానే విద్యుత్ దీపాలు అమర్చుకోవాలన్నారు. అందుకు విద్యుత్ అధికారుల సహకారం తీసుకోవాలని సూచించారు. డీజేలు అనుమతించింది లేదన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ దావూద్ అహ్మద్, ఎంపీడీవో శంకర్, విద్యుత్ అధికారి ఏఈ విజయ్ కుమార్, ఇరిగేషన్ అధికారి వైష్ణవి, మండల నాయకులు వెంకటేశం, యాదయ్య, సతీష్ నాగప్రభు గౌడ్ తదితరులున్నారు.

శాంతియుత వాతావరణంలో పండగలు జరపాలి



నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్‌లో పండగలు శాంతియుతంగా జరపడం ఆనవాయితీ అని..ఆ చరిత్రను కాపాడేందుకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, ఆర్డీవో రాజు సూచించారు. జహీరాబాద్ పట్టణంలోని ఓ కళ్యాణ మండపంలో బుధవారం ఏర్పాటు చేసిన పీస్ కమిటీ సమావేశానికి వివిధ శాఖల అధికారులతో కలిసి హాజరై మాట్లాడారు. మినీ ఇండియా లాంటి ప్రాంతమైన జహీరాబాద్‌లో.. అన్ని వర్గాల వారు కలిసి మెలిసి పండగలు జరుపుతారన్నారు. ఆ చరిత్రను అలాగే కొనసాగించాలన్నారు. మాజీ మున్సిపల్ చైర్మన్ సుభాష్ గుప్తా మాట్లాడుతూ.. అధికారులు సమన్వయంతో వ్యవహరిస్తే కార్యక్రమాలన్నీ దిగ్విజయంగా పూర్తి చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక మంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, తహసీల్దార్ రాజశేఖర్, ఎంపీడీవో వెంకటరెడ్డి, ఇరిగేషన్ పంచాయతీరాజ్ శాఖల అధికారులు, నాయకులు మహమ్మద్ మొయిస్, అయ్యూబ్ ,సుదీర్ బండారి, నామ రవి కిరణ్, శీను, నరేష్, రాములు రాజు తదితరులు పాల్గొన్నారు.

మహిళా డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

నవతెలంగాణ-మునిపల్లి

మండలంలోని బుదిరాజ్ చౌరస్తాలో గల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో సీట్ల భర్తీ కోసం నేడు(గురువారం), రేపు స్పాట్ అడ్మిషన్లు చేపడుతున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అర్చన తెలిపారు. బీకాం సీఏ, బీకాం హానర్స్, బీఏ అలాగే బీబీఏలో మిగిలి ఉన్న సీట్లను భర్తీ చేయడానికి స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆసక్తి గల విద్యార్థులు నేడు, రేపు ఉదయం 9:30లకి హాజరు కావాలన్నారు. విద్యార్థులు కళాశాలకు వచ్చే ముందు ఎస్ఎస్సి, ఇంటర్ మార్కుల మెమోలు, కుల ఆదాయ సర్టిఫికెట్లు, ఐదో తరగతి నుండి పదవ తరగతి వరకు బోనఫైడ్స్, ఆధార్, టీసీ, 10 పాస్ ఫోటోలు తీసుకుని రావాలన్నారు. ఇంటర్ పూర్తి చేసుకున్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

శక్తి, శ్రీనిధి దినకర్లపై భెల్ యాజమాన్యం ఫిర్యాదు

నవతెలంగాణ-రామచంద్రాపురం

బీహెచ్ఈఎల్ క్యాంపస్‌లో, క్వార్టర్స్‌లో చట్టానికి విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని భెల్ యాజమాన్యం పేర్కొంది. గత నెల 29వ తేదీ రాత్రి బీహెచ్ఈఎల్ క్వార్టర్ నెంబర్ 16 వద్ద అనుమానాస్పదంగా ఉన్న శక్తి శ్రీనిధి, దినకర్లను భెల్ సెక్యూరిటీ ఆఫీసర్ గణేష్ నాయక్, హెూంగార్డ్ నరసింహులు తదితరులు పట్టుకున్నారు. అనంతరం వారి కుటుంబ సభ్యులు వచ్చిన తర్వాత వివరాలు సేకరించి వారికి అప్పజెప్పారు. ఈ ఘటనలో శక్తి శ్రీనిధి వారు తప్పులను కప్పిపుచ్చుకోవడం కోసం మరుసటి రోజు రామ చంద్రపురం పోలీస్ స్టేషన్‌లో సెక్యూరిటీ ఆఫీసర్ నిధులు నిర్వహిస్తున్న గణేష్ నాయక్, హెూంగార్డు నర్సింలు తదితరులు తమను వేధించారని పేర్కొంటూ ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ సంఘటనపై తీవ్రంగా స్పందించిన భెల్ యాజమాన్యం శక్తి శ్రీనిధి, దినకర్లపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని రామచంద్రాపురం పోలీస్‌స్టేషన్‌లో భెల్ టౌన్షిప్ అడ్మినిస్ట్రేషన్ అదనపు జనరల్ మేనేజర్ సూరన్ ప్రసాద్ భెల్ యాజమాన్యం తరఫున ఫిర్యాదు చేశారు.బీహెచ్ఈఎల్‌లో రాత్రి వేళల్లో దొంగతనాలు జరగడం, అసాంఘిక పనులు, గంజాయి సేవించే, మద్యం సేవించే వారి సంఖ్య పెరుగుతుండడంతో భెల్ యాజమాన్యం భద్రతను కట్టుదిట్టం చేయడంతో పాటు సెక్యూరిటీ పెట్రోలింగ్ పెంచింది. అందులో భాగంగా రాత్రి వేళల్లో విధులు నిర్వహిస్తున్న గణేష్ నాయక్, నర్సింలులకు క్వార్టర్ నెంబర్ 16 లో శ్రీనిధి, దినకర్లు ఉండడంతో వారిని పట్టుకున్నారు. తాళం వేసి ఉన్న ఇంటి లోపలికి వీరిద్దరూ ఎందుకు వెళ్లాల్సి వచ్చింది. ఆ ఇంట్లో ఏం చేస్తున్నారు అనే అంశాలపై దర్యాప్తు చేయాలని, చట్ట విరుద్ధంగా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన శ్రీనిధి, దినకర్ లపై కేసు నమోదు చేయాలని పేర్కొనడంతో పోలీసులు వారిపై కేసు నమోదు చేశారు.

ప్రభుత్వమే ఆదుకోవాలి



నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

గురుకులాల్లో పార్ట్ టైం టీచర్లుగా పనిచేస్తున్న తమను ప్రభుత్వమే ఆదుకోవాలని.. ఈ మేరకు బుధవారం రోజున ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి పలువు గురుకుల పార్ట్ టైం టీచర్స్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గురుకుల పాఠశాలలో పార్ట్ టైం టీచర్ల పనిచేస్తున్న 6000 మందిని ప్రభుత్వం విధుల నుంచి తొలగించిందన్నారు. తమకు మళ్లీ అవకాశం ఇచ్చి.. ప్రభుత్వమే ఆదుకోవాలని వారు ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు.

ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక





నవతెలంగాణ-సదాశివపేట

సదాశివపేట మండలంలోని మాల పాడు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న పి.గోవిందరావు, అలాగే వెల్టూర్ గ్రామానికి చెందిన స్కూల్ అసిస్టెంట్,సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయురాలు లక్ష్మణ్ పద్మావతిలు ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక య్యా రు. నేడు(గురువారం) టీచర్స్ డే సందర్భంగాఉత్తమ ఉపాధ్యాయులను ప్రభుత్వం ఎంపిక చేయగా.. అందులో తమ పేరు రావడం పట్ల వారు సంతోషం వ్య ం చేశారు.ఈ సందర్భంగా వారికి విద్యార్థులు, తల్లిదండ్రులు శుభాకాంక్షలు తెలిపారు.

శాంతి కమిటీ సమావేశం



నవతెలంగాణ-మునిపల్లి

ప్రశాంత వాతావరణంలో వినాయక నిమజ్జనం కార్యక్రమాన్ని జరపాలని మునిపల్లి ఎస్సై రాజేష్ నాయక్ సూచించారు. మండలంలోని బుదేరా గ్రామంలో గల ఒక ఫంక్షన్ హాల్‌లో బుధవారం శాంతి సమావేశం నిర్వహించారు.కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, యువజన సంఘాల ప్రతినిధులు గణేష్ మండప నిర్వహకులు వివిధమతాల ప్రతినిధులు పాల్గొన్నారు.

వీరభద్ర స్వామి ఆలయాన్ని సందర్శించిన విష్ణు దేవానంద్ జీ



నవతెలంగాణ-గుమ్మడిదల

హరిద్వార్ ఆనంద్ ప్రథమ ఆశ్రమ పీఠాధిపతి విష్ణు దేవానంద్ జీ గుమ్మడిదల మండల పరిధిలోని బొంతపల్లి వీరన్నగూడెం భద్రకాళి సమేత వీరభద్ర స్వామి దేవాలయాన్ని బుధవారం సరందర్శించారు. ఆలయ ఆస్థాన పురోహితులు వలివేటి కిరణ్ కుమార్ శర్మ విష్ణు దేవానంద్ జీతో భద్రకాళి సమేత వీరభద్ర స్వామికీ ప్రత్యేక పూజలు అభిషేకము, భద్రకాళి అమ్మవారికి కుంకుమార్చనలు చేయించారు. ఈ కార్యక్రమంలో వలివేటి సురేష్ కుమార్ శర్మ, ముక్కాల శంకర్ గుప్తా, మైత్రీ ఫౌండేషన్ చైర్మన్ చెన్నంశెట్టి ఉదయకుమార్ వైస్ చైర్మన్ శ్రీనివాస్ యాదవ్, సభ్యులు శ్రీకాంత్, ప్రీతమ్, హనీష్, తదితరులు పాల్గొన్నారు.

డీజే సౌండ్‌కు అనుమతి లేదు



నవతెలంగాణ-వట్‌పల్లి

గణేష్ మండపాల వద్ద డీజే సౌండ్‌కు అనుమతి లేదని ఎస్సై లక్ష్మణ్ తెలిపారు. వట్‌పల్లి పీఎస్‌లో బుధవారం ఏర్పాటు చేసిన కోఆర్డినేషన్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గణేష్ మండపాల వద్ద పాటించాల్సిన పద్ధతుల గురించి వివరించారు. కులమతాలకు అతీతంగా ఉత్సవాలు జరపాలన్నారు. మండపాల వద్ద విద్యుత్ అవసరం ఉంటే.. సంబంధిత అధికారులను సంప్రదించి అనుమతి తీసుకోవాలన్నారు. విగ్రహాన్ని నిలబెట్టాలంటే.. గ్రామపంచాయతీ కార్యదర్శుల నుంచి ధ్రువీకరణ పత్రాన్ని తీసుకోవాలన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరిగితే పోలీసులకు చెప్పాలన్నారు. డీజే సౌండ్‌కు అనుమతి లేదని.. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసరావు, డిప్యూటీ తహసీల్దార్ షంబిరెడ్డి, ఏఎస్సైలు విట్టల్, హమ్మద్ హుస్సేన్, హెడ్ కానిస్టేబుల్ సుందర్‌రాజ్, రైటర్ ప్రతాప్, పీసీ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు

దెబ్బతిన్న రోడ్లను పరిశీలించిన మొహీద్ పటేల్

నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్



భారీ వర్షాలకు ఖేడ్ మున్సిపాల్టీ పరిధిలో దెబ్బతిన్న శివాజీచౌక్ నుంచి వెంకటేశ్వర థియేటర్, ఖురేషీ మస్జిద్, కూరగాయల మార్కెట్, సువర్ణ థియేటర్‌రోడ్డు, మున్సిపాలిటీ పరిధిలోని ఇతర రహదారులను నారాయణఖేడ్ ఎంఐఎం అధ్యక్షులు, న్యాయవాది మొహీద్ పటేల్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నారాయణఖేడ్ మున్సిపాల్టీ పరిధిలో రోడ్లన్ని గుంతలమయంగా తయారయ్యాయన్నారు. మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. మున్సిపల్ చైర్మన్, కమిషనర్ మున్సిపాల్టీ పరిధిలోని రోడ్లకు మరమ్మతులు చేయించి మెరుగుపరచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎం నాయకులు మజ్హర్, చంద్ పాషా, అంజెద్, మంసూర్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయిలో హైడ్రా!

- సీఎం ప్రకటనతో జిల్లాలోని కబ్జాకోరుల గుండెల్లో రైళ్లు..
- నాడు అనుమతి ఇచ్చిన అధికారులకు టెన్షన్

నవతెలంగాణ-జహీరాబాద్

జిల్లా స్థాయిలో కూడా హైడ్రా లాంటివి ఏర్పాటు చేసి.. పట్టణ ప్రాంతాల్లో కబ్జాలకు గురైన నాళాలు, చెరువులను పునర్నిర్మించేందుకు చర్యలు చేపట్టాలని సీఎం రేవంత్ రెడ్డి జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో అక్రమంగా నిర్మాణాలు చేపట్టిన వారి గుండెల్లో ఒకింత రైళ్లు పరుగెడుతున్నాయి. జిల్లాలోని సదాశివపేట, సంగారెడ్డి, పటాన్చెరు, జహీరాబాద్, అమీన్పూర్, నారాయణఖేడ్, జోగిపేట్ లాంటి పట్టణ ప్రాంతాల్లో తమ పలుకుబడిని ఉపయోగించి కొందరు గత ఐదేండ్లలో నాళాలు, చెరువులు, చెక్ డ్యాములను సైతం కబ్జా చేసి వెంచర్లను ఏర్పాటు చేసిన విషయం బహిరంగ రహస్యం. వారి ఒత్తిళ్లకు లొంగిన అధికారులు బఫర్ జోన్లను సైతం వెంచర్లుగా మార్చేందుకు అనుమతులు ఇచ్చారన్న ఆరోపణలు ఉన్నాయి. పేరుగాంచిన రియల్ ఎస్టేట్ సంస్థలు సైతం ఈ విధమైన అక్రమాలకు పాల్పడ్డినట్టు పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నాయి. ఇందుకు సంబంధించి ఇప్పటికే జిల్లాలోని పలు పట్టణ ప్రాంతాల నుంచి నేరుగా పలువురు పర్యావర ణవేత్త లు, సామాజిక ఉద్యమకారులు ముఖ్యమంత్రికి ఉత్తరాలు రాశా రన్న విషయం బయటకు వచ్చింది. ఈ విషయాన్ని స్వయా నా ముఖ్యమంత్రి కూడా జిల్లాల నుంచి కూడా ఎన్నో ఫిర్యా దులు వస్తున్నాయని విలేకరుల సమావేశంలో చెప్పడం గమనార్హం.

జహీరాబాద్ ప్రాంతంలో జాతీయ పెట్టుబడి సంస్థ నిమ్జ్ మంజూరైన నాటి నుంచి పెద్ద పెద్ద రియల్ ఎస్టేట్ వ్యాపారవేత్తలు పట్టణానికి 40 కిలోమీటర్ల లోపల ఉన్న మారుమూల గ్రామాల్లో, మండల కేంద్రాల్లో సైతం కారుచౌకగా భూములను కొనుగోలు చేసి అందులో వెంచర్లను విక్రయించారన్న ఆరోపణలు ఉన్నాయి. జహీరాబాద్ పట్టణంలో సైతం పట్టణ పరిధిలోని లోతట్టు ప్రాంతాల్లో నూతనంగా వెలిసిన కాలనీలో కూడా చెరువులు, వాగులు, బఫర్ జోన్ ప్రాంతాల్లో అక్రమంగా వెంచర్లను వేసి నాళాలపై నిర్మాణాలు చేపట్టడంతో.. గత నాలుగేండ్లుగా వరదనీరు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడి ఇండ్లల్లోకి నీరు వస్తున్న విషయం విధితమే. కాగా ఈ వెంచర్లలో నాడు జిల్లా కలెక్టర్, మంత్రులు పర్యటించి అక్రమ నిర్మాణాలను కూల్చివేసి నాళాలపై నిర్మించిన నాలిలను తొలగించి యథావిధిగా నాళాలు ఏర్పాటు చేయడంతో ఈ సంవత్సరం లోతట్టు ప్రాంతాల్లో ఉన్న కాలనీల్లో.. వరదనీరు ఇండ్లలోకి చేరలేదు. జహీరాబాద్ ప్రాంతంలో భూముల విలువలు పెరగడంతో నాళాలు చెరువులు వాగులు, బఫర్‌జోన్లు పెద్దసంఖ్యలో వెంచర్లుగా మారాయన్న ఆరోపణలు ఉన్నాయి. వాటికి సంబంధించి ఇదివరకే పలువురు రాష్ట్రస్థాయిలో ఫిర్యాదు చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. జిల్లా కలెక్టర్ హైడ్రాను ఏర్పాటు చేస్తే తక్షణమే జిల్లాలో కూడా ఫిర్యాదుల పరంపర కొనసాగే ఆస్కారం ఉందని ప్రజలు అంటున్నారు. ప్లాట్లు కొన్న వారిని, ఇండ్లు నిర్మించుకున్న వారి ఇండ్లను ధ్వంసం చేసే ముందు ఆ ఇంటి యజమానికి ఎవరైతే వెంచర్లుగా మార్చి ప్లాట్లు విక్రయించారో వారి వద్ద నుండి నష్టపరిహారాన్ని వసూలు చేసి ప్రస్తుత ఇంటి యజమానికి ఇవ్వాలని పలువురు కోరుతున్నారు. కోహిర్ మండలంలోని పలు గ్రామాల్లో ఉన్నట చెక్ డ్యాములను సైతంకబ్జా చేసి.. అందులో ప్లాట్లు చేసి విక్రయించారన్న ఆరోపణలు ఉన్నాయి. జహీరాబాద్ మండలంలోని తూముకుంట, బూచినెల్లి, అలుగోలు గ్రామంలోని ఉసుకే వాగు, జట్టప్ప కుంటలపై ప్రభుత్వ నిధులతో ఏర్పాటు చేసిన మూడు చెక్ డ్యామ్‌లను సైతం ధ్వంసం చేశారన్న ఆరోపణలు ఉన్నాయి.



అధికారుల గుండెల్లో సైతం గుబులు..

గతంలో పాలకుల ఒత్తిళ్లకు లొంగి, వెంచర్ నిర్వాహకులకు జై కొట్టిన అధికారులు నేడు టెన్షన్‌లో పడ్డారు. జహీరాబాద్‌తో పాటు జిల్లాలోని ప్రధాన పట్టణ ప్రాంతాల్లోని బఫర్‌జోన్లలో, చెక్‌డ్యాముల్లో, నాళాల్లో సైతం వెంచర్ల నిర్మాణానికి అనుమతులు ఇచ్చారన్న ఆరోపణలు ఉన్నాయి. అలా అనుమతులు ఇచ్చిన అధికారుల పై కూడా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించడంతో ఇక్కడి నుండి స్థాన చలనం అయిన అధికారులు సైతం తమ భవిష్యత్తు ఏంటని గుబులు చెందుతున్నారు. ప్రధానంగా ఇరిగేషన్ శాఖకు చెందిన పలువురు నాటి జిల్లా స్థాయి అధికారులు పెద్ద మొత్తంలో అనుమతులు ఇచ్చారన్న ఆరోపణలు ఉన్నాయి. వాటిని ఆధారంగా చేసుకొని నియోజకవర్గ స్థాయి అధికారులు సైతం వెంచర్నిర్వాకులకు జై కొట్టారన్న ఆరోపణలు వెలువడుతున్నాయి. ప్రభుత్వం జిల్లా స్థాయిలో హైడ్రాను ఏర్పాటు చేస్తే ఏం పరిణామాలు చోటు చేసుకుంటాయో వేచి చూడాలి మరి.

అంతిమయాత్రలోనూ అసౌకర్యాలే..

- స్మశానవాటికలకు రోడ్లు సరిగా లేక తీవ్ర ఇబ్బందులు
- చినుకు పడిందంటే అంతే సంగతులు..
- మురికి నీళ్లు, బురదల్లోనే శవాలను తీసుకెళ్లే దుస్థితి

నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ పట్టణంలో వివిధ వర్గాలకు చెందిన స్మశానవాటికలకు సరైన విధంగా రోడ్లు లేకపోవడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. చిన్న చినుకు పడిన రోడ్డు మొత్తం చిత్తడిగా మారుతుంది. దాంతో మురుగు నీరు, బురదల్లోనే శవాలను మోసుకెళ్లాల్సిన దుస్థితి నెలకొన్నదని స్థానికులు వాపోతున్నారు. కనీసం చావునైనా పట్టించుకోండంటూ ప్రజాప్రతినిధులనకు, అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.



జహీరాబాద్ పట్టణంలోని మాణిక్ ప్రభు వీధికి చెందిన వివిధ వర్గాలకు సంబంధించి కేటాయించిన స్మశానవాటికకు గత ప్రభుత్వం నిధులు కేటాయించిన విషయం తెలిసిందే. తదుపరి అనంతరం జరిగిన పరిణామాలతో రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో ఆ ప్రభుత్వం ప్రతిపాదించిన పనులన్నింటినీ ప్రస్తుత పాలకులు రద్దు చేశారు. దాంతో పట్టణ ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ప్రధానంగా జహీరాబాద్ పట్టణంలోని హిందూ, ముస్లిం, క్రిస్టియన్ వివిధ వర్గాలకు చెందిన స్మశాన వాటికకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. స్మశాన వాటికకు సరైన రోడ్డు మార్గం లేకపోవడంతో మురికి నీళ్లలోంచే శవాలను మోసుకెళ్లాల్సి వస్తోంది. దాంతో చివరి చూపు కోసం స్మశానవాటికి వద్దకు వచ్చే వృద్ధులు.. కుటుంబ సభ్యులు నానా అవస్థలు పడుతున్నారు. జహీరాబాద్ పట్టణంలో విలీన గ్రామాలుగా ఉన్న హెూతికే, చిన్నహైదరాబాద్, పస్తాపూర్, రంజూల్, లలో కూడా ఇదే దుస్థితి నెలకొన్నది. ఈ విషయంపై వెంటనే పురపాలక సంఘం కమిషనర్ ప్రత్యేక చొరవ చూపి రోడ్డు మార్గం ఏర్పాటు చేయించాలని పలువురు కోరుతున్నారు. అలాగే స్మశాన వాటికలో కనీస సౌకర్యాలను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

పాఠశాలల్లో మౌలిక వసతుల కోసం 'ఆర్కే ఫౌండేషన్' కృషి



నవతెలంగాణ జిన్నారం

మండల పరిధిలోనీ పారిశ్రామిక ప్రాంతమైన కాజిపల్లి పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు ఆర్కే ఫౌండేషన్ కృషి చేస్తున్నదని ఆర్కే ఫౌండేషన్ చైర్మెన్ అడ్వకేట్ దండే రమాకాంత్ తెలిపారు. గ్రామస్తుల సహాయ సహకారాలతో కార్యక్రమాలను ముమ్మరంగా చేపడుతున్నట్టు చెప్పారు. గతంలో పాఠశాలకు సంబంధించి మెదక్ జిల్లా ప్రజా పరిషత్ మాజీ చైర్మెన్ దండే రామకృష్ణ పాఠశాలకు ఉచితంగా భూమి ఇచ్చారన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా అధ్యాపక బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక పాఠశాల విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో ఆర్కే ఫౌండేషన్ సంసిద్ధంగా ఉంటుందని దండి రమాకాంత్ తెలిపారు.



అంగన్‌వాడీల్లో పోషణ మాసోత్సవాలు

నవతెలంగాణ-కొండాపూర్

మండలంలోని హరిదాస్పూర్ గ్రామ అంగన్వాడీ కేంద్రంలో పోషణ మహెూత్స కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. అంగన్వాడీ టీచర్లు పోషణమాసం సందర్భంగా పౌష్టిక ఆహారంపై గర్భిణులు, బాలింతలు, పిల్లల ఎదుగుదల కోసం, క్షేత్రస్థాయిలో రక్తహీనత, బరువు తగ్గడం పెరగడంపై అవగాహన కల్పించారు. గర్భిణీ స్త్రీలకు సామాహిక శ్రీమంతం చేయించారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ చంద్రకళ,సూపర్వైజర్ శ్యామల, ప్రైమరీ స్కూల్ టీచర్ అనిత,ఏపీ ఎఫ్ సుజాత,అలేఖ్యమహిళలు పాల్గొన్నారు.

వలస కుటుంబాలకు మౌలిక వసతుల కల్పనకు కృషి

- సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి వల్లూరు
- కాజిపల్లిలో పాఠశాల నిర్మాణానికి స్థల పరిశీలన
- బొల్లారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

కాజిపల్లిలోని వలస కుటుంబాలకు.. కాలనీలో మౌలిక వసతులు మెరుగు పర్చడానికి కృషి చేస్తామని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అన్నారు. బొల్లారం, కాజిపల్లి గ్రామాల్లో బుధవారం ఆమె పర్యటించారు. ముందుగా ఖాజిపల్లి గ్రామంలోని జిఎంఆర్ కాలనిలో వలస కుటుంబాలతో సమావేశమయ్యారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి కావాల్సిన మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని వారికి కలెక్టర్ భరోసానిచ్చారు. అనంతరం కాలనీలో పాఠశాల నిర్మాణం కోసం స్థల పరిశీలన చేశారు. అలాగే అంగన్వాడి పాఠశాలను తనిఖీ చేశారు.



జిన్నారం మండలంలో తాగునీటి ఎద్దడికి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశిం చారు. అనంతరం బొల్లారం మున్సిపల్ పరిధిలో ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ఆదేశించారు. సిబ్బంది పనితీరును పరిశీలించారు. తదనంతరం బొల్లారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్నితనిఖీ చేశారు ఆసుపత్రిలో రోగులతో మాట్లాడి.. ఆస్పత్రిలో అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు.రోగులకు మెరుగైన వైద్యం అందించి ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో నమ్మకం కలిగిం చాలని సిబ్బందిని ఆదేశించారు. సమయపాలన పాటిం చాలని వరాల కారణంగా వైరల్ ఫీవర్ లు, సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున అవసరమైన ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. బొల్లారంలో బీఎల్వోలు సర్వే చేస్తున్నా.. ఓటరు జాబితా ఎస్ఎస్ఆర్ పరిశీలనలో భాగంగా కలెక్టర్ ఇంటింటికి తిరిగి ఓటర్ల జాబితా సర్వే పరిశీలించారు. అనంతరం గ్రామ శివారులోని మాదవానికుంట చెరువును పరిశీలించారు. చెరువు ఎఫ్‌టీఎల్ పరిధి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ భూములు, చెరువులను కాపాడుకోవాలన్నారు. గ్రామంలోని రెసిడెన్షియల్ పాఠశాలలో ఎస్ఎస్ఆర్ ఫండ్స్ కింద అవసరమైన మరమ్మత్తు పనులు.. మౌలిక వస్తువులు కల్పనకు చర్యలు తీసుకోవాలని రెవెన్యూ, పరిశ్రమల శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఎంఅండ్‌హెచ్ఓ గాయత్రీ దేవి, తహసీల్దార్ బిక్షపతి, మునిసిపల్ చైర్మెన్ రోజా బాల్‌రెడ్డి, బొల్లారం మునిసిపల్ కమిషనర్ మంగతాయారు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్లకు ధీటుగా ప్రభుత్వబడుల్లో కంప్యూటర్ విద్య

- ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి
- జడ్పీహెచ్ఎస్ బాలికల బాలుర పాఠశాలలో కంప్యూటర్ ఎడ్యుకేషన్ ప్రారంభం

నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

కార్పొరేట్లకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో కంప్యూటర్ ఎడ్యుకేషన్ నిర్వహిస్తామని ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. బ్రైట్ షీల్డ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నారాయణఖేడ్ జడ్పీహెచ్ఎస్ బాలికల బాలుర పాఠశాలలో కంప్యూటర్ ఎడ్యుకేషన్‌ను బుధవారం రోజున ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మెన్ కృష్ణ ప్రముఖ వ్యాపారవేత్త అమూల్య రెడ్డి, మార్కెటింగ్ మేనేజర్ కార్తీక్, అభిలాష్, వంశీ, టీమ్‌మెంబర్స్ మాట్లాడుతూ.. కంప్యూటర్ ఎడ్యుకేషన్‌ని తాము ఓ ఛాలెంజ్‌గా తీసుకుంటున్నామ నారు. విద్యార్థులకు మూడు నెలలపాటు దేశభక్తి, నైపుణ్యం, విజ్ఞానం పెంపొదించే విధంగా శిక్షణ ఇస్తామన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నాణ్యమైన సాంకేతిక విద్య.. నైపుణ్యంతో విద్యార్థులను తీర్చిదిద్దే విధంగా కృషి చేస్తున్నందుకు బ్రైట్ చైల్డ్ ఫౌండేషన్ సంస్థ వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. వారికి తమవంతు సహకారాలు ఎప్పటికీ ఉంటాయని హామీ ఇచ్చారు. నారాయణఖేడ్ ప్రాంతంలో విద్యా వైద్యంపై ప్రత్యేక దృష్టి పెడుతు న్నామన్నారు. ఆ దిశగా ఎల్లవేళలా కృషి చేస్తున్నామన్నారు. స్వచ్ఛంద సంస్థలు, సాంకేతిక విద్యపై కేంద్రీకరించడానికి స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలన్నారు. బ్రైట్ షీల్డ్ ఫౌండేషన్ వారు నారాయణఖేడ్లో రెండు పాఠశాలలు ఎంపిక చేసుకున్నారని.. మిగతా పాఠశాలలు కూడా ఎంపిక చేసే విధంగా కృషి చేయాలని అందుకు తనవంతు సహకారం అందిస్తా నన్నారు. కాగా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటామని విద్యార్థులు ఎమ్మెల్యేకు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ ఆనంద్ స్వరూప్ శేట్కార్, వైస్ చైర్మెన్ శంకర్‌సెట్, కౌన్సిలర్లు, హనుమాన్లు, రాజేష్ రామ కృష్ణ వివేకానంద సయ్యద్, కాంగ్రెస్ నాయకులు తహీర్, వినోద్ పాటిల్, రమేష్ చౌహన్,ముంతాజ్ సెట్‌తదితరులు పాల్గొన్నారు.



మెరుగైన వైద్య సేవలు అందించాలి

నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందించాలని ఫోరమ్ ఫర్ బెటర్ సంగారెడ్డి ఆధ్వర్యంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనిల్ కుమార్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఫోరమ్‌ఫర్ బెటర్ సంగారెడ్డి అధ్యక్షులు శ్రీధర్ మహేంద్ర మాట్లాడుతూ.. సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రి బోధన ఆసుపత్రిగా మారడం వల్ల ఆసుపత్రికి వచ్చే రోగుల సంఖ్య పెరిగిందన్నారు. కాబట్టి రోగులకు మెరుగైన సేవలు అందించడానికి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు మందుల కొరత లేకుండా చూడాలని, దివ్యాంగులకు, వృద్ధులకు ప్రత్యేక ఓపి కౌంటర్‌లు ఏర్పాటు చేయాలని, గర్భిణీలకు ప్రసుతి ఇతర రోగులకు మెరుగైన శాస్త్రా చికిత్స విధానాన్ని అమలులో చేయాలని కోరారు. రోగులకు మెనూ ప్రకారం అల్పాహారం ఆహారం శుద్ధి చేసిన తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరారు. ప్రభుత్వ అంబులెన్సులు అందుబాటులో ఉంచి ప్రయివేట్ అంబులెన్సుల దోపిడీని అరికట్టాలన్నారు. అత్యవసర సేవల విభాగంలో బెండ్ల సంఖ్య పెంచి రోగులకు మెరుగైన చికిత్స అందించాలని అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫోరమ్ సహా కార్యదర్శి శ్రీకాంత్, కార్యవర్గ సభ్యులు సాయి, వరాల, రాజు, మార్కుంది తదితరులు పాల్గొన్నారు.



రెసిడెన్షియల్ పాఠశాలల టీచర్లకు పని ఒత్తిడి తగ్గించాలి



నవతెలంగాణ-సంగారెడ్డి

రెసిడెన్షియల్ పాఠశాలల టీచర్లకు పని ఒత్తిడి తగ్గించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.సాయిలు అన్నారు.టీఎస్‌యూటీఎఫ్ సంగారెడ్డి మండల సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా ఎంజెపి గర్ల్స్ సంగారెడ్డి, జెడ్పీహెచ్ఎస్ కొత్తలాపూర్, జెడ్పీహెచ్ఎస్ పోతిరెడ్డిపల్లి, జెడ్పీహెచ్ఎస్ కలబ్‌గూర్‌తోపాటు పలు ప్రాథమిక పాఠశాలలను టీఎస్‌యూటీఫ్ టీం బుధవారం సందర్శించింది. ఈ సందర్భంగా బి.సాయిలు మాట్లాడుతూ.. పాఠశాలల్లో ఉపాధ్యాయులకు బోధనేతర పనులు ఎక్కువ కావడం వల్ల బోధన సమయం తగ్గుతున్నదని.. కాబట్టి బోధనేతర పనులైన ఆన్‌లైన్ వర్క్స్ తగ్గించాలని, ఉపాధ్యాయులను పూర్తిగా బోధనకు పరిమితం చేస్తే విద్యార్థులకు పూర్తి న్యాయం జరుగుతుందని ఆ ప్రయత్నం రాష్ట్ర ప్రభుత్వం చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా రెసిడెన్షియల్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు అని భారం ఎక్కువైనందువల్ల పని భారం తగ్గించాలని, నైట్ స్టడీ అవర్ కోసం కేర్ టేకర్స్ నియమించాలని, 010 హెడ్ కింద జీతాలు చెల్లించాలని, వారికి హెల్త్‌కార్డ్స్ ఇచ్చి ఉచిత వైద్యం కల్పించాలని, టైం టేబుల్ లో మార్పులు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ నాయకులు వై.సైమన్, ఆర్.సింహాచలం, ఆయా పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నీళ్లలోనే పంట పొలాలు..

నవతెలంగాణ-న్యాల్‌కల్

ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలకు గత కొద్ది రోజులగా పంట పొలాలు నీటిలోనే మునిగిపోయి ఉన్నాయి. వర్షం కొంచెం తగ్గుముఖం పట్టినప్పటికీ.. కొన్ని రోజుల పాటు దంచి కొట్టడంతో వరద నీరు ఇప్పటికీ చేన్లలోనే ఉన్నది. దాంతో పెసర, మినుము, పత్తి , కంది పంటల కు తీవ్ర నష్టం వాటిల్లిందని రైతులు వాపోతున్నారు. అలాగే మంజీరా బ్యాక్ వాటర్ దిగువ నీటితో పంటల అపార నష్టం కలిగిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గీతమ్‌లో ఘనంగా 'ఫ్రెషర్స్ డే' వేడుకలు



నవతెలంగాణ-పటాన్‌చెరు

గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం హైదరాబాద్ ప్రాంగణంలో ఫ్రెషర్స్ పార్టీని బుధవారం ఘనంగా నిర్వహించారు. టెక్నాలజీ, మేనేజిమెంట్, సిస్ఫ్, ఫార్మసీ, ఆర్కిటెక్చర్, హ్యూమానిటీస్ లో 2024-25 విద్యా సంవత్సరంలో కొత్తగా చేరిన విద్యార్థుల కోసం సీనియర్ విద్యార్థులు దీనిని ఏర్పాటు చేశారు.నూతన విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని కలిగించడం, వారిలోని సృజనాత్మకతను వెలికితీసి, విద్యార్థుల మధ్య స్నేహాన్ని పెంపొందించి, వారంతా తమ స్వగృహంలోనే ఉన్నామనే భద్రతా భావనను కలిగించే లక్ష్యంతో ఫ్రెషర్స్ పార్టీని నిర్వహించారు. ఈ యేడాది వేడుకల్లో ఆకర్షణీయమైన ర్యాంప్ వాక్, సాంప్రదాయ - సమకాలీన నృత్య ప్రదర్శనలు, స్థానిక జానపద బ్యాండ్లు, బాలీవుడ్ హిట్లతో కూడిన శ్రావ్యమైన పాటలు, వినోదాత్మక స్కిట్లు విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపాయి. విద్యా లక్ష్యాలను నెరవేర్చుకోవడంతో పాటు బాధ్యతాయుతమైన పౌరులుగా, వృత్తి నిపుణులుగా ఎదిగాలని ప్రతి ఒక్కరూ దీక్ష బూనాలని మేనేజిమెంట్ ప్రతినిధులు ఫ్రెషర్స్ కు సూచించారు. గీతం కుటుంబంలోకి వారికి సాదరంగా స్వాగతించారు. సీనియర్ల నుంచి తమకు లభించిన సాదర స్వాగతానికి ఫ్రెషర్లు కృతజ్ఞతలు తెలిపారు. ఈ వేడుకలను విజయవంతం చేయడానికి వారు చేసిన ప్రయత్నాలను అభినందించారు.

సత్తయ్యగౌడ్ కుటుంబానికి కార్పొరేటర్ పరామర్శ

నవతెలంగాణ-జిన్నారం

మండల కేంద్రానికి చెందిన బొంతపల్లి సత్తయ్య గౌడ్ అనారోగ్యంతో ఇటీవలే మృతి చెందాడు. ఈ విషయం తెలిసి.. పటాన్చెరువు కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్ బుధవారం రోజున సత్తయ్య కుటుంబాన్ని పరామర్శించారు. ఆయనతోపాటు బీఆర్ఎస్ రాష్ట్ర నేత వెంకటేశం గౌడ్, జిన్నారం మండలం బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రాజేష్, బీఆర్ఎస్ మండల యువజన విభాగం అధ్యక్షులు రామకృష్ణ బృందం పాల్గొన్నారు.



హరీష్ రావుపై దాడి పట్ల ఖండన

- మెదక్ పట్టణ బీఆర్ ఎస్ కన్వీనర్ మామిళ్ళ ఆంజనేయులు



నవతెలంగాణ-మెదక్ టౌన్

ఖమ్మం జిల్లాలో వరద బాధితులను ఆదుకోవడానికి వెళితే మాజీ మంత్రి హరీష్ రావు, సబితా ఇంద్రారెడ్డి, పువ్వాడ అజయ్ కుమార్, జగదీశ్వర్ రెడ్డిలపై దాడిని ఖండిస్తున్నామని మెదక్ పట్టణ బీఆర్ఎస్ పార్టీ కన్వీనర్ మామిళ్ళ ఆంజనేయులు అన్నారు. ప్రతిపక్షాలపై దాడి చేయడం అంటే ప్రజాస్వామ్యంపై దాడి చేసే ప్రశ్నించే గొంతులపై దాడి చేయడమేనన్నారు. బీఆర్ఎస్ విస్తృతంగా పర్యటిస్తూ వరద బాధితులను ఆదుకుంటుంటే తట్టుకోలేని మంత్రులు, సీఎం రేవంత్ రెడ్డి ప్రజా వ్యతిరేకతను చూసి తట్టుకోలేకనే ప్రతిపక్ష నాయకులపై దాడి చేయించడం సిగ్గుచేటన్నారు. మృతుల కుటుంబానికి రూ.25 లక్షలు ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన మొదటి నుంచి దాడుల నైజాన్ని తీసుకొచ్చి అడ్డుకోవాలని చూస్తే ప్రజా ఉద్యమంతో తిరుగుబాటు చేస్తామని హెచ్చరించారు.

శిథిలావస్థలో ఉన్న ఇండ్ల కూల్చివేత

- మున్సిపల్ చైర్ పర్సన్ మామిండ్ల జ్యోతి కృష్ణ



నవతెలంగాణ-తూప్రాన్

భారీ వర్షాల కారణంగా మున్సిపాలిటీలోని 15వ వార్డులో దెబ్బతిన్న ఇండ్లను, శిథిలావస్థలో ఉన్న ఇండ్లను బుధవారం మున్సిపల్ అధికారులతో కలిసి మున్సిపల్ చైర్ పర్సన్ మామిండ్ల జ్యోతి కృష్ణ ముదిరాజ్ కూల్చి వేయించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ మామిండ్ల జ్యోతి కృష్ణ మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని శిథిలావస్థలో ఉన్న పాత ఇండ్లను తీసివేయాల్సిందిగా వార్డు ప్రజలు కోరగా, మున్సిపల్ చైర్ పర్సన్ మాటతో ఏకీభవించిన ప్రజలు పాత శిథిలావస్థలో ఉన్న ఇండ్లను తొలగించామన్నారు. తదనంతరం గ్రంథాలయంలో చేరిన వర్షపు నీటికి ఏర్పడ్డ నాచుని బ్లీచింగ్ పౌడర్‌తో శుభ్రం చేయించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు శ్రీశైలం గౌడ్, పల్లెర జ్యోతి రవీందర్ గుప్తా, జమాల్పూర్ లక్ష్మీబాయి నర్సోజి, మున్సిపల్ సిబ్బంది మధు, వినోద్, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

గురు బ్రహ్మ

చీకటి బతుకుల్లో
వెలుగును పెంచే జ్యోతిగ
తాను కాలుతూ వెన్నెల కాంతిని
పంచే విజ్ఞానపు ఘని గురువు

నిస్వార్థపు రెక్కలు కట్టుకొని
తనకంటే ఎత్తుకు ఎదిగేలా చేసి
ఉన్నత శిఖరాలు ఎక్కించి
తన్మయించి తరించే
తపోధనుడు గురవు

విలువల విత్తనాలేసి
నవ సమాజ నిర్మాణమునకై
తొలి అడుగు వేసే చైతన్యంనింపి
ముందుకు నడుపేది గురువు

అమ్మ నాన్నలిచ్చిన తనువులో
ఆయువు పోసి అక్షర బీజాలు వేసి
కలుపు మొక్కలనేరేటి యుక్తిని
నింపికర్మ యోధుల్ని చేసేది గురువు

విజ్ఞానపు వెలుగు నింపి
విశ్వమందు చీకటిని బాపే
వీర జవానులను చేసి
విజయ పథమున నడిపించేది
గురువు



డా.బి.సుధాకర్
సిద్ధిపేట



గురువు గురువు గురువు గురువు గుండె దరువు
గురువు యాది కొస్తేనే జ్ఞాపకాల దరువు

చిన్ననాట తడబడిన అడుగుల సవ్వడి గురువు
గుండ్రటి అక్షరాలు దిద్దించి విజ్ఞానం అందించే గురువు
ఆటపాట మాటలతో చిందులేసిన గురువు
కండల్లో తిరుగుతుండు క్షణక్షణం మన గురువు

అసాధ్యాలను సుసాధ్యం చేసిది గురువు
అందనంత విజయాలకు మమ్ము పంపి గురువు
తాను బడిలోనే ఉండి మురుస్తాడు గురువు
ఎన్నటికీ మరువలేని అక్షర సౌధం మన గురువు

జిజ్ఞాసను పసిగట్టి విజ్ఞానం అందించి గురువు
వేలాది విద్యార్థులకు జ్ఞాన కెరటం గురువు
నిత్యం చిరునవ్వుల రేడుగా సాగేటి గురువు
నింగి నేల తడిమిన అరేయ్ ఒరేయ్
అని పిలిచేదే మన గురువు

జాతి కుల మతాలకతీతంగా పలుకరించు గురువు
నిండుకుండ వలె తొనకని రూపం గురువు
గురుపూజోత్సవ వందనం మీ పాదపద్మాలకు గురువు
మరువలేని మరుపురాని నిలువెత్తు శిల్పం మనగురువు

ఉంద్రాళ్ళ రాజేశం
సిద్ధిపేట
9966946084

భయం గుప్పెట్లో ప్రభుత్వ అధికారులు

- ప్రాణం అర చేతిలో పెట్టుకొని ఉద్యోగం
- ఉదయం 10 గంటల నుంచి 5 గంటల వరకు భయం భయం





నవతెలంగాణ-కౌడిపల్లి

ప్రభుత్వ అధికారులు ఉద్యోగానికి రావాలంటేనే భయం భయంతో ప్రాణాలు అరచేతిలో చేతిలో పెట్టుకొని విధులు నిర్వహిస్తున్నారు. మండల ఆవరణలో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలు శిథిలావస్థలకు చేరుకొని కొన్ని సంవత్సరాలు గడుస్తున్నా, ఏ ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. ఇటీవల కురిసిన వర్షానికి ఎంపీడీవో కార్యాలయంలో ఉన్న రూము పాక్షికంగా కూలిపోవడంతో విధులు నిర్వహిస్తున్న అధికారులు ప్రాణాలు అర చేతిలో పెట్టుకొని ఉద్యోగం చేస్తున్నారు. ఇక్కడి నుంచి ఎప్పుడెప్పుడు ట్రాన్స్ఫర్ అయి వెళ్లిపోవాలని ఎదురుచూస్తున్నారు. కౌడిపల్లి మండలంలో 29 గ్రామపంచాయతీలు ఉండగా దాదాపు 50 వేల జనాభా ఉండగా నిత్యం ప్రభుత్వ కార్యాలయాలకు 1000 నుంచి 1500 మంది వివిధ



పనుల నిమిత్తం కార్యాలయంకు వస్తుంటారు. గత 35 సంవత్సరాల క్రితం ఎంపీడీవో కార్యాలయాన్ని తహసీల్దార్ కార్యాలయాన్ని వ్యవసాయ కార్యాలయాన్ని మండల వనరుల కేంద్రం నిర్మించారు. అవి కాస్త శిథిలావస్థలోకి చేరడంతో అధికారులు కార్యాలయంలో విధులు నిర్వహిద్దామంటేనే భయంతో వణికి పోతున్నారు. ఎన్నిసార్లు పై అధికారులకు ఎమ్మెల్యేలకు చెప్పినా ప్రభుత్వాలు మారుతున్నాయి. కాని కార్యాలయాలు మాత్రం నిర్మాణంలో ఎలాంటి మార్పు లేదని పలువురు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు కార్యాలయం మొత్తం వర్షం నీరు రావడంతో తీవ్ర ఇబ్బందులకు అధికారులు గురవుతున్నారు. కంప్యూటర్లు సైతం వర్షంలో తడుస్తూ వాటిపై పేపర్లు కప్పుకొని విధులు నిర్వహిస్తున్నారు. తహసీల్దార్ కార్యాలయానికి ధరణి రిజిస్ట్రేషన్‌ల కోసం రోజు కొన్ని వందల మంది కార్యాలయంకు వస్తుంటారు.

భయంతో విధులు నిర్వహిస్తున్నాం



ఎంపీడీవో శ్రీనివాస్







ఉద్యోగానికి రావాలంటేనే భయం వేస్తుందని ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. మండల కార్యాలయం శిథిలవస్థలో ఉండడంతో ఎప్పుడు కూలిపోతుందోనని భయం వేస్తుందని ఆయన తెలిపారు. గత 15 రోజుల క్రితం జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లు కూడా మండల కార్యాలయాన్ని పరిశీలించి వేరే చోటికి మార్చుకోమని తెలిపారు. పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించాలంటే వారు కూడా భయంతో వణికి పోతున్నారు. ఎప్పుడు కూలిపోతుందోనని భయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు రాష్ట్ర ప్రభుత్వం త్వరగా ఎంపీడీవో కార్యాలయాన్ని నిర్మించాలని కోరుచున్నారు.

ఆశ వర్కర్‌పై దాడి చేసిన పర్యవేక్షకుడిపై చర్యలు తీసుకోవాలి

నవ తెలంగాణ-మెదక్ టౌన్



ఆశ వర్కర్‌పై దాడికి దిగిన మండల ఆసుపత్రి పర్యవేక్షకుడిపై చర్యలు తీసుకోవాలని సీఐటీయు మెదక్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మహేందర్ రెడ్డి, బస్వరాజ్‌లు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్న శంకరంపేట్ మండలంలోని పీహెచ్ సీ లో మండల సమావేశం సందర్భంగా ఆశలు ఆసుపత్రికి వెళ్లడం జరిగింది. వైద్యం కోసం వచ్చిన వారు మాట్లాడుతుండగా ఆశ వర్కర్లే మాట్లాడుతున్నారని వారిపై కక్షపూరితంగా దాడికి దిగారన్నారు. మహిళలని కూడా చూడకుండా చెయ్యి పట్టి బయటికి గెంటేశారన్నారు. విషయం తెలుసుకొని మండల వైద్యాధికారి సాయి సింధు పర్యవేక్షణ దురుసుగా సమాధానం చెప్పాడన్నారు. వెంటనే ఆసుపత్రి పర్యవేక్షకుడుని సస్పెండ్ చేయాలన్నారు. లేనిపక్షంలో సీఐటీయూ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని వారు హెచ్చరించారు.

అనిల్ డేవిడ్‌ని సస్పెండ్ చేయాలి

- సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు నర్సమ్మ



నవ తెలంగాణ-మెదక్ టౌన్

ఆశ డే సందర్భంగా చిన్న శంకరంపెట పిహెచ్ సిలో ఆశ లు అందరూ వచ్చిన తర్వాత మెడికల్ సూపర్ వైజర్ అనిల్ డేవిడ్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని ఆశ వర్కర్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె నర్సమ్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం జరిగిన ఆశా డే రోజు సందర్భంగా ఆశా కార్యకర్తలను ఉద్దేశించి బూతులు తిడుతూ ఒక ఆశ వర్కర్‌ను గోడకు కొట్టి, మరో ఆశ వర్కర్‌ను గొంతు నులిమారని తెలిపారు. ఆశ కార్యకర్తలు గ్రామాలలో తమ శక్తి కొలది ఆరోగ్య సేవలు అందిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు చేస్తున్నారు. ఆశా వర్కర్లుగా వారు పని చేస్తేనే అతను సూపర్ వైజర్ గా పని చేస్తున్నారన్నారు. అలాంటి వారినీ ఒక హెల్త్ సూపర్ వైజర్ బూతులు తిట్టవలసిన అవసరం ఏముందని ప్రశ్నించారు. మెడికల్ అధికారి ముందే ఇలా వ్యవహరిస్తే ఇంకా ఎవరు లేనప్పుడు ఎలా ప్రవర్తిస్తారో అర్థం చేసుకో వచ్చన్నారు. ఆరోగ్య సేవల పై సలహాలు ఇవ్వాల్సింది పోయి ఒక అధికారిని అని అహంకార పూరితంగా ఆశ వర్కర్‌ల పట్ల ప్రవర్తించిన మెడికల్ సూపర్ వైజర్‌ను పై అధికారులు వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. మళ్ళీ ఇలాంటివి జిల్లాలో పునరావృత్తం కాకుండా అధికారులు చూడాలన్నారు. పై అధికారులు వెంటనే విచారణ చేపట్టి సస్పెండ్ చేయాలని కోరారు.

ఎమ్మెల్యే సునితా రెడ్డిపై వ్యక్తిగత విమర్శలు చేస్తే ఖబర్దార్

- మాజీ మంత్రి హరీష్ రావుపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం
- జిల్లా మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్ర గౌడ్



నవతెలంగాణ-నర్సాపూర్

మహిళా అని చూడకుండా ఎమ్మెల్యే సునీత రెడ్డిపై వ్యక్తిగత విమర్శలు చేయడం సరికాదని గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మెన్ చంద్ర గౌడ్ అన్నారు. బుధవారం నర్సాపూర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు కాంగ్రెస్ నాయకులు పదేపదే ప్రోటోకాల్ విషయంలో మాట్లాడడం సరికాదన్నారు. చట్ట ప్రకారంగా ఎమ్మెల్యేకు ప్రోటో కాల్ ఉండదా అని ప్రశ్నించారు.

బీఆర్ఎస్ ప్రభుత్వ హాయాంలోనే అభివృద్ధి

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోని నర్సాపూర్ ఎంతో అభివృద్ధి చెందిందని, గోమారంలో పాలిటెక్నిక్ కాలేజీ ఏర్పాటుకు 20 ఎకరాల భూమి ఇచ్చామన్నారు. వరద బాధితుల కష్టాలు తెలుసుకోవడానికి వెళ్లిన మాజీ మంత్రి హరీష్ రావును కాంగ్రెస్ నాయకులు దాడి చేయడం ఎంతవరకు సమంజసం ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో వరదలో చిక్కుకున్న 9 మంది బాధితులను కాపాడుకోలేని ప్రభుత్వం ప్రజలను ఏమి కాపాడుతుందన్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యేను విమర్శించడం మానుకోవాలని లేకుంటే తగిన గుణపాఠం తప్పదు వారు అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అశోక్ గౌడ్, మాజీ గ్రంథాలయ చైర్మెన్ చంద్ర గౌడ్, మాజీ జెడ్పీటీసీ బాబ్యానాయక్, మున్సిపల్ వైస్ చైర్మెన్ నహిముద్దీన్, శివంపేట మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ , మండల పార్టీ అధ్యక్షుడు భోగ శేఖర్, రాష్ట్ర నాయకులు సత్యం గౌడ్, కౌన్సిలర్లు, మాజీ సర్పంచులు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ సూపర్ వైజర్ అనిల్ డేవిడ్‌ని సస్పెండ్ చేయాలి

- ఆశా కార్యకర్తను దూషించి మాట్లాడిన అధికారి
- సీఐటీయు జిల్లా అధ్యక్షులు ఏ.మహేందర్ రెడ్డి డిమాండ్



నవతెలంగాణ-తూప్రాన్

ఆశ డే సందర్భంగా చిన్నశంకరంపేట పిహెచ్‌సిలో ఆశల కార్యకర్తల పట్ల దురుసుగా ప్రవర్తించిన మెడికల్ సూపర్ వైజర్ అనిల్ డేవిడ్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని. సీఐటీయు జిల్లా అధ్యక్షులు ఏ.మహేందర్ రెడ్డి తూప్రాన్‌లో బుధవారం మీడియా సమావేశంలో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మహేంద ర్ రెడ్డి మాట్లాడుతూ ఆశా కార్యకర్తలను చిన్నచూపు చూసి మాట్లాడిన అధికారిని విధుల నుంచి తొలగించాలని ఉన్నతాధికారులను డిమాండ్ చేశారు. ఆశా కార్యకర్తలను ఉద్దేశించి బూతులు తిడుతూ, ఆశ కార్యకర్తలపై చేయి చేసుకొని దుష్ప్రచారలాడిన వ్యక్తిని వెంటనే సస్పెండ్ చేసి, అతనిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. గ్రామాలలో తమ శక్తి కొలది ఆరోగ్య సేవలు అందిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు చేస్తారు. ఆ అధికారి హెల్త్ సూపర్వైజర్‌గా పని చేస్తున్నారు. గ్రామంలో నిర్విరామంగా విధులు నిర్వహిస్తున్న వారిని ఒక హెల్త్ సూపర్ వైజర్ బూతులు తిట్టాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. మెడికల్ అధికారి ముందే ఇలా వ్యవహరిస్తే ఇంకా ఎవరు లేనప్పుడు ఎలా ప్రవర్తిస్తారో అర్థం చేసుకోవచ్చన్నారు. ఆరోగ్య సేవపై సలహాలు ఇవ్వాల్సింది పోయి ఒక అధికారిని అనే అహంకార పూరితంగా ఆశా కార్యకర్తల పట్ల ప్రవర్తించిన తీరు మెడికల్ సూపర్ వైజర్‌ను పై అధికారులు వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. మళ్ళీ ఇలాంటివి జిల్లాలో పునరావృత్తం కాకుండా జిల్లా ఉన్నతాధికారులు చూడాలన్నారు. ఉన్నత స్థాయి వైద్యాధికారులు, అధికారులు ఈ సంఘటనపై వెంటనే విచారణ చేపట్టి హెల్త్ సూపర్వైజర్ అనిల్ డేవిడ్‌ను సస్పెండ్ చేయాలని కోరారు. ఒకవేళ ఆ అధికారిపై చర్యలు తీసుకొని పక్షంలో జిల్లా వ్యాప్తంగా నిరసనలు, ధర్నాలు చేపడతామని హెచ్చరించారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక





నవతెలంగాణ-చేగుంట

మండలం నుంచి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ఉపాధ్యాయులు, గర్దాస్ మనోహర్ రావు(హిందీ) జడ్పీహెచ్ఎస్ చేగుంట, రావుల వెంకటేష్(తెలుగు) జడ్పీహెచ్ఎస్ చేగుంట, షేక్ సలీం(తెలుగు), చందాయి పేట్, అజిత(సోషల్) జడ్పీహెచ్ఎస్ చందాయి పేట్, దేశపతి కృష్ణమూర్తి(ఇంగ్లీష్) రెడ్డిపల్లి, చిట్టబోయిన సత్యనారాయణ ప్రాథమిక పాఠశాల కర్నాలపల్లి, సంగీత, ప్రాథమిక పాఠశాల కసాన్ పల్లి. ఉపాధ్యాయులు ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎన్నికైన్నారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి బుచ్చా నాయక్, మండల నోడల్ ఆఫీసర్, నీరజ, మక్క రాజుపేట్ కాంప్లెక్స్ హెచ్ఎం అమర్ శేఖర్ రెడ్డి, బోనాల కాంప్లెక్స్ హెచ్ఎం శ్రీనివాసరావు ఉపాధ్యాయ సంఘ నాయకులు, బాలపోచయ్య, నాగరాజు, పెంటా గౌడ్, రాజశేఖర్, రేఖ, రామకృష్ణ, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎన్నికైనందుకు అభినందనలు తెలిపారు.

పండుగను శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలి

- ఎస్సై రాజు



నవతెలంగాణ-వెల్దుర్తి

వినాయక చతుర్దశి పండుగను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని బుధవారం మండల కేంద్రం లో పోలీస్ స్టేషన్ ఆవరణములో ఎస్సై రాజు శాంతి పరిరక్షణ కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా వినాయక మండపాలను ఏర్పాటు చేసే వారితో మాట్లాడారు. శాంతియుత వాతావరణంలో వినాయక మండపాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గణేష్ విగ్రహం ప్రతిష్టించే వారు ఆన్లైన్ చేసుకోవాలని, రాత్రి 10 గంటల తర్వాత లోడ్ స్పీకర్లు వాడవద్దని, మండపాల వద్ద విద్యుత్ ప్రమాదాలు జరగకుండా చూసుకోవాలని, పబ్లిక్ రోడ్లు కాలి బాటల మీద మండపాలను ఏర్పాటు చేయవద్దని, మద్యపానం జూదం వంటి చట్ట విరుద్ధ పనులు చేరాదని, ఇరుగుపొరుగు వారికి వృద్ధులకు విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా చూసుకోవాలని, ఆయన సూచించారు. ఆన్లైన్లో అప్లై చేసిన రసీదును పోలీస్ స్టేషన్లో అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్వాడి కేంద్రంలో సామూహిక సీమంతాలు అన్నప్రాసన



నవతెలంగాణ-వెల్దుర్తి

పోషణ మాస ఉత్సవాల్లో భాగంగా మండల పరిధి చేరిలా అంగన్వాడి కేంద్రంలో బుధవారం సామూహిక సీమంతాలు అన్నప్రాసన వంటి కార్యక్రమాలను అంగన్వాడీ టీచర్ దేవలత, లక్ష్మీల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలను ఉద్దేశించి మాట్లాడారు. గర్భం దాల్చిన మొదలుకొని ప్రసవించే వరకు ఇంట్లో తినే ఆహారంతో పాటు అంగన్వాడి కేంద్రంలో అందించే పౌష్టిహారం పాలు, గుడ్లతో పాటు ఆకు కూరగాయలు, పప్పులు, అందించడం జరుగుతుందన్నారు. బలవర్ధకమైన ఆహారాన్ని తీసుకొని పండంటి బిడ్డకు జన్మనివ్వాలని సూచించారు. హెల్త్ సూపర్వైజర్ లలిత గర్భిణీ ఉద్దేశించి మాట్లాడారు గర్భం దాల్చిన మొదలుకొని దగ్గర్లోని సబ్ సెంటర్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఎప్పటికప్పుడు ఆరోగ్య నియమాలను పాటించాలన్నారు. రక్తహీనతకు గురికాకుండా హెల్త్ చెకప్ చేయించుకోవాలని సూచించారు. అంగన్వాడి కేంద్రంలో అందించే పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రణీత్ కుమార్, ఏఎన్ఎం అనిత, ఆశ మంజుల, గర్భిణీలు, బాలింతలు, పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకులపై దాడి అమానవీయం



నవతెలంగాణ-నార్సింగి

మంగళవారం ఖమ్మంలో మాజీ మంత్రి హరీష్ రావు, పువ్వాడ అజయ్ కుమార్, సబితా ఇంద్రా రెడ్డి వాహనాల పై జరిగిన దాడిని నార్సింగి తాజా మాజీ జెడ్పీటీసీ బాణాపురం కృష్ణా రెడ్డి, మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మైలారం బాబు తీవ్రంగా ఖండించారు. వారు మాట్లాడుతూ వరద బాధితులకు ఆదుకోవాల్సిన ప్రభుత్వం ఎలాంటి సహాయ సహకారాలు అందించడం లేదని, ప్రజల ఇక్కట్లు చూడలేక అధికారంలో లేకున్నా హరీష్ రావు, పువ్వాడ, సబితలు బాధితులకు నిత్యావసర వస్తువులు అందిస్తుంటే ఓర్వలేక కాంగ్రెస్ పార్టీ వారు దౌర్జన్యంగా వారిపై దాడి చేయడం హేయమని, పిరికి పంద చర్య అని దుయ్యబట్టారు. కాంగ్రెస్ పాలనలో ఆ పార్టీ కార్యకర్తలు అనైతికంగా ప్రవర్తిస్తున్నారని మండి పడ్డారు. ప్రజలకు సహకారం అందించాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే బీఆర్ఎస్ వారిని ఆదుకోవడం తప్పా అని ప్రశ్నించారు. ప్రజలకు సేవ చేయడం చేత కాక సేవ చేస్తున్న వారి పై దాడులు చేయడం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ఉద్యమ పార్టీ అని, ప్రజల పార్టీ అని ఇలాంటి దాడులతో భయపడే ప్రసక్తే లేదని, ప్రజల వద్దకు వెళ్లకుండా నిలువరించలేరని అన్నారు. కాంగ్రెస్ చేతగాని పాలనను రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని, సరైన సయంలో బుద్ధి చెప్పటం ఖాయమని అన్నారు. బీఆర్ఎస్ నాయకులపై జరిగిన దాడికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహా కాంగ్రెస్ ప్రభుత్వం భాధ్యత వహించాలని, దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేసి చట్ట పరమైన కఠిన మైన చర్యలు తీసుకోవాలని, లేక పోతే రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర పరిణామాలు ఎదుర్కోవలసి వస్తుందని హెచ్చరించారు.


కొట్టుకుపోయిన రోడ్డును పరిశీలించిన ఎస్ఈ



నవతెలంగాణ-తూప్రాన్

మండలంలోని ఆపుత్ పల్లి గ్రామం నుంచి గుండ్రెడ్డిపల్లి వరకు హల్దీ వాక్కుపై ఉన్న రోడ్డు ఐదు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో, పల్లి వాగు నీటి ప్రవాహం ఎక్కువ రావడంతో రోడ్డు కొట్టుకుపోయింది. ఈ రోడ్డును సిద్దిపేట పంచాయతీరాజ్ సూపరిండెంట్ ఇంజనీర్ జోగారెడ్డి పరిశీలించి , రోడ్డు మరమ్మత్తులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, ఏఈ మధుకు సూచించారు. ధ్వంసమైన రోడ్డు మరమ్మత్తులను తొందరగా చేపట్టి, ఈ మార్గంలో ప్రయాణించే గుండ్రెడ్డిపల్లి, గౌడి గూడెం, మల్కాపూర్, ఆబోతు పల్లి, తూప్రాన్ గ్రామాల ప్రజల ఇబ్బందులను దూరం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చిరంజీవాచారి, ఎఈ మధు, డీఎల్పిఓ యాదయ్య, ఎంపీడీవో శేషాద్రి, ఎంపీఓ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

స్పెషల్ డ్రైవ్ డిగ్రీ దోస్త్ అడ్మిషన్లు ప్రారంభం



నవతెలంగాణ-మెదక్ టౌన్

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వివిధ డిగ్రీ కోర్సులలో చేరడానికి దోస్త్ స్పెషల్ డ్రైవ్ ఫేస్ అడ్మిషన్లు ప్రారంభమైనట్లు, మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కే.హుస్సేన్ తెలిపారు. సెప్టెంబర్ 4వ తేదీ నుంచి సెప్టెంబర్ 9వ తేదీ వరకు విద్యార్థులు ఆన్ లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకొని వెబ్ ఆప్షన్ ఇచ్చుకోవచ్చు అని, సెప్టెంబర్ 11వ తేదీన విద్యార్థులకు సీటు కేటాయింపు జరుగుతుందని, సీటు పొందిన విద్యార్థులు సెప్టెంబర్ 11 నుంచి 13 మధ్యలో కళాశాలలో రిపోర్టు చేయాలని దోస్త్ స్పెషల్ డ్రైవ్ ఫేస్ అడ్మిషన్ షెడ్యూల్‌ను వివరించారు. ఇంత వరకు దోస్తులో రిజిస్ట్రేషన్ చేసుకోని విద్యార్థులు ఆన్లైన్ సెంటర్ యందు, ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకొని తరువాత వెబ్ ఆప్షన్స్ ఇచ్చుకోవచ్చని, ఒకవేళ ఏమైనా సమస్యలు ఏర్పడితే డిగ్రీ కళాశాలలోని హెల్ప్ లైన్ సెంటర్‌ను సంప్రదిస్తే అట్టి సమస్య పరిష్కరించబడుతుందని తెలియజేశారు. ఒక వేళ విద్యార్థులు కళాశాలను సంప్రదించిన ఆయా డిపార్ట్మెంట్లలో విద్యార్థులకు ఆన్ లైన్ రిజిస్ట్రేషన్ చేసుకొనుటకు, కళాశాల అధ్యాపక బృందము సహాయ పడగలరని తెలిపారు. డిగ్రీలో అడ్మిషన్ పొందుటకు ఇది చివరి అవకాశం అని, ఈ అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

కల్వర్టు నీటిని పొలాలకు రాకుండా చూడాలి



నవతెలంగాణ-నిజాంపేట

మండల పరిధిలోని నందిగామ గ్రామంలో ఇటీవల నిర్మించిన 765 డిజి రోడ్డు పనుల్లో భాగంగా కల్వర్టు నిర్మించారు. కల్వర్టులో నుంచి వస్తున్న వరద నీరు తమ పొలాలపై వెళ్లడం ద్వారా పంటలు నష్టపోతున్నామని రైతుల ఆవేదన గురవుతున్నారు. ఆ వరద నీటిని పంట పొలాలకు వైపు రాకుండా పూర్వం మాజీ సర్పంచ్ బ్రహ్మచారి ఇంటి వెనుక కల్వర్టు నుంచి కాలువ ద్వారా నీళు వెళ్లేవని అట్టి నీళ్లను యధావిధిగానే వెళ్లేలా చూడాలని అధికారులకు రైతులు కోరారు. కొత్తగా అట్టి నీటిని మరలిచినట్లయితే వరి పంట వేసిన 70 మంది రైతుల పంట పొలాలు మునిగిపోతాయని రైతులు వాపోతున్నారు. గత రెండు మూడు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు వచ్చిన వరద నీరుకు వరి పంట పూర్తిగా మునిగిపోయిందని. పంట నష్టపోయిన మాకు ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. అలాగే ఆ వరద నీటిని బ్రహ్మచారి ఇంటి వెనుక నుండే వెళ్లేలా కాలువను నిర్మించాలని. ఆర్ అండ్ బి అధికారులను కోరారు. ఇకనైనా ప్రభుత్వ అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో రైతులు రామచంద్ర రెడ్డి, బీజ్జా సంపత్, బీజ్జాదాస్, రమేష్, గెల్లు శ్రీశైలం, సిద్దరాములు, చోటమియా, లద్ద సుగుణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

13వ వార్డులో నూతన కరెంటు పోల్స్ ఏర్పాటు

- మున్సిపల్ వైస్ చైర్మెన్ నందాల శ్రీనివాస్



నవతెలంగాణ-తూప్రాన్

మున్సిపాలిటీలోని 13వ వార్డులో పాడైన పాత కరెంటు పోల్స్‌ను తీసివేసి, నూతన కరెంటు పోల్స్‌ని మున్సిపల్ వైస్ చైర్మెన్ నందాల శ్రీనివాస్ బుధవారం ఆధ్వర్యంలో ఏర్పాటు చేయించారు. తుప్రాన్‌లోని పాత మున్సిపల్ ఆఫీస్ సూర్యనగర్ కాలనీ వాటర్ ట్యాంక్ రోడ్‌లో 9 మీటర్స్ స్తంభాలను ఏర్పాటు చేశారు. అలాగే రోడ్డులో అడ్డంగా ఉన్న స్తంభాలను జరిపించారు. కరెంట్ పోల్స్ సమస్యకు పరిష్కారం లభించింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ 13వ వార్డు ప్రజలు, ఎలక్ట్రిసిటీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ మహేష్‌ని అభినందించిన ఎస్పీ



నవతెలంగాణ-హవేలీ ఘనాపూర్

భారీ వరద ప్రవాహాన్ని లెక్కచేయకుండా, ధైర్య సాహసాలతో ప్రాణాలకు తెగించి వ్యక్తిని రక్షించిన మహేష్ ,క్యూ ఆర్ టి టీం సభ్యులకి జిల్లా ఎస్.పి.డి.ఉదయ్ కుమార్ రెడ్డి రివార్డు అందజేసి అభినందించారు. వరద ప్రవాహం లెక్కచేయకుండా సాహసోపేతంగా ఓ వ్యక్తిని కాపాడడం తన వాళ్లకు ఏమైనా ఇతరుల సాయం తీసుకొని పనులు చేసుకుంటారు. ప్రజలకు కష్టం వస్తే మాత్రం క్షణం ఆలోచించకుండా ముందుండే వారే పోలీసులు అని జిల్లా ఎస్.పి ఉదయ్ కుమార్ రెడ్డి అన్నారు.మెదక్ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మెదక్ జిల్లా టెక్మాల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గుండు వాగులో చోటు చేసుకుంది. సామాజిక మాధ్యమం అయిన తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ వేదికగా మెదక్ జిల్లా పోలీస్ హెూమ్ గార్డ్ మహేష్ జిల్లా క్యూ ఆర్ టి టీం సభ్యులను తెలంగాణ రాష్ట్ర డిజిపి జితేందర్ ఏ.డి.జి మహేష్ భగవత్ అభినందించినారని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్.పి.అడ్మిన్.ఎస్.మహేందర్,జిల్లా సాయుధ ధల డిఎస్పీ రంగ నాయక్ , ఆర్.ఐ శైలేందర్ ,ఎస్బీ సిఐ సందీప్ రెడ్డి ,ఏ.ఆర్ ఎస్.ఐ మహిపాల్ ,జిల్లా క్యూ ఆర్ టి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడి చిన్నారులకు యువకుడు స్పోర్ట్స్ యూనిఫాం అందజేత



నవతెలంగాణ -వెల్దుర్తి

బుడిబుడి నడకల చిన్నారులను చూసి మురిసిపోయిన యువకుడు వారికి ఒకే రకమైన స్పోర్ట్స్ దుస్తులను అందించాలని మంచి మనసుతో ఆలోచన పెట్టి మండల పరిధి మానేపల్లి గ్రామంలోని అంగన్వాడి సెంటర్ వచ్చే చిన్నారులకు అదే గ్రామానికి చెందిన భాస్కర్ అనే యువకుడు బుధవారం అంగన్వాడి టీచర్ సురేఖతో కలిసి పిల్లలకు స్పోర్ట్స్ దుస్తులను అందజేశారు. అనంతరం అందజేసిన దుస్తులను వారు ధరించడం చూసి మురిసిన గ్రామస్తులు భాస్కర్‌ను అభినందించారు. మండలంలో ఇంతవరకు ఎవరు కూడా అంగన్వాడీ కేంద్రానికి వచ్చే చిన్నారులకు ఎలాంటి ప్రోత్సాహాలు చేయలేదని, మొట్టమొదటి సారిగా అంగన్వాడి చిన్నారులకు, స్పోర్ట్స్ దుస్తులు పంపిణీ చేయడం. గర్వంగా ఉందని పిల్లల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.

విద్యావ్యవస్థ అభివృద్ధికి ఉపాధ్యాయుడు వెన్నుముక

- విద్యార్థులు మంచి మార్గం ఎంచుకోవడానికి ఉపాధ్యాయ పాత్ర ఎంతో కీలకమైనది
- తల్లిదండ్రులు గురువులు సమానమే
- ఎంపీడీవో గణేష్ రెడ్డి, ఎంఈఓ



నవతెలంగాణ-మిరుదొడ్డి

విద్యావ్యవస్థ అభివృద్ధికి ఉపాధ్యాయుడు వెన్నుముక అని ఎంపీడీవో గణేష్ రెడ్డి, ఎంఈఓ ప్రభుదాస్ అన్నారు. భారతీయ సంస్కృతిలో గురువు స్థానం ఎంతో విశిష్టమైనదన్నారు. మిరుదొడ్డి మండల కేంద్రంలో గురుపూజోత్సవాన్ని పురస్కరించుకొని ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీడీవో గణేష్ రెడ్డి, ఎంఈఓ ప్రభుదాస్ మాట్లాడారు. ఒక విద్యార్థిని ఉత్తమంగా తీర్చిదిద్దాలంటే తల్లిదండ్రుల తర్వాత స్థానం గురువుకే ఉంటుందన్నారు. తరగతి గదిలో దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే గొప్ప అవకాశం ఉపాధ్యాయులకే ఉంటుందని తెలియజేశారు. విద్యార్థులు విద్యార్థిని మంచి మార్గాన్ని ఎంచుకునేందుకు వారి పాత్ర ఎంతో కీలకమని అన్నారు. అనంతరం వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మిరుదొడ్డి ,అక్బర్పేట-భూంపల్లి మండలాలకు చెందిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వర్షానికి కూలిన పెంకుటిల్లు



నవతెలంగాణ-మిరుదొడ్డి

ఇటీవల ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి పెంకుటిల్లు కూలి ప్రమాదం చోటుచేసుకుంది. అక్బర్ పేట-భూంపల్లి మండలం కాజీపూర్ గ్రామానికి చెందిన దుబ్బారెడ్డి తన ఇంట్లో భార్య, తల్లితో కలిసి నివాసం ఉంటున్నాడు. గత వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పురాతన ఇల్లు కావడంతో, తెల్లవారుజామున ఇల్లు ఒక్కసారిగా కుప్పకూలడం జరిగిందన్నారు. ఇంట్లో తల్లి కౌసల్య పై గోడ పడి కాలు విరగడంతో పాటు తీవ్ర గాయాలు కావడం జరిగిందన్నారు. ఇల్లు కూలిన వెంటనే తేరుకున్న దుబ్బారెడ్డి వెంటనే బయటికి వచ్చి స్థానికులకు తెలపడంతో, కౌసల్యను ఇంట్లో నుంచి బయటికి తీసుకువచ్చి ఆసుపత్రికి తరలించారు. పురాతన ఇండ్లు వర్షానికి కూలుతున్న నేపథ్యంలో అధికారులు స్పందించి వెంటనే పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ప్రాణపాయ స్థితిలో ఉన్న వృద్ధురాలికి మెరుగైన వైద్యం అందించడంతోపాటు బాధిత కుటుంబానికి పరిహారం చెల్లించాలని కోరారు.

ఘనంగా జర్నలిస్టుల దినోత్సవం



నవతెలంగాణ-సిద్దిపేట

అలయన్స్ భగీరథి ఆధ్వర్యంలో జర్నలిస్టుల దినోత్సవం పురస్కరించుకొని వివిధ పత్రికల్లో పనిచేస్తున్న జర్నలిస్టులను బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా భగీరథి సంఘ అధ్యక్షురాలు జిల్లా రేణుక మాట్లాడుతూ ప్రజల యొక్క సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి, సమస్యల పరిష్కారానికి మార్గదర్శకంగా పత్రికలు నిలుస్తున్నాయని అన్నారు. జర్నలిస్టుల దినోత్సవం పురస్కరించుకొని ఇలా సన్మానించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి హారిక, కోశాధికారి జయంతి, సభ్యులు భావన, సంతోషి పాల్గొన్నారు.



మట్టి గణపతి శ్రేష్టం

- మెదక్ ఎమ్మెల్సీ వంటేరు యాదవరెడ్డి

నవతెలంగాణ-గజ్వేల్

మట్టి విగ్రహాలే శ్రేష్టమని మెదక్ ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి అన్నారు. బుధవారం గజ్వేల్ పట్టణంలో వినాయక చవితి సందర్భంగా రామకోటి రామరాజు కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ వినాయక చవితి సందర్భంగా గత 20 ఏళ్ల నుంచి భగవంతుని సేవే మహా భాగ్యంగా భావించిన శ్రీరామకోటి భక్త సమాజం ధార్మిక సేవా సంస్థ మట్టి విగ్రహాలనే వాడాలని కోరారు. పర్యావరణ పరిరక్షణే లక్ష్యమని నిర్విరామంగా మట్టి గణపతులను ఉచితంగా పంపిణి చేస్తున్న సంస్థ అధ్యక్షులు రామకోటి రామరాజు కృషి, పట్టుదల అమోగం అన్నారు.ఇప్పుడు రెండు వందల వరకు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ప్లాస్టరప్ ప్యారీస్‌తో జీవికోటి ప్రమాదం అని ప్రచారాన్ని ఈ కరపత్రాల ద్వారా రామకోటి సంస్థ తెలియజేయడం ఆదర్శనీయం అన్నారు. ఈ కార్యక్రమం కృష్ణాలయం అధ్యక్షులు యెలగందుల రాంచంద్రం పాల్గొన్నారు.

జిల్లా ఉత్తమ ఉపాద్యాయులుగా సిద్దయ్య, కనకరావు



నవతెలంగాణ-మర్కుక్

సిద్దిపేట జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా మర్కుక్ మండలంలోని మర్కుక్ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఎం.సిద్దయ్య, ప్రాథమికోన్నత పాఠశాల ఎర్రవల్లిలో పనిచేస్తున్న ఎ.కనకరావులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా మర్కుక్ పీఆర్టీయూ మండల, అధ్యక్ష కార్యదర్శులు రామ కృష్ణ రెడ్డి, కుమార్‌లు మండల శాఖ తరపున శుభాకాంక్షలు తెలియజేశారు.

అతిథి అధ్యాపకుల పోస్టులకు ఆహ్వానం



నవతెలంగాణ-గజ్వేల్

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో పనిచేయటానికి అతిథి అధ్యాపకుల పోస్టులకు ఆహ్వానం పలుకుతున్నామని కళాశాల ప్రిన్సిపాల్ కమల కృష్టియానా అన్నారు. బుధవారం ఆమె ఒక్క ప్రకటనలో వెల్లడించారు. మొత్తం ఆరు పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. పీజీ కోర్సుల్లో 55శాతం మార్కులు ఉండాలన్నారు. ఎస్సీ, ఎస్టీలకు మాత్రం 50 శాతం మార్కులు సంబంధించిన సబ్జెక్టు ఉంటే సరిపోతుందన్నారు. నీట్, సెట్టు, పీహెచ్డీ చేసి ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. అదేవిధంగా మైక్రో బయాలజీ, తెలుగు, కెమిస్ట్రీ సబ్జెక్టులో ఒక్కొక్కరు కావాలన్నారు.

మంత్రిని కలిసిన గజ్వేల్ మార్కెట్ చైర్మెన్



నవతెలంగాణ-జగదేవపూర్

జగదేవపూర్ మండలం పరిధిలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన వంటేరు నరేందర్ రెడ్డి నాలుగు రోజుల క్రితం గజ్వేల్ మార్కెట్ చైర్మెన్ గా బాధ్యతలు చేపట్టారు. కాగా బుధవారం గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ మంత్రి దామోదర్ రాజనర్సింహను హైదరాబాదులోని తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి వారి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మార్కెట్ వైస్ చైర్మెన్ సర్దారఖాన్, డైరెక్టర్లు తదితరులు గజ్వేల్ మున్సిపల్ మాజీ చైర్మెన్ గాడిపల్లి భాస్కర్, జగదేవపూర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి, మాజీ కొండపోచమ్మ చైర్మెన్ బత్తుల మల్లేశం, సీనియర్ నాయకులు సముద్రాల హరనాథ్ తదితరులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలుగా రూపారాణి



నవతెలంగాణ-కొండపాకఫ కొండపాక మండలం సిరసనగండ్ల ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న రూపా రాణి రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలుగా ఎంపికైంది. ప్రతి ఏటా ఉత్తమ ఉపాధ్యాయులుగా ప్రభుత్వం ఎంపిక చేసి ఉపాధ్యాయ దినోత్సవం రోజు సత్కరిస్తుంది. గణిత శాస్త్ర స్కూల్ అసిస్టెంట్ గా పని చేస్తున్న ఆమె గణితం అంటే పిల్లల్లో భయం లేకుండా ఆడుతూ పాడుతూ సులభరీతిలో వినూత్న పద్ధతిలో బోధన చేస్తుంది. అందుకుగాను గతంలో ఆమెకు జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలిగా, ఇన్స్పైర్ అవార్డు కూడా లభించాయి. ఈ సంవత్సరం ఉత్తమ ఉపాధ్యాయురాలుగా ఎంపిక కావడం పట్ల ఎంఈఓ శ్రీనివాసరెడ్డి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విఠల్ ఉపాధ్యాయులు అభినందించారు.

నారాయణ పాఠశాలలో సైబర్ క్రైమ్ పై అవగాహన సదస్సు

నవతెలంగాణ-సిద్దిపే: సిద్దిపేట నారాయణ పాఠశాలలో విద్యార్థులకు సైబర్ క్రైమ్ అవేర్నెస్ ప్రోగ్రాం నిర్వహించినట్లు సైబర్ క్రైమ్ ఏసీపీ శ్రీనివాస్, సిద్దిపేట టూ టౌన్ సీఐ ఉపేందర్‌లు తెలిపారు. బుధవారం పాఠశాలలో సైబర్ క్రైమ్ నుంచి ఎలా రక్షించుకోవాలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సైబర్ క్రైమ్ గురించి విద్యార్థులతో మాట్లాడి, సైబర్ క్రైమ్ నుంచి ఎలా రక్షించుకోవాలో, ఆన్లైన్ ఫ్రాడ్ గురించి, విద్యార్థులకు వివరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నారాయణ పాఠశాల జీఎం గోపాల్ రెడ్డి , ఏజీఎం అన్నం చైతన్య రావు, ఆర్ఐ సత్యం రావు, ప్రిన్సిపల్ పులి రమ్య, డీన్ పరశురాం, వైస్ ప్రిన్సిపాల్స్ షబానా బేగం, స్వాతి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతుల అకౌంట్లను బ్లాక్‌లో పెట్టడం విడ్డూరం

- సీపీఐ (ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సంద బోయిన ఎల్లయ్య



నవతెలంగాణ-గజ్వేల్

ప్రభుత్వం రైతు రుణమాఫీ చేయడం వల్ల రైతులకు సంబంధించిన అకౌంట్లను బ్లాక్‌లో పెట్టడం విడ్డూరమని సీపీఐ (ఎం) సిద్దిపేట జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సంద బోయిన ఎల్లయ్య అన్నారు. బుధవారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతు అవసరాలకు అందులో డబ్బులను ఉంచుకున్నప్పటికీ వాటిని తీసుకునేందుకు ప్రయత్నం చేయగా బ్యాంకు మేనేజర్లు రైతులకు సంబంధించిన అకౌంట్లను బ్లాక్ లిస్టులో పెట్టారని ఆరోపించారు. అదేవిధంగా సర్వం కోల్పోయిన మల్లన్న సాగర్, కొండపోచమ్మ జలాశయం, అనంతగిరి సాగర్, రంగనాయక సాగర్, పునరావస కాలనీలో కోసం తీసుకున్న రైతులకు సంబంధించి ప్రత్యేక జీవో ద్వారా వర్తింప చేయాలన్నారు. వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు సిద్దిపేట జిల్లాలో వరి, మొక్కజొన్న, పత్తి పంటలు నష్టపోయినట్లు సమగ్ర సర్వే నిర్వహించి రైతు కుటుంబాలను ఆదుకోవాలని ఎక్కరాకు రూ.25 వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతులకు ఎటువంటి షరతులు లేకుండా రుణమాఫీ అమలు చేయాలని, వర్షాలతో నష్టపోయిన రైతు కుటుంబాలను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. రైతుల రుణమాఫీకి ఆన్సర్ తొలగించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బ్యాంకులకు వెళ్లిన రైతులను బ్యాంకు సిబ్బంది అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారని చెప్పారు. వ్యవసాయ అధికారులు ఇంటింటి సర్వే చేస్తున్నారని అదేవిధంగా నష్టపోయిన పంటలను సర్వే చేసే ప్రభుత్వానికి నివేదిక అందించాలని కోరారు. భారీ వర్షాలకు కూలిపోయిన ఇండ్లకు ప్రభుత్వం వెంటనే తక్షణపరిహారం చెల్లించాలని కోరారు. కూలీన ఇండ్లకు రూ.ఐదు లక్షలు ఇంటి నిర్మాణానికి మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్, సిద్దిపేట, హుస్నాబాద్, చేర్యాల, దుబ్బాక మున్సిపాలిటీలో భారీ వర్షాలకు రోడ్లు దెబ్బతి న్నాయని వెంటనే మరమ్మతులు చేయాలని పేర్కొ న్నారు. ఈ విలేకరుల సమావేశంలో నాయకులు ఎండి హైమద్, ఐలయ్య, అఫ్జల్ పాల్గొన్నారు.

పంట నష్టం పోయిన ప్రతి ఒక్కరైతుకు పరిహారం అందేలా చూడాలి

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు



నవతెలంగాణ-సిద్దిపేట

ఇటీవల కురిసిన అకాల వర్షాలకు పంట నష్ట పోయిన రైతులకు పరిహారం పక్కాగా అందేలా చూడాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. సిద్దిపేట నియోజకవర్గ స్థాయి వ్యవసాయ అధికారులతో క్యాంప్ కార్యాలయం సమీక్ష నిర్వహించిన మాజీ మంత్రి, ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో ఏ ఒక్క రైతు కూడా నష్ట పోవొద్దు అని, పంట నష్ట పోయిన ప్రతి ఒక్క రైతు కు రూ.10వేలు పరిహారం అందేలా చూడాలని, ఎక్కడ నష్టం జరిగిందో గుర్తించి క్షేత్ర స్థాయిలో పర్యటించి ప్రభుత్వంకు నివేదిక ఇవ్వాలని సూచించారు. సిద్దిపేట నియోజకవర్గంలో పంట నష్ట పోయిన ఏ ఒక్క రైతు కు నష్టం జరగొద్దని చెప్పారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు పద్మ, పర్శరాం రెడ్డి, గీత, జయంత్, నరేష్, శ్రీనాథ్ తదితరులు ఉన్నారు.

రాష్ట్ర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

- మంత్రులు రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్



నవతెలంగాణ-గజ్వేల్

సంక్షేమ పథకాల అమలుపై, రాష్ట్ర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెడతామని రాష్ట్ర మంత్రులు దామోదర్ రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్ అన్నారు. బుధవారం గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం మంత్రులను హైదరాబాదులో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర అభివృద్ధి చెందుతుందని అదే స్థాయిలో రాష్ట్ర సంక్షేమంపై దృష్టి పెడతామని పేర్కొన్నారు. గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం రైతు సంక్షేమానికి కృషి చేయాలని మంత్రులు పిలుపునిచ్చారు. రైతు రుణమాఫీ విషయంలో వస్తున్న ఇబ్బందులను పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అంతేకాకుండా రైతులు పండించే ధాన్యానికి గిట్టుబాటు ధర అందేలా మార్కెట్లో చూడాలని మంత్రులు కోరారు. రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని వారు చెప్పారు.రాష్ట్రంలో ప్రస్తుతం వర్షాలు భారీగా కురుస్తున్నాయని ప్రజలు అప్రమత్తంగా ఉండవలసిన అవసరం ఉందని కాంగ్రెస్ కార్యకర్తలు నాయకులు ఆదుకోవాలని అన్నారు. ప్రతిపక్షాలు ప్రతి విషయాన్ని భూతద్దంలో పెట్టి చూపిస్తున్నాయని మంత్రులు పేర్కొన్నారు. అభివృద్ధికి సూచనలు సలహాలు ఇవ్వాలని కోరారు. విమర్శలు మాను కోవాలి మంత్రులు సూచించారు. అదేవిధంగా ప్రభుత్వ సలహాదారుడు మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి నీ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మెన్ నరేందర్ రెడ్డి, వైస్ చైర్మెన్ జాకీర్, మున్సిపల్ మాజీ చైర్మెన్ గాడి పల్లి భాస్కర్, మార్కెట్ కమిటీ పాలకవర్గం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

తీగుల్ ఎస్సీ హాస్టల్ వార్డెన్ పై వెంటనే చర్యలు తీసుకోవాలి

- జిల్లా ఎస్ఎఫ్ఐ కార్యదర్శి దాసరి ప్రశాంత్



నవతెలంగాణ-సిద్దిపేట కలెక్టరేట్

జిల్లాలో జగదేవ్‌పూర్ మండలం తిగుల్ గ్రామంలో గల ఎస్సీ బాలుర హాస్టల్ వార్డెన్ కుమార స్వామి పై చర్యలు తీసుకోవాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా కార్యదర్శి దాసరి ప్రశాంత్ డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని డీఎస్సీడీఓ ఆఫీస్ కార్యాలయంలో సీనియర్ అధికారి లక్ష్మణ్‌కు (ఎస్ఎఫ్ఐ) జిల్లా కమిటీ అధ్వర్యంలో వినతిపత్రం అదంజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుమార స్వామి తనకు ఇష్టం వచ్చినప్పుడు హాస్టల్‌కు వస్తూ, పోతూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కుంటున్నారనీ, విద్యార్థుల బాగోగులు వార్డెన్ పట్టించుకోకపోవడం మూలంగా హాస్టల్‌లో చదువు కొనసాగించలేక చాలా మంది వెళ్లిపోతున్నారన్నారు. కుమారస్వామి గతంలో దుల్మిట్ట మండలంలో గల ఎస్సీ హాస్టల్‌లో కూడా విధులు సక్రమంగా నిర్వర్తించకపోవడం మూలంగా అది మూతపడిపోయిందనీ అన్నారు. దుల్మిట్ట హాస్టల్ సమస్యలపై వార్డెన్ వ్యవహారశైలి పై ఎస్ ఎఫ్ఐగా అనేక ఆందోళలను నిర్వహించి జిల్లా అధికారులు దృష్టికి తీసుకవెళ్లామని, తిగుల్ హాస్టల్ కూడా అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతుంది అన్నారు. తీగుల్ ఎస్సీ హాస్టల్‌ను ఎస్ఎఫ్ఐ జిల్లా బృందం పరిశీలనలో హాస్టల్ సమస్యలు పెరిగిపోవడానికి కారణం వార్డెన్ కుమారస్వామి తీరు సరిగ్గా లేకపోవడంతోనే క్రమ క్రమంగా విద్యార్థుల సంఖ్య తగ్గుతుందన్నారు. విద్యార్థులకు జ్వరాలు వచ్చిన పట్టించుకోవడం లేదనీ, ఆహార పదార్థాలు నాణ్యత లేకుండా అపరిశుభ్రంగా ఉంచడంతో సరిగ్గా భోజనం చేయడం లేదనీ, గదులు వర్షానికి ఊరుస్తున్నాయి. మరుగు దొడ్లు అపరిశుభ్రంగా ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా బెడ్ షీట్స్ కార్పెట్స్ ఇచ్చిన తిగుల్ హాస్టల్‌లో ఇవ్వకుండా కాలయాపన చేశారన్నారు. వార్డెన్ కుమారస్వామి పైన చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు . కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ సిద్దిపేట పట్టణ కార్యదర్శి బత్తుల అభిషేక్ భాను, నాయకులు సంతోష్, నరేష్, అజయ్, పాల్గొన్నారు

చెరువు బ్యాక్ వాటర్‌లో మునిగిన ఆరెపల్లి ఇండ్లు

- రైతు వేదికలో ఆరెపల్లి వాసులకు పునరావాసం
- ప్రభుత్వపరంగా అన్ని రకాల ఆదుకుంటాం
- జిల్లా కలెక్టర్ మను చౌదరి



నవతెలంగాణ-నంగునూరు

సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం అక్కెనపల్లి మధిర గ్రామమైన ఆరెపల్లిలో ఇండ్లలో నీటిలో మునిగిన బాధితులకు ప్రభుత్వపరంగా అన్ని విధాల ఆదుకుంటామని సిద్దిపేట జిల్లా కలెక్టర్ మను చౌదరి తెలిపారు. గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు అక్కెనపల్లి మధిర గ్రామమైన ఆరెపల్లిలో వరద నీరు చెరువులో చేరి నీటిమట్టం ఎక్కువ కావడంతో బ్యాక్ వాటర్ తో గ్రామంలోని ఇండ్లలోకి నీరు చేరింది. గ్రామంలో ఉన్న 23 కుటుంబాలకు తాత్కాలికంగా రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో రైతు వేదికలో ఆశ్రయ కల్పించారు. బుధవారం జిల్లా కలెక్టర్ మన చౌదరి, సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధ తో కలిసి బాధితులను తాత్కాలిక శిబిరంలో సందర్శించి వారిని ఓదార్చారు. ప్రభుత్వం తరపున అన్ని విధాల ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. బాధితులకు శాశ్వత గృహాలు నిర్మించేందుకు ప్రజాపాలన కార్యక్రమం ద్వారా ఆర్జీలను స్వీకరించి ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. ఆశ్రయం పొందుతున్న వారందరికీ వైద్య పరీక్షలు నిర్వహించి ఆహార, ఇతర అవసర ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలని వైద్యాధికారులను సూచించారు. బాధితుల పూర్తి వివరాలతో త్వరితగతిన నివేదిక తో కూడిన ప్రతిపాదనలు పంపాలని తహసీల్దార్ జి.సరితను ఆదేశించారు. బ్యాక్ వాటర్‌తో ఇల్లు దెబ్బ తినకుండా చూసేందుకు చెరువులో ఉన్న నీటిమట్టాన్ని తాత్కాలికంగా తగ్గించేందుకు ఏర్పాట్లు చేయాలని ఇరిగేషన్ శాఖ అధికారులను ఆదేశించారు.

స్వార్థ రాజకీయాలు వదిలి సేవా కార్యక్రమాలు చేద్దాము

- 28 కుటుంబాలకు బియ్యం నిత్యవసర సరుకులు పంపిణీ
- మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు



నవతెలంగాణ-నంగునూరు

స్వార్థ రాజకీయాలు వదిలి సేవా కార్యక్రమాలు చేద్దామని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు మైనంపల్లి హనుమంతరావు అన్నారు. గత రెండు, మూడు రోజుల నుంచి కురిసిన వర్షాలతో బుధవారం నంగునూరు మండల పరిధిలోని అక్కెనపల్లి మధుర గ్రామమైన ఆరెపల్లి గ్రామంలో వరద రావడంతో 28 బుడగ జంగాల కుటుంబాల ఇండ్లలోకి వరద వచ్చి చేరింది. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు అక్కడికి చేరుకొని 28 బుడగ జంగాల కుటుంబాలకు బియ్యం, నిత్యవసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయాలు వదిలి సేవా కార్యక్రమాలు చేయాలని, పేదలకు అండగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతున్నారన్నారు. పార్టీలకతీతంగా పేద ప్రజలకు ఇతర పార్టీ నాయకులు రాజకీయాలు చేయకుండా వారికి సేవ చేయాలన్నారు. ప్రభుత్వమే కాకుండా పేద ప్రజలకు వాలంటరీ ఆర్గనైజేషన్ ల ద్వారా కూడా సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ప్రతి వ్యక్తి సేవాభావాన్ని కలిగి ఉండాలన్నారు. పేద, తన, మన బేధాలు లేకుండా ఐడ్రా పని చేస్తుందని అన్నారు. ఈ సమయంలో హైడ్రా రాజకీయాలు చేయకుండా రాజకీయ నాయకులు పేద ప్రజలకు సేవ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు తూంకుంట నర్సారెడ్డి, సిద్దిపేట నియోజకవర్గ ఇన్చార్జ్ పూజల హరికృష్ణ, టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి దేవులపల్లి యాదగిరి, గంప మహేందర్ రావు, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు తప్పెట శంకర్, రాములు, చెలికాని యాదగిరి,జంగిటి శ్రీనివాస్, రాగుల కృష్ణ,అశోక్ గౌడ్, సిద్దిపేట, నంగునూరు మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వినాయక మండపాల కమిటీ సభ్యులు అధికారులకు సహకరించాలి

- మున్సిపల్ చైర్ పర్సన్ కడవేరుగు మంజుల రాజనర్సు



నవతెలంగాణ-సిద్దిపేట

వినాయక మండపాల కమిటీ సభ్యులు అధికారులకు సహకరిం చాలని మున్సిపల్ చైర్ పర్సన్ కడవెరుగు మంజుల రాజనర్సు సూచించారు. బుధవారం వినాయక చవితి సందర్భంగా పట్టణంలో చేపట్టవలసిన కార్యక్రమాలపై పురపాలక సంఘం కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్, ఏసీపీ మధు, మున్సిపల్ వైస్ చైర్మెన్ జంగిటి కనకరాజు, మున్సిపల్ ,రెవెన్యూ, విద్యుత్ అధికారులతో చైర్ పర్సన్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలపాల కమిటీ నిర్వాహకులు మున్సిపల్, పోలీసు, విద్యుత్ అధికారులు సూచించే జాగ్రత్తలు తప్పక పాటించాలన్నారు. పట్టణంలో శానిటేషన్ పనులను నిరంతరం పర్యవేక్షించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. పట్టణంలోని చెరువుల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని ఏసీపీ మధునీ కోరారు. చెరువుల వద్ద గజ ఇతగాళ్ళు, రెస్క్యూ టీం సభ్యులు ఎప్పుడు అందుబాటులో ఉండాలని సూచించారు. ఏసీపీ మధు మాట్లాడుతూ పట్టణంలో వినాయక నిమజ్జనం మూడు రోజులు మాత్రమే నిర్వహించనున్నట్లు తెలిపారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు అన్నారు. ఈనెల 16వ తేదీన మిలాద్-ఉన్-నబీ పండు గ సందర్భంగా ప్రార్థనలు అనంతరం 17న చేపట్టవ లసిన జూలూస్ కార్యక్రమాన్ని, 19న నిర్వహించాలని మత పెద్దలకు చెప్పగా వారు అంగీకరించారని అన్నారు. సిద్దిపేట పట్టణంలో వినాయక నిమార్జనాలు 18 వరకు పూర్తి చేయాలని అన్నారు. లేదా 20న నిర్వహించాలని అన్నారు. ఎట్టి పరిస్థితిలలో 19న వినాయక నిమార్జనాలు చేపట్టారాదని దీనికి పట్టణ ప్రజలందరూ సహకరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐలు లక్ష్మి బాబు, ఉపేందర్, విద్యాసాగర్, ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్, మున్సిపల్ డి. ఈ. ప్రేరణ, ఏ.ఈ. అన్వేష్ రెడ్డి, యాదగిరి, విద్యుత్ ఏ.ఈ. రమేష్, అగ్నిమాపక అధికారులు, ఎక్సైజ్ అధికారులు, మున్సిపల్ సానిటరీ ఇన్స్పెక్టర్ సతీష్, వనిత, మాధవి మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

- గోపులాపూరు తురక వాని కుంట తెగి 12 ఎకరాలు నష్టం.
- సిద్దిపేట నియోజకవర్గంలో 700 ఎకరాలు పంట నష్టం
- ఆందోళన చెందొద్దు అండగా ఉంటా
- మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు



నవతెలంగాణ- సిద్ధిపేటరూరల్

పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మూడు రోజుల నుంచి కురుస్తున్న అకాల వర్షం కారణంగా నారాయణరావుపేట మండల పరిధిలోని గోపులాపూర్ తురకవానికుంట తేగి 12 ఎకరాలు పంట నష్టాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిద్దిపేట నియోజకవర్గంలో వర్షం కారణంగా 700 ఎకరాలు పంట నష్టం జరిగిందని అన్నారు. సాగు చేసిన ప్రతి ఎకరానికి రూ.30 వేల ఇసుక మీటవేసిన పొలం ఎకరానికి రూ. 50 వేలుపాయలు ప్రభుత్వం చెల్లించాలని అన్నారు. వ్యవసాయ అధికారులు సిద్దిపేట జిల్లాలో పంట నష్టాన్ని నివేదిక తయారుచేసి ప్రభుత్వానికి ఇవ్వాలని సూచించారు. అనంతరం రైతు దేవయ్య రెండు ఎకరాలు పంట నష్టం జరిగిందని వెంటనే పదివేల రూపాయలు ఆర్థిక సాయం అందించారు. ఎవరు బాధపడొద్దని అండగా ఉంటానని ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు . వీరి వెంట మాజీ సూడా చెర్మన్ రవీందర్ రెడ్డి మాజీ ఎంపీపీ ఒగ్గు బాలకృష్ణ, సీనియర్ నాయకుడు ఎల్లారెడ్డి, మాజీ సర్పంచ్ రుక్కవ్వ ,రాజు , నాయకులు తదితరుల పాల్గొన్నారు.

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం

- నిండిన చెరువులు, కుంటలు
- స్తంభించిన రవాణా వ్యవస్థ
- ఎక్కడ వారే అక్కడ
- ఎటు చూసినా నీళ్ళే నీళ్ళు



నవతెలంగాణ-నంగునూరు

మూడు, నాలుగు రోజుల నుంచి నంగునూరు మండలంలో ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుంది. గ్రామాల్లో వర్షంతో మట్టి రోడ్లు చిత్తడిగా మారాయి. శిథిలావస్థలో ఉన్న ఇండ్లు కూలిపోతున్నాయి. వర్షాల వల్ల శిథిలావస్థకు చేరిన ఇండ్లలో ఉండకూడదని రెవెన్యూ అధికారులు వెల్లడించారు. వర్షాల కోసం ఎదురు చూస్తున్న రైతులకు ఊరట లభించింది. ఆరుతడి పంటలు వేసుకున్న రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నంగునూరు మండలం దర్గపల్లి శివారులో చెక్ డ్యాం పై కల్వర్టు పనులు కొనసాగుతున్నాయి. దర్గపల్లి నుంచి చిన్న కోడూరు మండలానికి వెళ్ళేందుకు తాత్కాలికంగా పైపులు వేసి రోడ్డు వేశారు. వర్షాలకు ఆ రోడ్డు తెగిపోయింది. దీంతో ఆ మార్గం గుండా వెళ్ళేందుకు వీలు లేకుండా పోయింది. నంగునూరు మండలం పాలమాకుల నుంచి ఒబులాపూర్ మీదుగా రాముని పట్ల, చిన్న కోడూరు మండలం వెళ్లే వాహన రాకపోకలు స్థంబించిపోయాయి. నంగునూ రు మండలంలోని ఖాతా, ధూల్మిట్ట మండలం జాలపల్లి, నంగునూరు మండలం ఘనపూర్, నంగునూరు, అక్కెనపల్లి గ్రామాల్లో తొమ్మిది చెక్ డ్యాంలు నిర్మించారు. తొమ్మిది చెక్ డ్యాంలు నిండి పారుతున్నాయి. దీంతో పెద్ద వాగు జలకళ సంతరించుకున్నది. పెద్ద వాగు ఉధృతంగా ప్రవహించడంతో కోహెడ మండలం బస్వాపూర్ గ్రామ సరిహద్దుల్లో మోయతుమ్మద వాగుపై రాకపోకలు నిలిచిపోయాయి. ఇటీవల కురిసిన వర్షానికి తోడు మంగళవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు ఒక గ్రామం నుంచి మరో గ్రామానికి వెళ్ళే పరిస్థితి లేకుండా పోయింది. ఎటు చూసిన నీళ్లే కనబడుతున్నాయి. నంగునూరు మండలం గుండా వెళ్ళే అన్ని రోడ్లను మూసి వేశారు. సిద్దిపేట నుంచి నంగునూరు మండలం మీదుగా హుస్నాబాద్, హన్మకొండ, వరంగల్ వెళ్లే రవాణా వ్యవస్థ పూర్తిగా స్తంభించిపోయింది.అటు పోలీస్, రెవిన్యూ అధికారులు వర్షం వల్ల ఆటంకాలు ఎదురైనా ప్రాంతాలను పర్యవేక్షణ చేపడుతున్నారు.

పందిల్లకు నిలిచిన వాహన రాకపోకలు

- హైవే పనులతో ఇండ్లలోకి చేరిన నీరు
- వరద సహాయక చర్యలు చేపట్టిన మాజీ సర్పంచ్ తోడేటి రమేష్



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

భారీ వర్షాలతో హుస్నాబాద్-సిద్దిపేట ప్రధాన రహదారిపై ఉన్న పందిల్ల బ్రిడ్జి తెగిపోవడంతో పందిళ్లకు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. పొట్లపల్లి గ్రామం నుంచి పందిళ్లకు మార్గమధ్యలో రోడ్డం పై నీటి ప్రవాహం ఎక్కువ కావడంతో వందలాది వాహనాలు నిలిచిపోయాయి. దీంతో హుస్నాబాద్ రెండు మార్గాల వద్ద వాహనాలు రాకపోకలు నిలిచిపోయి. ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పందిళ్ళ గ్రామంలో హైవే రోడ్డు పనులు నడవడంతో గ్రామంలో నీటి నిల్వలు పెరిగి ఇంటిలోకి చేరాయి. పందిళ్ళ గ్రామంలో రోడ్లన్నీ అస్తవ్యస్తంగా మారాయి. దీంతో గ్రామ మాజీ సర్పంచ్ తోడేటి రమేష్ గ్రామంలో సహాయక చర్యలు చేపట్టారు. పొట్లపల్లి నుంచి పందిళ్లకు వెళ్లే మార్గంలో కల్వర్టు వద్ద జెసిబి తో చెట్లను, మట్టిని తొలగించి నీరు వెళ్లేలా చర్యలు చేపట్టారు. దీంతో మా గ్రామాల మీద రాకపోకలు కొనసాగాయి.

కల్వర్టు నిర్మాణంతో సమస్యలు దూరం

పొట్లపల్లి మార్గమధ్యలో ఉన్న రోడ్డం వద్ద కల్వర్టు నిర్మిస్తే రాకపోకలకు అంతరయం లేకుండా ఉంటుందని గ్రామస్తులు కోరుతున్నారు. ప్రతి ఏటా వర్షాకాలంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా మంత్రి పొన్న ప్రభాకర్ రోడ్డు వద్ద కల్వర్టు నిర్మించి సమస్యలు పరిష్కరించాలని పందిల్ల, పొట్లపల్లి గ్రామస్తులు కోరుతున్నారు.


ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు
TEACHER'S DAY
శుభాకాంక్షలు
టీఎస్ యుటిఎఫ్, సిద్దిపేట
జిల్లా కమిటి.


ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు
HAPPY Teacher's DAY
G. జానకి రాములు
GHM. ZPHS


ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు
శుభాకాంక్షలు
HAPPY Teacher's DAY


ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు
నవ జీవన్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ సొసైటి
Regd No. 204/2010 సిద్దిపేట జిల్లా


ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు
శుభాకాంక్షలు
HAPPY Teacher's DAY
LFL HM. MPPS


ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు
శుభాకాంక్షలు
పెంటయ్య
ప్రధానోపాధ్యాయులు
ZPHS
HAPPY Teacher's DAY


ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు
శుభాకాంక్షలు
HAPPY Teacher's DAY
PRTU


ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు
Teacher's DAY
కల్లేపల్లి శ్రీనివాస్


ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు
శుభాకాంక్షలు
Teacher's DAY
PRTU


ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు
STU
శుభాకాంక్షలు
HAPPY Teacher's DAY
సెల్: 9441808065


ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు
HAPPY Teacher's DAY


ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు
Teacher's DAY
సయ్యద్ సాబేర్ అలి
శ్రీనివాస్ రాథోడ్
STUTS సంగారెడ్డి
శుభాకాంక్షలు


ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు
నా ప్రియ గురువులకు, మిత్రులకు
ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు
చంద్ర చరణ్ తేజ్ కు
పుట్టిన రోజు శుభాకాంక్షలు
చంద్ర చరణ్ తేజ్
మీ శ్రేయోభిలాషి...
రామాయంపేట, మెదక్ జిల్లా


ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు
సెల్: 9490863502,
9491324791, 9014614515


ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు
MPPS SC


ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు
Teacher's DAY
డాక్టర్ పి. శారద


ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు
మీ శ్రేయోభిలాషి...
కర్రె సిద్దిరాములు
HAPPY Teacher's DAY


ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు
TSGHMA
Teacher's Day
బెలిదె శ్రీనివాస్ రావు
TSGHMA జిల్లా అధ్యక్షులు
సిద్దిపేట


ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు
శుభాకాంక్షలు
HAPPY Teacher's DAY


ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు
HAPPY Teacher's DAY
TPTF సిద్దిపేట


ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు
TSUTF
HAPPY Teacher's DAY
V. సత్యనారాయణ
TSUTF రాష్ట్ర నాయకులు
C. చంద్రా రెడ్డి
TSUTF రాష్ట్ర నాయకులు
M. రవీందర్
S. సుధాకర్
G. కిరణ్
TSUTF గజ్వేల్ డివిజన్ - సిద్దిపేట జిల్లా


ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు
జిల్లాలోని సమస్త ఉపాధ్యాయ మిత్రులకు
ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు
Ch. దేవరాజు
P. లక్ష్మయ్య
ఆస లక్ష్మణ్
PRTU రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు


ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు
Teacher's DAY
అమీరొద్దిన్
PRTU


ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు


ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు
రాష్ట్ర స్థాయిలో, జిల్లా స్థాయిలో ఉత్తమ
ఉపాధ్యాయులుగా ఎంపికైన ఉపాధ్యాయ
మిత్రులందరికి శుభాకాంక్షలు
మీ శ్రేయోభిలాషి... టేక్మాల్, మెదక్.


HAPPY Teacher's DAY


ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు
HAPPY TEACHERS' DAY
కర్రోళ్ల దేవయ్య
ZPHS

కూడ వెళ్లి వాగులోకి భారీగా వరద నీరు





నవ తెలంగాణ- గజ్వేల్

ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో గజ్వేల్ మండలం అమ్మదిపూర్ గ్రామం నుంచి భారీగా కూడవెల్లి వాగులోకి వరద నీరు ప్రవహిస్తుంది. మర్కుకు మండలం చేబర్తి గ్రామం వద్ద ప్రారంభమై కూడవెల్లి వాగు గజ్వేల్ మండలం కొడకండ్ల మీదుగా అమ్మదిపూర్ గ్రామం మీదుగా మిడిదొడ్డి మండలం కూడవెల్లి వాగులోకి ప్రవహిస్తుంది. అక్కడినుండి అల్వాల, అందే, చెక్ డాములు నిండుకొని మల్లు పల్లి చెక్ డ్యామ్ లోకి నీరు దిగుతుంది. కూడ వెళ్లి వాగు భారీగా వరద నీరు చేరడంతో గజ్వేల్, మర్కుక్, మిరుద్ రెడ్డి మండలాల్లో కూడవెల్లి వాగు నీటి వరద పారుతుంది. గజ్వేల్ మండలం కొడకండ్ల చెక్ డ్యామ్ వద్ద ప్రవహించే నీటితో సుమారు 35 వేల ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉంది. దీని వాగు పరిభాగ గ్రామాలు రైతు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. దీని పరిధిలో సుమారు 20 చెక్కు డ్యాములు ఉండగా అన్ని పూర్తిగా నిండి మత్తడి దుంకుతున్నాయి.

కేజీబీవీని సందర్శించిన అధికారులు

- నవతెలంగాణ కథనానికి స్పందన



నవతెలంగాణ-మర్కుక్

మండల కేంద్రమైన మర్కుక్ కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల చెరువు ను తలపిస్తోందని నవతెలంగాణ ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. బుధవారం మర్కుక్ ఎంపీడీవో అఫ్జలుద్దీన్, ఎంపీవో రాజలింగం, ఎంఈవో ఉదయ భాస్కర్ రెడ్డిలు కస్తూర్బా గాంధీ పాఠశాలను సందర్శించారు. అనంతరం పాఠశాలలో ఆవరణలో ఉన్న నీళ్ళను జేసీబీ ద్వారా తొలగించారు. ఈ కార్యక్రమంలో యూసుఫ్ ఖాన్ పల్లి పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, గ్రామ పంచాయతీ కార్మికులు, తదితరులున్నారు.

కూలిన ఇండ్లను పరిశీలించిన తహశీల్దార్లు



నవతెలంగాణ-మద్దూరు

దూల్మిట్ట మండలంలోని జాలపల్లి, కూటిగల్, దూల్మిట్ట, మద్దూరు మండలంలోని వల్లంపట్ల, గాగిల్లాపూర్, మద్దూరు, లద్నూరు, గ్రామాలలో కూలిపో యిన ఇండ్లను తహశీల్దార్‌లు మధుసూదన్, సంజీవ్ కుమార్, బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు దూల్మిట్ట మండలంలో జాలపల్లి 2, కూటిగల్ 3, దూల్మిట్ట 2, మద్దూరు మండలంలో వల్లంపట్ల 3, గాగిల్లాపూర్ 3, మద్దూరు 1 , లద్నూరు 4, ఇండ్లు కూలిపోయినట్లు వారు తెలిపారు కూలిన ఇండ్లకు నష్టపరిహారం కోసం ప్రభుత్వానికి నివేదిక పంపించినట్లు వారు తెలిపారు వారి వెంట ఆర్ఐ లు రవీందర్ రమేష్ సర్పంచుల ఫోరం మండల మాజీ అధ్యక్షురాలు చొప్పరి వరలక్ష్మి సాగర్ తదితరులు ఉన్నారు

మర్కుక్‌లో స్కూల్ కాంప్లెక్స్ సమావేశం



నవతెలంగాణ-మర్కుక్

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మర్కుక్‌లో ఆయా గ్రామాల ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు ఎఫ్.ఎల్.ఎన్ కార్యక్రమంలో భాగంగా వివిధ అంశాలపైన కాంప్లెక్స్ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశాన్ని ఉద్దేశించి జిల్లా పరిశీలకులు రవీందర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాలను మెరుగుపరిచేందుకు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు.ఎఫ్.ఎల్.ఎన్ కార్యక్రమాన్ని పాఠశాలలో ఇంప్లిమెంటేషన్ చేస్తూ టి ఎల్ ఎం , టెస్ట్ బుక్స్ ఉపయోగిస్తూ బోధించాలని సూచించారు. తరగతి గదిలో వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు.ఉపాధ్యాయులు విద్యార్థుల ఉతీర్ణత శాతం పెరిగేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏంఈవో ఉదయ భాస్కర్ రెడ్డి, కాంప్లెక్స్ హెచ్ఎం వెంకటశం, సీఆర్పీ నాయక్,ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

18వ వార్డులో పర్యటించిన మున్సిపల్ కమిషనర్



నవ తెలంగాణ-సిద్దిపేట

మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ బుధవారం 18వ వార్డులో పర్యటించారు. ఈ సందర్భంగా వార్డులోని బిఆర్ఎస్ నాయకులు అడ్డగట్ల శేఖర్, అంజిలు మాట్లాడుతూ వార్డులో సిసి రోడ్లు లేక చాలా ఇబ్బందిగా ఉందని తెలుపగానే, వార్డుకు వచ్చి సమస్యలు కమిషనర్ ప్రత్యక్షంగా చూశారన్నారు. వార్డు మొత్తం పర్యటించి, వార్డులో ఎక్కడెక్కడ ఏమేమి సమస్యలు ఉన్నాయో తెలుసుకున్నారన్నారు. దాదాపుగా వార్డులో సీసీ రోడ్ల సమస్యనే విపరీతంగా ఉందని కమిషనర్‌కు విన్నవించారు. కమిషనర్ దాదాపు రెండు గంటలు వార్డులో పర్యటించి సమస్యలన్నీ తెలుసుకున్నారని తెలిపారు. సాధ్యమైనంత తొందరలో సిసి రోడ్ల సమస్య పరిష్కరిస్తారని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈ అన్వేష్ రెడ్డి, వార్డు నాయకులు, జవాన్ సాయి తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో..



నవ తెలంగాణ- గజ్వేల్

గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కో-ఎడ్యుకేషన్ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి అతిథి అధ్యాపకులుగా బోధన చేసేందుకు ఆసక్తి కలవారు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ డా. నిఖత్ అంజుమ్ తెలియజేశారు. కళాశాలలో ఆంగ్లం-1, కంప్యూటర్ సైన్స్-1, కామర్స్-1 సబ్జెక్టులలో ఒక్కొక్కటి చొప్పున మొత్తం 3 పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలియజేశారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకి సంబంధిత పీజీ కోర్సులలో 55 శాతం మార్కులు ఉండాలని అన్నారు. ఎస్సీ, ఎస్టీలకు మాత్రం 50% మార్కులు సంబంధించిన సబ్జెక్టులో ఉంటే సరిపోతుందన్నారు. నెట్, స్లెట్, పి.హెచ్. డి .అర్హతలు కలిగిన అభ్యర్థులకి ప్రాధాన్యత ఉంటుందని తెలియజేశారు. ఆసక్తిగల అభ్యర్థులు సెప్టెంబర్ 6వ తేదీలోగా కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు సెప్టెంబర్ 9 వ తారీఖున ఇంటర్వ్యూకు హాజరుకావాలని తెలిపారు.

మాజీ ఎంపీపీ కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్సీ



నవ తెలంగాణ-కొండపాక

కొండపాక మాజీ ఎంపీపీ అనంతుల శారద అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తమ్ రెడ్డి బుధవారం ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆమె కుమారులు విజయ్ కృష్ణ, సంజయ్ కృష్ణలను పరామర్శించారు. ఆయన వెంట పీఆర్టీయు మండల అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, జగన్నాథ్ రెడ్డి, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

అతిథి అధ్యాపకులు కావాలి



నవతెలంగాణ-గజ్వేల్

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో పనిచేయటానికి అతిథి అధ్యాపకులు కావాలని కళాశాల ప్రిన్సిపాల్ కమల కృష్టియానా తెలిపారు. మొత్తం ఆరు పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఆమె పేర్కొన్నారు. పీజీ కోర్సులలో 55% మార్కులు ఉండాలని ఆమె తెలిపారు. ఎస్సీ ఎస్టీలకు మాత్రం 50 మార్కులు సంబంధించిన సబ్జెక్టు ఉంటే సరిపోతుందన్నారు. నీట్, సెట్, పిహెచ్డి చేసి ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. అదేవిధంగా మైక్రో బయాలజీ, తెలుగు, కెమిస్ట్రీ సబ్జెక్టులో ఒక్కొక్కరు కావాలన్నారు.

లారీని ఢీ కొట్టిన కారు, ఇరువురికి గాయాలు



నవ తెలంగాణ-కొండపాక

కొండపాక శివారులో కొమురవెల్లి సమీపంలో రాజీవ్ రహదారిపై బుధవారం ఆగి ఉన్న లారీని కారు ఢీకొట్టడంతో ఇద్దరికీ స్వల్ప గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి హైదరాబాద్ వైపు నుంచి జగిత్యాలకు వెళ్తున్న కారు కొండపాక శివారులో ఆగి ఉన్న లారీని ఢీకొట్టింది. దాంతో చంద్రశేఖర్, సౌమ్య లకు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

ప్రమాదవశాత్తు గోతిలో పడి గేదె మృతి



నవ తెలంగాణ-కొండపాక

ప్రమాదవశాత్తు గోతిలో గేదె పడి మృతి చెందిన సంఘటన కొండపాక మండలం జప్తి నాచారంలో బుధవారం జరిగింది గ్రామానికి చెందిన చింతల సత్యవ్వ కు గల గేదె అంటే సమీపంలో గల గోతిలో ప్రమాదవశాత్తు పడిపోయింది. అది గమనించిన పరిసరాల వారు ఎక్స కవేటర్ సహాయంతో పైకి తీశారు. గేదె అప్పటికే మృతి చెందింది. సుమారు రూ.80 వేల నష్టం వాటిల్లిందని బాధితురాలు పేర్కొంది.

కంది చేనులో కలుపు తీస్తుండగా తేలు కుట్టి మహిళ మృతి



నవతెలంగాణ-మద్దూరు

కంది చేనులో కలుపు తీసేందుకు వచ్చిన ఓ మహిళ కలుపు తీస్తున్న క్రమంలో తేలు కుట్టడంతో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. మద్దూరు ఎస్సై షేక్ మహబూబ్ తెలిపిన వివరాల ప్రకారం జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం కొడువటూర్ గ్రామానికి చెందిన దండుగుల లావణ్య (25) మద్దూరు మండలంలోని సలాక్ పూర్ గ్రామానికి చెందిన కామిడీ జీవన్ రెడ్డి అనే రైతు పొలంలో కంది కలిసేందుకు 15 మందితో కలిసి కూలి పనికి వచ్చింది పనిచేస్తున్న క్రమంలో తేలు కుట్టినట్లు మృతురాలు తోటి కూలీలతో తెలపడంతో వెంటనే రైతు జీవన్ రెడ్డి లావణ్యను మద్దూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువచ్చి ప్రథమ చికిత్స చేయించారని, అలాగే మెరుగైన వైద్యం కోసం సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు చికిత్స పొందుతూ లావణ్య బుధవారం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు మృతురాలికి ఇద్దరు కుమార్తెలు ఒక కుమారుడు, భర్త ఉన్నారు. భర్త మహిపాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విష జ్వరాల నుంచి ప్రజలను కాపాడాలి

- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాళ్ళబండి శశిధర్ డిమాండ్



నవతెలంగాణ-సిద్దిపేట అర్బన్

విష జ్వరాల నుంచి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాళ్ళబండి శశిధర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో జిల్లావైద్యాధికారికి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బుధవారం వినతిపత్రం సమర్పించారు ఈ సందర్భంగా రాళ్ళబండి శశిధర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో ఉన్న ప్రజల ఆరోగ్యాన్ని కాపాడడం కోసం సంచార వైద్య బృందాలను ఏర్పాటు చేయాలని కోరారు. ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాలలో డెంగ్యూ , టైఫాయిడ్, మలేరియా పరీక్షలు నిర్వహించి మందులు సరఫరా చేసి. ప్లేట్ లెట్ మిషన్లు ఏర్పాటు చేయాలని, కోరారు. జిల్లా వ్యాప్తంగా వర్షాకాలంలో విష జ్వరాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ప్రజల ప్రాణాలు కాపాడాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని వారు విమర్శించారు, ప్రభుత్వ హాస్పిటల్స్‌లో మందులు, డాక్టర్లు, సిబ్బంది కొరత తీవ్రంగా ఉందని ఈ సీజన్లో ప్రతి ఇంట్లో ఒకరిద్దరు జ్వరంతో బాధపడుతున్నారని, విషజ్వరాల అంటువ్యాధుల నుండి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని కోరారు. ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఏరియా ఆసుపత్రులలో ప్లేట్ లెట్స్ మిషన్లు లేక రోగులను ప్రైవేటు ఆసుపత్రులకు పంపిస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో డెంగ్యూ, టైఫాయిడ్, చికెన్ గున్యా, మలేరియా పరీక్షలు చేసేవిధంగా సౌకర్యాలు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. అదేవిధంగా గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహిం చాలని, ప్రతి కుటుంబానికి దోమ తెరలు పంపిణీ చేయాలని, గ్రామాల్లో, మున్సిపాలిటీల్లో ఫాగింగ్ చేయాలని, రక్తం పరీక్షల నిర్వహణ కు కావలసిన పరికరాల కొనుగోలు చేసి ఖాళీ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా మెడికల్ అధికారికి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కొంగరి వెంకట మావో, సీఐటీయూ జిల్లా కార్యదర్శి కాముని గోపాలస్వామి, జిల్లా మాజీ సర్పంచ్ తాడూరి రవీం దర్, జిల్లా సహాయ కార్యదర్శి గొర్రె శ్రీనివాస్, ఉపా ధ్యక్షులు తాటోజు రవీంద్ర చారి, జిల్లా కమిటీ సభ్యులు జి. బాలకిషన్, బోయిని మల్లేశం, చంద్రం, తాడూరి నరేష్ తదితరులు పాల్గొన్నారు.కొడుకు

చినుకు పడితే చెరువులను తలపిస్తున్న ఆసుపత్రి

- నిధులు ఉన్నా మరమ్మతులకు నోచుకోని ఆసుపత్రి






నవతెలంగాణ-మద్దూరు

గత ఐదు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మండలంలోని లద్నూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం శిథిలావస్థకు చేరడంతో చినుకు పడితే ఆస్పత్రి మొత్తం చెరువులను తలపిస్తుంది. ఆసుపత్రికి వచ్చే రోగులు ఆసుపత్రికి రావాలంటే భయభ్రాంతులకు గురవుతున్నారు. ఆసుపత్రికి వచ్చి వైద్యం చేయించుకోవాలంటే స్లాబ్ కింద ఉన్న పెచ్చులు ఊడి తమ మీద ఎప్పుడు పడతాయో అని బిక్కుబిక్కుమంటూ ఆసుపత్రికి రోగులు వస్తున్నారు. ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఆసుపత్రి మొత్తం చెరువును తలపించే విధంగా, పూర్తిగా నీళ్ళు నిండి ఉండడంతో సిబ్బంది రోగులకు వైద్యం చేసేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం ఆస్పత్రి మరమ్మతుల కోసం నిధులు మంజూరు చేసినా, సంబంధిత కాంట్రాక్టర్ పనులు చేయకపోవడంతో ఆసుపత్రి మొత్తం జలమయమై చెరువును తలపిస్తుందని గ్రామస్తులు తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా సంబంధిత కాంట్రాక్టర్ చేత ఆసుపత్రికి మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలి... యూపీఎస్‌ను వ్యతిరేకిస్తున్నాం

- ఉమ్మడి సర్వీస్ రూల్స్ వెంటనే అమలు చేయాలి
- తెలంగాణ ప్రొగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర సీనియర్ నాయకులు జి తిరుపతిరెడ్డి,



నవ తెలంగాణ-సిద్దిపేట

ఇతర రాష్ట్రాలలో అమలు చేస్తున్న పాత పెన్షన్ విధానాన్ని, రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు పాత పెన్షన్ విధానాన్ని ఉపాధ్యాయ, ఉద్యోగులకు రాష్ట్రంలో అమలు చేయాలని తెలంగాణ ప్రొగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర సీనియర్ నాయకులు జి తిరుపతిరెడ్డి డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తేనున్న యుపిఎస్ విధానాన్ని వ్యతిరేకిస్తున్నామని ఆయన తెలిపారు. విద్యారంగంలో, ఉపాధ్యాయులకు రాష్ట్రవ్యాప్తంగా అనేక సమస్యలు ఉన్నాయని, దేశ భవిష్యత్తు తరగతి గదులలో నిర్మాణం అవుతుందన్న విషయాన్ని ప్రభుత్వం గుర్తించి సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. 30 సంవత్సరాలుగా ఉపాధ్యాయుల ఉమ్మడి సర్వీస్ రూల్స్ పట్ల ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల విద్యారంగం తీవ్రంగా నష్టపోయిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి సర్వీస్ రూల్స్ ను అమలు చేయాలి. ఎంఈఓ పోస్టులు, డైట్ లెక్చరర్ పోస్టులు, జూనియర్ లెక్చరర్ పోస్టులను ప్రమోషన్ల ద్వారా భర్తీ చేసి, విద్యారంగ అభివృద్ధి కోసం కృషి చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన 5 డి ఏ లను వెంటనే ప్రకటించాలి. 2018 జూలై ఫస్ట్ నుండి పి ఆర్ సి ని అమలు చేయాలన్నారు. రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న బకాయిల బిల్లులను వెంటనే విడుదల చేసి ఆర్థిక ఇబ్బందులు లేకుండా చూడాలి. పదివేల ఎల్ ఎఫ్ ఎల్ పోస్టులు మంజూరు చేసి ఎస్జిటి ఉపాధ్యాయులకు ప్రమోషన్స్ ఇచ్చి, ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలన్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలకు మౌలిక సదుపాయాలను కల్పించాలి. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు ఉండే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. విద్యా వ్యవస్థ బాగుపడినప్పుడే రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతుందని తిరుపతి రెడ్డి అభిప్రాయపడ్డారు.

ప్రజల పక్షాన మాట్లాడితే దాడులు చేస్తారా ?

- రైతుబంధు సమితి రాష్ట్ర కౌన్సిల్ మాజీ సభ్యులు దేవీ రవీందర్



నవ తెలంగాణ-గజ్వేల్

ప్రజల పక్షాన మాట్లాడితే కాంగ్రెస్ పార్టీ నాయకులు దాడులకు దిగుతారా అని రైతుబంధు రాష్ట్ర సమితి మాజీ కౌన్సిల్ సభ్యులు దేవీ రవీందర్ ప్రశ్నించారు. బుధవారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో భారీ వర్షాలతో నష్టపోయిన ప్రజలు కష్టాలలో ఉన్న విషయాన్ని తెలుసుకుని ఖమ్మం జిల్లాలో పర్యటించి ప్రజలకు నిత్యావసర సరుకులు అందిస్తూ సహాయక చర్యల్లో పాల్గొన్న మాజీ మంత్రులు హరీష్ రావు, సబిత ఇంద్రారెడ్డి పువ్వాడ అజయ్ కార్లపై కాంగ్రెస్ నాయకులు దాడి చేయడం ఎంతవరకు సమంజ సమన్నారు. కష్టాలలో ఉన్న ప్రజలను పరామర్శించి మనోధైర్యం చెప్పి సహాయం చేయడం తప్పుగా కనిపిస్తుందా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకులు సహాయక చర్యల్లో పాల్గొన్నారు. సహాయం చేయడానికి వెళ్ళిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేల బృందంపై దాడులు చేసి గాయపరుస్తారా. ఇదేం సంస్కృతి అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల పర్యటనతో మీకేమి ఇబ్బంది ప్రజల బాధలు మీకు పట్టవా కాంగ్రెస్ నాయకుల దాడులు సిగ్గుచేటన్నారు. ప్రభుత్వం సరియైన సమయంలో స్పందించి ఉంటే ఇంత ప్రాణ, ఆస్తి నష్టం జరిగేది కాదన్నారు. ప్రజలను ఆదుకోవాల్సింది పోయి ఆదుకున్న వాళ్లపై దాడులు చేస్తూ రాజకీయాలు చేయడం కాంగ్రెస్ కు ప్రజలు బుద్ధి చెప్తారన్నారు. ఖమ్మం జిల్లా మంత్రులకు ఖమ్మం పౌరుషం ప్రజల ఓట్ల వేయించుకోవడం వరకేనా ప్రజలను ఆదుకోవడంలో శ్రద్ధ ఉండదా వరదల వల్ల రాష్ట్రంలో నష్టపోయిన ప్రతి కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు శ్రీనివాస్, పంబాల అర్చన, శివ మాజీ సర్పంచ్ దశరథం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి

- త్రీ సభ్య కమిటీ సూచన



నవతెలంగాణ-గజ్వేల్

సీజనల్ వ్యాధుల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని త్రీ సభ్య కమిటీ సూచించింది. సిద్దిపేట జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని పలు ప్రభుత్వ హాస్టల్స్, పాఠశాలలను బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హాస్టల్ పరిసరాలకు పరిశుభ్రత వాషింగ్ ఏరియా శుభ్రంగా ఉంచాలని పలు సూచనలు చేశారు. విద్యార్థులకు సీజన్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించి వ్యక్తిగత పరిశుభ్రత సేవ్ ఫ్యాన్స్ వాష్ గురించి పిల్లలకు తెలియజేశారు. వైద్య బృందం మెడికల్ క్యాంపు నిర్వహించడం జరిగిందన్నారు. హాస్టళ్లను ఆకస్మిక తనిఖీ చేశామని వారు పేర్కొన్నారు. టాయిలెట్ స్క్రీనింగ్ వంటగదులు శుభ్రతపైన, విద్యార్థులకు బాడ్ టచ్ గుడ్ టచ్, భేటీ భేటీ బచావో, షేక్ హ్యాండ్ వాష్ పైన సూచనలు, సలహాలు ఇచ్చామని తెలిపారు. అంతేకాకుండా కేజీ వి బి పాఠశాలను కళాశాలను ఆకస్మిక తనిఖీ చేసినట్లు వారు పేర్కొన్నారు. బియ్యం మెనూ తదితర వాటిని ఆహార పదార్థాలను పరిశీలించినట్లు వారు చెప్పారు. తహశీల్దార్ శ్రవణ్ కుమార్, మున్సిపల్ కమిషన్ గోల్కొండ నరసయ్య, శ్రీగిరిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ బల్వీర్ సింగ్‌తో కూడిన కమిటీని ఏర్పాటు చేసి పరిశీలన చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఆనంద్, జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్, స్పెషల్ అధికారి అనురాధ, మున్సిపాలిటీ సానిటరీ ఇన్స్పెక్టర్ రవీందర్, ఎంపీహెచ్ఈఓ సురేందర్, ఏపీ డామిక్ సెల్ సభ్యులు వాసుదేవ్, నిరూప, ఆశా వర్కర్లు మంజుల, రేణుక తదితరులు పాల్గొన్నారు.

సేవకు మారుపేరు జాన్ వెస్లీ

- గుండెపోటు రావడం చాలా బాధాకరం
- మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు



నవతెలంగాణ-సిద్దిపేటరూరల్

సమాజ సేవ కు మారుపేరుగా నిలిచిన వ్యక్తి జాన్ వెస్లీ అని మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు, మాజీ సాంస్కృతిక సారధి చైర్మన్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు . ఇటీవల జాన్ వెస్లీ గుండెపోటుతో మరణించిన విషయం తెలుసుకున్న హరీష్ రావు స్వగ్రామమైన రావురుకుల గ్రామంలో వారి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తన ఉద్యోగ ధర్మం తో పాటు సామాజిక సేవలో భాగస్వామ్యం అయ్యే వాడని, పేద లకు సేవ చేయడం లో ముందున్నారని సేవకు మారు పేరుగా నిలిచారాని తన సేవలను కొనియాడారు. తెలంగాణ ఉద్యమం లో చురుగ్గా పాల్గొన్న ఉద్యమ కారుడు జాన్ వేస్లీ అన్నారు. బీఆర్ఎస్ పార్టీకి తనకి వ్యక్తి గతంగా ఎంతో ఆత్మీయత ఉందని గుర్తు చేశారు . ఆయన మృతి బాధాకరమన్నారు. కుటుంబానికి అన్ని విధాలా అండగ ఉంటానని భరోసానిచ్చారు. వీరి వెంట మాజీ సుడా చైర్మన్ మారెడ్డి రవీందర్ రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభాకర్ వర్మ, సర్పంచ్ కవిత రవీందర్ గ్రామ శాఖ అధ్యక్షులు నాగరాజు తదితరులు ఉన్నారు.

దేశ భవిష్యత్తు విద్యార్థులపై ఆధారపడి ఉంది

- మద్దూరు ఎస్సై షేక్ మహబూబ్



నవతెలంగాణ-మద్దూరు

దేశ భవిష్యత్తు విద్యార్థులపై ఆధారపడి ఉందని మద్దూరు ఎస్సై షేక్ మహబూబ్ అన్నారు. మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాలపై బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్ శర్మ, అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్సై మాట్లాడుతూ విద్యార్థులు సైబర్ నేరాలపై తమ తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని ఆయన కోరారు. తమ సెల్ ఫోన్‌లకు అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసినా. బ్యాంకు అకౌంట్ నెంబర్ . ఏటీఎం పిన్ నెంబర్, ఓటీపీ నెంబర్లు కూడా చెప్పవద్దని ఆయన తెలిపారు. యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని. ఎవరైనా మాదకద్రవ్యాలు విక్రయించినట్లయితే. పోలీస్ కంట్రోల్ రూమ్ 100 డయల్ కు ఫోన్ చేయాలని ఆయన కోరారు . దేశ భవిష్యత్తు విద్యార్థుల పైనే ఆధారపడి ఉంది కాబట్టి విద్యార్థులు మంచిగా చదివి. పాఠశాలకు తల్లిదండ్రులకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఉన్నత చదువులు చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సర్వర్, మోహినుద్దీన్ కాజా, ఆగి రెడ్డి, సిద్ధారెడ్డి, శ్రీనివాస్ ,ముజాయేద్, కార్తీక్, రామకృష్ణ, జావేద సుల్తానా, అంజయ్య సివిలా రెడ్డి, కర్ణాకర్, రజిత, జగన్, కానిస్టేబుల్ సిద్ధార్థ, క్రాంతి కుమార్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

భరోసా లేని కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్

- తులం బంగారం అడ్రస్ ఎక్కడ?
- గజ్వేల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్



నవ తెలంగాణ-గజ్వేల్

పేద ప్రజల ఇళ్లల్లో పెళ్ళికి కొండంత భరోసాగా నిలిచిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను మంజూరి చేసి వెంటనే లబ్ధిదారులకు అందచేయాలని గజ్వేల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గత సంవత్సర కాలంలో పెళ్లిళ్లు చేసుకొని దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు నేటికి చెక్కులు అందకపోవడం విచారకరమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదని ఆయన విమర్శించారు. పెళ్ళిళ్ళు చేసుకున్న ఆడబిడ్డలకు లక్ష రూపాయలతో పాటు తులం బంగారం అందిస్తామని ఎన్నికల ముందు సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన మాటను మర్చిపోయినట్లు ఉందన్నారు. వెంటనే తులం బంగారం పథకాన్ని అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లక్ష రూపాయలు నగదు ఇవ్వాలని ఆయన కోరారు. పేద ప్రజలు తమ బిడ్డల పెళ్లిళ్లు చేయడానికి పడే కష్టాలను కళ్ళారా చూసే తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కెసిఆర్ కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు తీసుకువచ్చి రాష్ట్రంలో లక్షలాది పేద కుటుంబాలకు ఆర్థిక సహాయాన్ని అందించారని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఏర్పాటు జరిగి తొమ్మిది నెలలు కావస్తున్నా ఒక్క దఫా కూడా కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేయలేదన్నారు. గత సంవత్సర కాలం క్రితం పెళ్లి జరిపిన పేద కుటుంబాలకు లక్ష రూపాయల ప్రభుత్వ సహాయం ఎంతో పెద్దదని వెంటనే చెక్కుల పంపిణీ చేపట్టాలని డిమాండ్ చేశారు. గజ్వేల్ నియోజకవర్గంలో నాలుగు, ఐదు వందల మంది లబ్ధిదారులు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులకోసం వేయి కళ్ళతో ఎదురుచూస్తున్నారన్నారు. వెంటనే శాఖల వారీగా ఎస్సీ , బీసీ, మైనారిటీ శాఖల ద్వారా నిధులు సమీకరించుకొని చెక్కులను అందించాలని కోరారు.

వరద బాధితులకు అండగా సిద్దిపేట వైద్యులు

- ఎమ్మెల్యే హరీష్ రావుకి లక్ష రూపాయల చెక్కు అందించిన ఐఎంఏ



నవ తెలంగాణ-సిద్దిపేట

భారీ వర్షాలకు ఖమ్మం, మహబూబాబాద్‌లో వచ్చిన వరదల కారణంగా నష్టపోయిన బాధితులకు సిద్దిపేట ఐఎంఏ వైద్యులు లక్ష రూపాయల సహకారం అందించారు. లక్ష రూపాయల చెక్కును మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావుకి అందించారు. ఈ సందర్భంగా వారిని హరీష్ రావు అభినందించారు. వైద్యులు సహకారం అందించడం సంతోషకరమని, కష్ట సమయాల్లో ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు భాస్కర్ రావు, సతీష్, శ్రీనివాస్, రవికాంత్, సదానందం తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ దాడుల కమిటీ ఏర్పాటు చేసిందా..?

- సీఎం రేవంత్ రెడ్డి అభివృద్ధిపై దృష్టి పెట్టాలి
- మాజీ మంత్రులపై దాడి సిగ్గుచేటు
- ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి



నవతెలంగాణ-గజ్వేల్

కాంగ్రెస్ రాష్ట్ర రాజకీయం దాడుల కమిటీలను ఏర్పాటు చేసుకున్నట్లు ఉందని మెదక్ ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి విమర్శించారు. బుధవారం ఆయన ఇంటిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పక్షం రోజుల క్రితం సిద్దిపేటలో హరీశ్ రావు క్యాంప్ కార్యాలయంపై దాడి చేసిన కాంగ్రెస్ నాయకులు, గుండాలు ఇప్పుడు ఖమ్మం జిల్లాలో వరద బాధితులకు సాయం చేయడానికి వెళ్లిన బీఆర్ఎస్ పార్టీ మాజీ మంత్రులపై దాడి చేయడం సిగ్గుచేటు అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు రాష్ట్ర అభివృద్ధిపై దృష్టి పెట్టాలన్నారు. వరద మూలంగా నష్టపోయిన ప్రజలను ఆదుకునేందుకు బీఆర్ఎస్‌కి చెందిన మాజీ మంత్రులు వెళ్లిన తర్వాత ప్రభుత్వంకు మేలుక వచ్చిందని పేర్కొన్నారు. వరద బాధితులను బీఆర్ఎస్ నాయకత్వం ఆదుకునేందుకు ముందుకు వెళ్లిందని తెలిపారు. ఇది జీర్ణించుకొని సీఎం, మంత్రులు కలసి కాంగ్రెస్ దాడుల కమిటీతో దాడులు చేయిస్తున్నారని విమర్శించారు. ప్రజలకు సాయం చేయాలి సేవ చేయాలి తప్ప దాడులతో వచ్చేది ఏమీ లేదని ప్రజలు రేవంత్ రెడ్డికి తగిన బుద్ధి చెప్తారని అన్నారు. వరద బాధితులకు కాంగ్రెస్ కూడా ప్రతి కుటుంబానికి రూ.25 లక్షలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఎకరాకు పది లక్షలు ఇవ్వాలని ఆయన కోరారు. కాంగ్రెస్ ఆది నాయకత్వం దాడులను ప్రోత్సహిస్తుందని విమర్శించారు. రాష్ట్రంలో ఆ సంస్కృతి లేదని రేవంత్ రెడ్డి వచ్చిన తర్వాత సంస్కృతి వచ్చిందన్నారు.

బాధ్యతలు స్వీకరించిన మార్కెట్ కమిటీ పాలకమండలి



నవతెలంగాణ-గజ్వేల్

వర్షాభావ నేపథ్యంలో సాదాసీదాగా బాధ్యతలు స్వీకరించినట్లు చైర్మన్ నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక వ్యవసాయ మార్కెట్లో చైర్మెన్ నరేందర్ రెడ్డి, వైస్ చైర్మెన్ సర్దార్ ఖాన్ మాట్లాడుతూ అధిష్టానం ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకోగా, త్వరలోనే పెద్ద ఎత్తున ప్రమాణ స్వీకార కార్యక్రమం ఉంటుందని చెప్పారు. రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తూ గజ్వేల్ మార్కెట్ యార్డును రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. రైతులకు నిరంతరం అందుబాటులో ఉంటూ పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడం లక్ష్యంగా కృషి చేయనున్నట్లు హామీ ఇచ్చారు. కాగా తమ నియామకానికి సహకరించిన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దామోదర్ రాజనర్సింహా, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డిలకు రుణపడి ఉండడంతో పాటు వారి ఆశయాల కనుగుణంగా పనిచేస్తామని వివరించారు. కాగా వైస్ చైర్మెన్ సర్దార్ ఖాన్ డైరెక్టర్గా ఉప్పల శ్రీనివాస్ గుప్త, సముద్రాల హరినాథ్ గుప్త, మహంకాళి శ్రీనివాస్ గుప్త, శ్రీనివాస్ గౌడ్, నరసింహారెడ్డి, డాక్టర్ వహీద్, యాదయ్య, నల్ల భానుప్రియ, రామా గౌడ్, నర్సింలు గౌడ్, వెంకటస్వామి లు డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. కాగా మార్కెట్ కమిటీ సెక్రటరీ జాన్ వెస్లీ పాలకమండలిచే బాధ్యతలు స్వీకరింపజేశారు.

గజ్వేల్‌లో అభివృద్ధి నా బాధ్యత



- మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు

నవతెలంగాణ- గజ్వేల్

గజ్వేల్ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేయాలని అందులో తాను భాగస్వామ్యం అవుతానని మల్కాజ్గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు అన్నారు. బుధవారం గజ్వేల్లో మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గాన్ని ఆయన సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం అభివృద్ధి నిర్ణయాలు తీసుకొని పేరు ప్రతిష్టలు తెచ్చుకోవాలన్నారు. గజ్వేల్ అభివృద్ధిలో అందరూ భాగస్వామ్యం కావాలని రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. సిద్దిపేట జిల్లా పై కాంగ్రెస్ జెండా ఎగరవాలని ఆయన కోరారు. గజ్వేల్ నియోజకవర్గం లోని అన్ని స్థానాలను కాంగ్రెస్ గెలుచుకోవాలని మున్సిపాల్ స్థానాన్ని కాంగ్రెస్ కైవాసం చేసుకోవాలని ఆయన సూచించారు. గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి నాయకత్వంలో గజ్వేల్ నియోజకవర్గం అభివృద్ధి జరిగి రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అన్ని స్థానాల్లో గెలుపొందాలన్నారు. మార్కెట్ కమిటీ పాలకవర్గం ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మెన్ నరేందర్ రెడ్డి, వైస్ చైర్మెన్ సర్దార్ ఖాన్, నాయకులు మోహన్, మల్లేశం, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

పదేండ్లల్లో అభివృద్ధి చేయని అసమర్థుడు మాజీ ఎమ్మెల్యే

- కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బంక చందు

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్



గత ప్రభుత్వంలో పదేళ్ల అధికారంలో ఉండి అభివృద్ధి చేయాని అసమర్థుడు మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్ అని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బంక చందు విమర్శించారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో అయన మాట్లాడుతూ గత పదేళ్లుగా హుస్నాబాద్ మెయిన్ రోడ్‌లో నీళ్ళు ఆగకుండా చేయలేదన్నారు. పట్టణంలో నీటి సమస్య పరిష్కరించుకుంటే మంత్రి కార్యాలయం ఎదుట ధర్నా చేస్తానన్న సతీష్ కుమార్ హుస్నాబాద్ టౌన్‌లో నీళ్ల గురించి ఏనాడు ఆలోచన చేయలేని సతీష్ కుమార్ మంత్రి పొన్నం ప్రభాకర్ ను విమర్శించే హక్కు లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అంటే మాట తప్పని పార్టీ మడమ తిప్పని పార్టీ అని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ బుఖ్య సరోజన, హుస్నాబాద్ సింగిల్ విండో డైరెక్టర్ కావ్య వెంకటస్వామి, పోతుగంటి బాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

స్థంభించిన రాకపోకలు



నవతెలంగాణ-నంగునూరు

సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం రాజగోపాలపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని నంగునూరు నుంచి ధూల్మిట్ట మండలం జాలపల్లి వెళ్లే రోడ్డులో మంగళవారం ఉదయం రాకపోకలు స్థంబించిపోయాయి. నంగునూరులోని మైసమ్మ చెరువు అలుగు పారుతోంది. కనుక వాగు కల్వర్టుపై నుంచి ఉధృతంగా ప్రవహిస్తున్న నీటి ప్రవాహాన్ని పరిశీలించి సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను, రాజగోపాలపేట ఎస్ఐ ఆసిఫ్, పోలీస్ సిబ్బంది రోడ్డుకు ఇరువైపులా బ్లాక్ చేయడం జరిగింది . ఇరు గ్రామాల ప్రజలు రోడ్డు దాటే ప్రయత్నం చేయవద్దని కల్వర్టు కాలువ వద్ద బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను తెలిపారు.

ప్రతిపక్షలు విమర్శలు మానుకోవాలి



నవతెలంగాణ-గజ్వేల్ రూరల్

రైతు రుణమాఫీ 6 గ్యారెంటీలపై ప్రతిపక్షాలు విమర్శలు మానుకొని సూచనలు, సలహాలు ఇవ్వాలని గజ్వేల్ మండల బీసీ సంగం అధ్యక్షులు వల్లపు నర్సింలు అన్నారు. బుధవారం ప్రతిపక్షల పనితీరు పై మాట్లాడారు. గతంలో రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రుణమాఫీ జరిగిందంటే మళ్ళీ అదే కాంగ్రెస్ హయాంలో జరిగిందని గుర్తుకు చేశారు. గత ప్రభుత్వం రూ.లక్ష రుణమాఫీ చేసేందుకు హామీ ఇచ్చినప్పటికీ ఎవరికి రుణమాఫీ జరగలేదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రైతు రుణమాఫీ విజయవంతంగా జరిగిందన్నారు. రైతు రుణమాఫీ రని రైతుల కోసం మళ్ళీ అధికారులు సర్వే చేస్తున్నారన్నారు. ఒకసారి ప్రతిపక్షాలు తెలుసుకోవాలని ఆయన అన్నారు. 6 గ్యారంటీలో అమలు చేస్తారని ఇందులో మూడు వరకు అమలు జరిగినట్లు ఆయన తెలిపారు . మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ. 500 లకు గ్యాస్ పంపిణీ చేసినట్లు, 200 యూనిట్లు ఉచిత విద్యుత్ ప్రజలకు అందిస్తున్నారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో దాచారం తుమ్మ కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో వినాయక ఉత్సవాలను నిర్వహించుకోవాలి

- ఎస్ఐ పరశురాం

నవతెలంగాణ-మిరుదొడ్డి



ప్రశాంత వాతావరణంలో వినాయక నవరాత్రి ఉత్సవాలను నిర్వహి ంచుకోవాలని ఎస్సై పరశురాం సూచించారు. మిరుదొడ్డి మండల కేంద్రంలో వినాయక మండప నిర్వాహకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ, ఆనందోత్సవాల మధ్య వినాయక నవరాత్రి ఉత్సవాలను నిర్వహించుకోవాలని నిర్వాహకులకు సూచించారు. వినాయక విగ్రహాల ఏర్పాటు చేసే నిర్వాహకులు ముందస్తుగా ఆన్లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలనన్నారు. మండపం వద్ద కనీసం ఇద్దరు నిర్వాహకులు నవరాత్రులకు ఉండేలా చూసుకోవాలన్నారు. నిమజ్జన సమయంలో చెరువుల వద్దకు వెళ్లేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సోషల్ మీడియాలో అసభ్యకరంగా, రెచ్చగొట్టే విధంగా ప్రచారాలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనుమతులు లేకుండా నిమజ్జన సమయంలో డీజేలు ఏర్పాటు చేస్తే సహించేది లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

మృతుని కుటుంబాన్ని పరామర్శించిన బీఆర్ఎస్ నాయకులు

- భాస్కర్ గౌడ్‌కు పరామర్శ

నవతెలంగాణ-తొగుట



తొగుట బీఆర్ఎస్ నాయకులు రడం భాస్కర్ గౌడ్ తండ్రి చంద్రాగౌడ్ ఇటీవల అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు భాస్కర్ గౌడ్‌ను బుధవారం పరామర్శించారు. ఆయన మరణం పట్ల ప్రగాఢ సంతా పం ప్రకటించారు. పరామర్శించిన వారిలో మండల పార్టీ అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ బాసిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ దోమల కొమురయ్య, మాజీ ఎంపీ టీసీ సుతారి రమేష్, పీఏసీఎస్ వైస్ చైర్మెన్ కుర్మ యాదగిరి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వర్షానికి కూలిన ఇల్లు



నవతెలంగాణ-చేర్యాల

చేర్యాల పట్టణంలోని అంబేద్కర్ కాలనీకి చెందిన భూమిగారి జనార్దన్ ఇల్లు మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి కూలింది. వర్షం కారణంగా బంధువుల ఇంట్లో నిద్రిస్తుండగా ఈ ఘటన జరిగింది. విషయం తెలుసుకున్న మాజీ జెడ్పీటీసీకొమ్ము నర్సింగరావు, కౌన్సిలర్ ముస్త్యాల తార యాదగిరి బుధవారం రెవిన్యూ అధికారులకు సమాచారాన్ని చేరవేశారు.

బాధిత కుటుంబానికి ఎంపీ ఆర్థిక సహాయం



నవతెలంగాణ-బెజ్జంకి

మండల పరిధిలోని తోటపల్లి గ్రామానికి చెందిన సందిరి లక్ష్మన్ ఇటీవల వరదలో చిక్కుకుని మృతి చెందిన విషయం విధితమే. బుధవారం కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ మృతుని కుటుంబానికి రూ.25 వేల ఆర్థిక సహాయం అందజేయగా మండల బీజేపీ నాయకులు బాధిత కుటుంబ సభ్యులకు నగదును అందజేశారు.బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి కరివేద మహిపాల్ రెడ్డి, బీజేపీ మండలాధ్యక్షుడు కొలిపాక రాజు, మండల ప్రధాన కార్యదర్శి బోయినిపల్లి అనిల్ రావు, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు బోయినిపల్లి వరుణ్ రావు, మండల నాయకులు జంగిడి కమలాకర్ రెడ్డి, వేల్పుల మల్లేశం, రావుల రాజిరెడ్డి, కుంబోజు సాయి పాల్గొన్నారు.

వరద బాధితులకు దుప్పట్లు, టిఫిన్లు అందజేత

- సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను



నవతెలంగాణ -నంగునూరు

నంగునూరు మండలం అక్కెనపల్లి మదిరె గ్రామం ఆరెపల్లి లో అధిక వర్షాల వలన ముంపుకు గురైగ్రామానికి చెందిన 23 కుటుంబాలకు చెందిన 53 మంది వరద బాధితులకు అక్కెనపల్లి రైతు వేదికలో తాత్కాలిక శిబిరంలో ఏర్పాటు చేయడం జరిగింది.వారి స్థితిగతులు, ఆర్థిక పరిస్థితిని బేరీజు వేసుకొని పోలీస్ కమిషనర్ ఆదేశానుసారం గా సిద్దిపేట ఏసీపీ మధు, సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను, రాజగోపాల్ పేట ఎస్ఐ ఆసిఫ్ లు 53 మందికి దుప్పట్లు టిఫిన్స్ అందజేసి వారి బాగోగులు అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి సహాయం కావాలన్నా డిపార్ట్ మెంట్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

కొత్త నీటికీ ఎదురెక్కుతున్న చేపలు

- రాజగోపాల్ పేట చెరువులో ఎనిమిది కిలోల చేప

నవతెలంగాణ-నంగునూరు





నంగునూరు మండలం రాజగోపాల్ పేట పెద్ద చెరువు వర్షం నీరు నిండి అలుగు పారడంతో కొత్త నేటికీ చేపలు ఎదురెక్కుతున్నాయి. దీంతో గ్రామస్తులు పెద్ద ఎత్తున చేపలు పట్టేందుకు ఉత్సాహాన్ని వ్యక్తంచేశారు. పెద్ద పెద్ద చేపలు చెరువులోకి ఎదురెక్కడంతో పట్టేందుకు ఉత్సాహం చూపిస్తున్న తరుణంలో సుమారు 7 నుంచి 8 కిలోల బరువు గల చేప గ్రామానికి చెందిన మహేష్‌కు దొరికింది. 8 కిలోల బరువు ఉన్న చేప మహేష్‌కు దొరకడంతో గ్రామస్తులు వింతగా చూశారు.

భక్తిశ్రద్ధలతో వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించుకోవాలి

- తొగుట సీఐ షేక్ లతీఫ్



నవతెలంగాణ- రాయపోల్

భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా వినాయక చవితి ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో ప్రశాంతంగా నిర్వహించుకోవాలని తొగుట సీఐ షేక్ లతీఫ్ అన్నారు. బుధవారం రాయపోల్ మండల కేంద్రంలో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణేష్ మండపాల నిర్వహకులు ఆన్లైన్ లింక్ ద్వారా విగ్రహాల ఏర్పాటుకు దరఖాస్తు చేసుకోని అనుమతి తీసుకోవాలన్నారు.ఆన్లైన్లో అనుమతి తీసుకుంటే భద్రత కల్పించడం సులువు అవుతుందన్నారు. పోలీస్ శాఖ అధ్వర్యంలో నిర్వహిస్తున్న పోలీస్ ప్రోటోకాల్ వెబ్సైట్ ద్వారా మండపాల నిర్వహకులు పూర్తి వివరాలను నమోదు చేసుకోని రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. గణేష్ మండపాలను ఎవరికి ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా ఏర్పాటు చేసుకోవాలి. బాక్స్ టైప్ స్పీకర్లను ఏర్పాటు చేసుకోవాలి. మండపాల్లో ఎట్టిపరిస్థితులోను డిజేలను ఏర్పాటు చేయరాదు. గణేష్ మండపాల వద్ద మద్యం సేవించడం, పేకాట ఆడటం,లక్కీ డ్రాలు నిర్వహిం చడం,అసభ్యకరమైన నృత్యాల ఏర్పాటు, అన్యమతస్తులను కించపరిచే విధంగా ప్రసంగాలు చేయడం ,పాటలు పాడటంపై పూర్తిగా నిషేధం.మండపాల్లో ఏదైనా అనుమానాస్పదంగా బ్యాగులు,ప్లాస్టిక్ సంచులు,వస్తువులు లేదా వ్యక్తులు కనిపించినట్లయితే తక్షణమే డయల్ 100 గాని లేదా సిద్దిపేట పోలీస్ కంట్రోల్ రూమ్ వాట్సాప్ నెంబర్ 8712667100, తొగుట సీఐ 8712667342, రాయపోల్ ఎస్సై 8712667346 స్థానిక పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాయపోల్ తహసీల్దార్ దివ్య, రాయపోల్ ఎస్సై విక్కుర్తి రఘుపతి, పంచాయతీ కార్యదర్శి శివకుమార్, విద్యుత్ శాఖ లైన్ మెన్ మోహన్ రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షులు రాజా గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు సుధాకర్, కాంగ్రెస్



మండల అధికార ప్రతినిధి కృష్ణ గౌడ్, రాజకీయ పార్టీల నాయకులు, యువజన సంఘాల ప్రతినిధులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-తొగుట

శాంతి భద్రతలకు విఘాతం కలిగించవద్దని తొగుట సీఐ లతీఫ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఎస్సై రవి కాంత్ రావు ఆధ్వర్యంలో నిర్వాహకులతో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వినాయక మండపాలకు తప్పనిసరిగా పోలీస్ శాఖ అనుమతులు తీసుకోవాలని సూచించారు. ఆన్ లైన్‌లో వినాయక మండపాలు ఏర్పాటు చేసే ప్రదేశంతో పాటు నిర్వాహకుల వివరాలను నమోదు చేసుకోవాలని తెలిపారు. వినాయక నిమజ్జన సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.మండపాల వద్ద డిజేలకు ఎలాంటి అనుమతులు లేవని వాటితో ఇతరులకు ఇబ్బందులు కలిగించవద్దని హెచ్చరించారు.వినాయక మండపాల్లో కరెంట్ వైర్ల పట్ల అవగాహన కలిగి, విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. నవరాత్రుల సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు ఎదురైన వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ ఏఈ శ్రీనివాసరావు, ఆర్ఐ అశోక్ రాజ్, హెడ్ కానిస్టేబుల్ అనిల్, పోలీస్ సిబ్బంది, నిర్వాహకులు పాల్గొన్నారు.

వరద నీటికి తెగిపోయిన ప్రత్యామ్నాయ కల్వర్టులు

- ఇబ్బందులకు గురవుతున్న ప్రయాణికులు
- జిల్లాలకు నిలిచిన రవాణా వ్యవస్థ



నవతెలంగాణ-నంగునూరు

గత ఏడాది నుంచి జాతీయ రహదారి మరమ్మతులు చేపట్టినప్పటికీ సకాలంలో కల్వర్టులు నిర్మించకపోవడంతో ప్రత్యామ్నాయంగా ఏర్పాటు చేసిన కల్వర్టులు తెగిపోయాయి. దీంతో ఉమ్మడి జిల్లా సరిహద్దు నుంచి నంగునూరు మండలం గుండా వెళ్ళేందుకు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నంగునూరు మండల పరిధిలో ఉన్న మెదక్ -ఎల్కతుర్తి జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా సిద్దిపేట-హుస్నాబాద్ రహదారిపై ప్రత్యామ్నాయంగా ఏర్పాటు చేసిన కల్వర్టులు భారీ వర్షాలకు తెగిపోయి రహదారి వెంట వాహనాలు నిలిచిపోయాయి. గత ఏడాది జాతీయ రహదారి మరమ్మతుల్లో భాగంగా ముంద్రాయి, పాలమాకుల, బద్దిపడగ వద్ద పెద్ద ఎత్తున బ్రిడ్జిలను నిర్మించేందుకు ఏర్పాటు చేశారు. ఇందుకోసం ప్రత్యామ్నాయంగా ఏర్పాటు చేసిన రోడ్డు వర్షాలకు తెగిపోయింది. దీంతో నంగునూరు మండలంతో పాటు సిద్దిపేట నుంచి హన్మకొండ, హుస్నాబాద్ తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు గత నాలుగు రోజుల నుంచి వాహనాలు నడవక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో దూరప్రాంతాల నుంచి వెళ్లాల్సి వస్తుందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాంట్రాక్టర్లు సకాలంలో బ్రిడ్జిల నిర్మాణం చేసినట్లయితే ఈ ఇబ్బందులు ఉండేవి కాదని ప్రయాణికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి బ్రిడ్జిల మరమ్మతును ఏర్పాటు చేయాలని వాహనాలు వెళ్లే విధంగా చూడాలని ప్రయాణికులు కోరుతున్నారు. పాలమాకుల వద్ద నిర్మిస్తున్న బ్రిడ్జ్ సకాలంలో నిర్మించకపోవడంతో ఇరు గ్రామాలకు రాకపోకలు స్తంభించిపోయాయి. ఓబులాపూర్, గోనపల్లి, కస్తూరిపల్లి తదితర గ్రామాలకు వెళ్లాలంటే ఈ మార్గం ద్వారానే వెళ్లాలి. పాలమాకుల- ఓబులాపూర్ మధ్య నిర్మిస్తున్న మూడు బ్రిడ్జిలు సైతం సకాలంలో నిర్మించకపోవడం కాంట్రాక్టర్ నిర్లక్ష్యమని ప్రజలు ఆరోపిస్తున్నారు. బ్రిడ్జిల వద్ద ప్రత్యామ్నాయంగా ఏర్పాటు చేసిన రోడ్లు తెగిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీటిపై అధికారులు దృష్టి సారించి మరమ్మతులు చేపట్టేలా చూడాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యం స్వాధీనం





నవతెలంగాణ- రాయపోల్

ప్రభుత్వం పేద ప్రజలకు తినడానికి రేషన్ బియ్యం ఉచితంగా పంపిణీ చేస్తే కొంతమంది అక్రమార్కులు వ్యాపారంగా మారుస్తూ విక్రయిస్తున్నారని బేగంపేట ఏఎస్ఐ అమృత్ అన్నారు. బుధవారం రాయపోల్ మండలం ఎల్కల్ గ్రామంలో కిరాణా దుకాణంలో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యం సిద్దిపేట టాస్క్ ఫోర్స్ పోలీసులు, బేగంపేట పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాయపోల్ మండలం బేగంపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎల్కల్ గ్రామానికి చెందిన పబ్బ మల్లేశం కిరాణా దుకాణంలో నమ్మదగిన సమాచారం మేరకు అక్రమంగా నిల్వ ఉంచిన 70 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. వెంటనే అట్టి బియ్యమును బేగంపేట పోలీస్ స్టేషన్ కు తరలించడం జరిగిందన్నారు. ఈ 70 బస్తాల బియ్యమును పౌరసరఫరాల శాఖ అధికారులకు స్వాధీనం చేయడం జరుగుతుందని అనంతరం వారు పంచనామా పూర్తి చేసిన తర్వాత చట్ట ప్రకారం చర్యలు తీసుకోబడతాయన్నారు.పేద ప్రజల గురించి ప్రభుత్వం అందిస్తున్న రేషన్ బియ్యాన్ని కొంతమంది వారి స్వార్థం స్వలాభం గురించి ప్రజల దగ్గర తక్కువ రేటుకు కొనుగోలు చేసుకుని ఎక్కువ రేటుకు వ్యాపారస్తులకు డబ్బులు సంపాదిస్తున్నారని, అలాంటి వారిపై జిల్లాలో గట్టి నిఘా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం రేషన్ బియ్యం కొనుగోలు చేసిన, ఇతరులు అమ్మిన, అక్రమంగా రవాణా చేసిన, పేద ప్రజల పొట్టకొట్టి అక్రమ వ్యాపారం చేసే వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరి ంచారు. మండలంలో ఎవరైనా ఇలాంటి కార్యక్రమాలకు పాల్పడు తున్న సమాచారం ఉంటే డయల్ 100, పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందిం చిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బేగంపేట పోలీస్ సిబ్బంది, టాస్క్ ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

రాయపోల్ మండల ఎస్జీటీయూ నూతన కమిటీ ఎన్నిక



నవ తెలంగాణ- రాయపోల్

రాయపోల్ మండల పరిధిలో పనిచేస్తున్న సెకండరీ గ్రేడ్ టీచర్లు అందరు సమావేశం నిర్వహించుకొని మండల ఎస్జీటీయూ నూతన మాతృ సంఘం కార్యవర్గమును ఎన్నుకున్నారు. బుధవారం రాయపోల్ మండలం బేగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్జీటీయూ ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాయపోల్ మండల ఎస్ జి టి యు నూతన అధ్యక్షులు జి.భాస్కర్,ప్రధాన కార్యదర్శి ఎస్.నరసింహ,కోశాధికారి టి.నరేష్,మహిళ అధ్యక్షురాలు సిహెచ్. రమా దేవి, ఉపాధ్యక్షులు ఎస్.రాజు, జి. శిరీష,కార్యవర్గ సభ్యులు జి.నరేష్, పి.లక్ష్మి నారాయణ, ఈ.ఆండాలు లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం అధ్యక్షులు భాస్కర్, ప్రధాన కార్యదర్శి నరసింహ మాట్లాడుతూ ఎస్జీటీ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం అందరూ కేవలం ఎస్జీటీయు సంఘంలో మాత్రమే ఉండాలని నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని పాఠశాలలో మౌలిక వసతులు ఉపాధ్యాయ ఖాళీలను నింపాలన్నారు. సిపిఎస్ నూతన పెన్షన్ విధానాన్ని రద్దుచేసి ఓపిఎస్ పాత పెన్షన్ విధానాన్ని అనుద్ధరించాలన్నారు. అలాగే ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.రాయపో లు మండల ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు ఆహ్వానం

నవతెలంగాణ-సిద్దిపేట అర్బన్

సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల సిద్దిపేట మిట్టపల్లిలో డిగ్రీ ప్రథమ సంవత్సరానికి స్పాట్ కౌన్సిలింగ్ కోసం ఈనెల 5, 6వ తేదీల్లో ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ క్రింది కోర్సులకు దరఖాస్తు పెట్టుకోవాలన్నారు.బీఏ హెచ్ఈపీ, బీకామ్ సీఏ, బీఎస్సీ ఎంబీజడ్సీ, బీఎస్సీ బీజడ్సీ, బీఎస్సీ ఎంఎస్సీఎస్ కళాశాలలోని మొత్తం సీట్లలో ప్రతి కోర్సులోనూ 40 సీట్లలో 30 సీట్లు ఎస్సీ వర్గానికి కాగా మిగిలిన 10 సీట్లు ఇతర వర్గాల వారికి కేటా యించబడును అని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.సునీత తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు ఈ అడ్మిషన్ ప్రక్రియ అనేది పూర్తిగా మెరిట్ ప్రకారం కేటాయించబడును.

మాజీ మంత్రుల వాహనాలపై దాడి అమానుషం







నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

ఖమ్మంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన మాజీ మంత్రుల వాహనంపై కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు దాడి చేయడం అమానుషమని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వరద ప్రభావిత ప్రాంతాల్లో పరామర్శించేందుకు వెళ్లిన మాజీ మంత్రులపై దాడి చేయడం సిగ్గుచేటని, దుర్మార్గపు చర్య అని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతోందని మండిపడ్డారు. భారీ వర్షాలకు వరదలు వచ్చి కష్టాల్లో ఉన్న ఖమ్మం ప్రజానీకానికి భరోసా ఇవ్వడం మానేసి భయభ్రాంతులకు గురిచేయడం అమానుషమని అభివర్ణించారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష నాయకులకు ఎక్కడికైనా వెళ్లే హక్కు ఉందని, కష్టాల్లో ఉన్న ప్రజల వద్దకు వెళ్తే.. దాడులు చేయడం నీచ సంస్కృతి అని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి దాడులు మంచి పద్ధతి కాదని, ప్రజలు కాంగ్రెస్ పార్టీ చర్యలను గమనిస్తున్నారని అన్నారు. ఇలాంటి దాడులు చేసినంత మాత్రాన బీఆర్ఎస్ పార్టీ భయపడదని, కచ్చితంగా ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతామని హెచ్చరించారు.

నవతెలంగాణ-మర్కుక్

ఖమ్మం జిల్లాలో వరదల్లో చిక్కుకున్న ప్రజలను పరామర్శించేందుకు వెళ్లిన మాజీ మంత్రి హరీశ్ రావు, సబితా ఇంద్రారెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, పువ్వాడ అజయ్ ,బీఆర్ఎస్ నాయకుల పై కాంగ్రెస్ గుండాలు దాడికి పాల్పడడం హేయమైన చర్యా అని బీఆర్ఎస్ బీసీ సెల్ మర్కుక్ మండలాధ్యక్షులు మ్యాకల కనకయ్య ముదిరాజ్, మర్కుక్ మాజీ సర్పంచ్ అచ్చంగారి భాస్కర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు తీగుళ్ళ బాలకిషన్‌లు అన్నారు. బుధవారం మర్కుక్ లో విలేకర్లతో మాట్లాడుతూ ఖమ్మంలో భారీగా ఆస్తి, ప్రాణ నష్టం జరిగిందని, ప్రభుత్వం యంత్రాంగం సకాలంలో స్పందించలేదని, బీఆర్ఎస్ పార్టీ తరపున వరద బాధితులకు సహాయం అందించేందుకే వెళ్ళిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేల పై దాడి చేపించటం దారుణమని వారు మండిపడ్డారు. ప్రజలకు సాయం చేతగాక సాయం చేస్తున్న వారిని చూసి ఓర్వలేక దాడికి తెగబడ్డారని మండిపడ్డారు. కాంగ్రెస్ నాయకులు దమ్ముంటే ప్రజలకు సాయం చేయాలని దాడులు చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. కాంగ్రెస్ గుండాలను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. వరదలో చిక్కుకున్న వారికి నీళ్ల ఆహారం ఇవ్వకపోవడంతో ఇచ్చిన వారిపై దాడి చేయించడం సీఎం రేవంత్ రెడ్డికి తగదన్నారు. కాంగ్రెస్ ప్రజలను నిర్లక్ష్యం చేస్తే బాధితులకు అండగా నిలబడడం తప్పా అంటూ ప్రశ్నించారు.

నవతెలంగాణ-జగదేవపూర్

జగదేవపూర్ మండల కేంద్రంలో గల స్థానిక ఎల్లమ్మ ఆయాలం వద్ద బీఆర్ఎస్ మండల పార్టీ ఆధ్వర్యంలో అధ్యక్షుడు పనుగట్ల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు సాయం చేయటం చేతగాక, సాయం చేస్తున్న వాళ్ళను చూసి ఓర్వలేక సేవ చేసే వాళ్లపై దాడి చేయడం సిగ్గు చేటుఅన్నారు. ప్రజలకు సమాధానం చెప్పలేక ప్రతిపక్ష నేతలపై దాడులు చేయడం ఎంతవరకు సమంజసం అన్నారు. బీఆర్ఎస్ మాజీ మంత్రి హరీశ్ రావుతో పాటు మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, పువ్వాడ అజయ్ కుమార్ వాహనాలపైన కాంగ్రెస్ కార్యకర్తలు రాళ్ల దాడిలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయని తీవ్రంగా మండిపడ్డారు. వరద బాధితులను ఆదుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని తెలిపారు. ఖమ్మంలో జరిగిన దాడికి ముఖ్యమంత్రి బాధ్యత వహించాలని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులకు దమ్ము ధైర్యం ఉంటే బాధితులను కాపాడి వారికి అండగా నిలవాలని ఇందిరమ్మ రాజ్యమంటే మాజీ మంత్రులపై చేయడమా అంటూ ప్రశ్నించారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారు అని త్వరలోనే మీకు బుద్ధి చెప్పుతారు అని అన్నారు. ముందు ప్రజలను కాపాడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, తదితరులు ఉన్నారు.

జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక















నవతెలంగాణ- రాయపోల్,

సెప్టెంబర్ 5 ఉపాధ్యాయుల దినోత్సవం పరస్కరించు కొని జిల్లా వ్యాప్తంగా ఉత్తమ సేవలందించిన ఉపాధ్యా యులను జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేయడం జరుగుతుందని ఎంఈఓ నరసమ్మ తెలిపారు. దానిలో భాగంగానే రాయపోల్, దౌల్తాబాద్ మండలాల నుంచి ఏడు మంది ఉపాధ్యాయులను జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక అయ్యారని పేర్కొన్నారు. రాయపోల్ మండలం బేగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆంగ్లం ఉపాధ్యాయులు డి. నర్సింలు గౌడ్, బేగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జీవశాస్త్రం ఉపాధ్యాయులు ఎం.వసంత, కొత్తపల్లి ప్రాథమికోన్నత పాఠశాల సిహెచ్. రమాదేవిలు ఎంపికయ్యారు. అలాగే దౌల్తాబాద్ మండలం నుంచి ప్రాథమిక పాఠశాల బందారం యం. స్వప్న, ప్రాథమిక పాఠశాల శేరిపల్లి టి.శ్రీనివాస్, ప్రాథమిక పాఠశాల అప్పాయిపల్లి బి. మల్లయ్య, ప్రాథమిక ఉన్నత పాఠశాల మాచిన్ పల్లి యం. రాజిరెడ్డిలు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక య్యా. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎన్నికైన వారికి సెప్టెంబర్ 5 ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సిద్దిపేట జిల్లా టీటీడీ భవనంలో అవార్డులు ప్రధానం చేసి సన్మానం చేయడం జరుగుతుందన్నారు. రాయపోల్, దౌల్తాబాద్ మండలాల నుంచి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ఉపాధ్యాయులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ఉపాధ్యాయులు మాట్లాడుతూ జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులు అవార్డు రావడం ఎంతో ఆనందకరంగా ఉందాన్నారు. మనం చేసే పనిని గుర్తించి అవార్డులు వస్తాయని ఈ అవార్డు మరింత బాధ్యతను పెంచిందని, విద్యార్థులకు అత్యుత్తమైన పాఠాలు బోధించేందుకు నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు. మాకు ఈ అవార్డులు రావడానికి కృషిచేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.

వర్షాలతో నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి

- ఎంపీ రఘునందన్ రావు



నవతెలంగాణ-దుబ్బాక

రాష్ట్రవ్యాప్తంగా గత కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో నష్టపోయిన రైతాంగాన్ని, బాధితులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని, వర్షాలతో ధ్వంసమైన రోడ్లను యుద్ధ ప్రాతిపదికన పునర్నిర్మించాలని, సర్వం కోల్పోయి నిరాశ్రయులైన వారికి వెంటనే ఇండ్లను నిర్మించి ఇవ్వాలని మెదక్ పార్లమెంట్ సభ్యుడు మాధవనేని రఘునందన్ రావు డిమాండ్ చేశారు. బుధవారం దుబ్బాక పట్టణ కేంద్రంలోని ఎంపీ రఘునందన్ మీడియతో మాట్లాడారు. మొన్నటి ఎమ్మెల్యే ఎన్నికల్లో డబ్బు, మద్యం పంపిణీని అడ్డుకునే ప్రయత్నం చేసిన తమపై అప్పటి పోలీసులు అన్యాయంగా కేసులు మోపారని ఆరోపించారు. కోర్టు విచారణకు తాను, బీజేపీ నాయకులు సహకరిస్తామని స్పష్టం చేశారు.హైడ్రా పేరిట ఏళ్ల తరబడి నివాసముంటున్న పేదల ఇళ్లను కూల్చివేయడం బాధాకరమన్నారు. కూల్చివేతలకు గురైన పేదలకు కోకాపేటలోని ఎకరానికి రూ.100 కోట్ల విలువ చేసే భూముల్ని అందించి పేదల పట్ల సర్కారు చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన వెంట బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంబటి బాలేష్ గౌడ్, కౌన్సిలర్ మట్ట మల్లారెడ్డి, దుబ్బాక మున్సిపల్, మండల అధ్యక్షులు సుభాష్ రెడ్డి, అంబటి శివప్రసాద్ గౌడ్, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

అంగన్వాడీ కేంద్రాలలో చిన్నారులకు పౌష్టికాహారం

- రాయపోల్ ఐసీడీఎస్ సూపర్వైజర్ అనురాధ



నవతెలంగాణ - రాయపోల్

అంగన్వాడీ కేంద్రాలలో చిన్నారులకు, బాలింత గర్భిణీ మహిళలకు పౌష్టికాహారం అందించడం జరుగుతుందని అంగన్వాడి కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ రాయపోల్ సూపర్వైజర్ అనురాధ అన్నారు. బుధవారం రాయపోల్ మండల కేంద్రంలో అంగన్వాడీ కేంద్రాలలో తక్కువ, అతి తక్కువ బరువు ఉన్న చిన్నారులను గుర్తించి వారికి బాలామృతం ఫ్లస్ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీ, బాలింత మహిళలకు అలాగే ఐదు సంవత్సరాల లోపు చిన్నారులకు పౌష్టికాహారం అందజేసి ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం కోసం కృషి చేయడం జరుగుతుందన్నారు. సెప్టెంబర్ ఒకటవ తేదీ నుంచి సెప్టెంబర్ 30వ తేదీ వరకు పోషణ మాసం నిర్వహించడం జరుగుతుందని, దానిలో భాగంగానే బుధవారం తక్కువ బరువు, అతి తక్కువ బరువు ఉన్న చిన్నారులను గుర్తించడం జరిగిందన్నారు. అలాంటి చిన్నారులు సాధారణ బరువు పెరగడం కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకొని బాలామృతం ఫ్లస్ అందజేయడం జరిగిందన్నారు. గర్భిణీ, బాలింత మహిళలు చిన్నారులకు సమతుల్య పోషకాహారం అంగన్వాడ కేంద్రాల ద్వారా అందించడం జరుగుతుంది. కాబట్టి అంగన్వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకొని ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం మాధవి, అంగన్వాడి టీచర్లు పద్మ రేఖ, ఆశా వర్కర్లు భాగ్యలక్ష్మి, రజిత, గర్భిణీ బాలింత మహిళలు తదితరులు పాల్గొన్నారు.

హరీశ్‌రావు బృందంపై దాడి హేయమైన చర్య



నవ తెలంగాణ-మెదక్ టౌన్ 86

ఖమ్మం జిల్లాలో వరద బాధితులను పరామర్శించడానికి వెళ్లిన మాజీ మంత్రి హరీష్ రావు బృందం పైన కాంగ్రెస్ పార్టీకి చెందిన వారు రాళ్లతో దాడి చేయడం హేయమైన చర్య అని మాజీ ఎమ్మెల్యే జిల్లా పార్టీ అధ్యక్షులు యం. పద్మ దేవేందర్ రెడ్డి అన్నారు. మెదక్ జిల్లా అధ్యక్షురాలు మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి మెదక్ బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత రెడ్డి, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డిలతో కలిసి విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ ముఖ్య మంత్రి కెసిఆర్ పిలుపు మేరకు వరద బాధితులకు ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన బి అర్ ఎస్ ఎమ్మెల్యే లు ఒక నెల వేతనాన్ని విరాళంగా అందిస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ వరదలను కూడా రాజకీయం చేస్తోందని అన్నారు. వరదలు వచ్చినప్పుడు బాధ్యత వహించి వారికి చేయూతను అందించాల్సిన ముఖ్యమంత్రి దాన్ని విస్మరించారన్నారు. వరద బాధితులను పరామర్శించి వారికి జీవితం ఇవ్వాలన్న ఆలోచనతో అక్కడికి వెళ్తే దాడులు చేయడం సరికాదు అన్నారు. ముఖ్యమంత్రి, మంత్రులు ఖమ్మం కు వెళ్లి తూతూ మంత్రంగా వరద బాధితులను పరామర్శించి వచ్చారు తప్ప వారిని ఆదుకోలేదన్నారు. బిఆర్ఎస్ పార్టీ బృందం మాజీ మంత్రి ఇల్లు ఇల్లు తిరుగుతూ వారి కష్టాలు తెలుసుకొని ఇబ్బందులు గమనించి అత్యవసరంగా నిత్యవసర వస్తువులు అందజేశారని చెప్పారు. తిరిగి వస్తున్న సందర్భంలో రాళ్లతో దాడి చేసి అత్యాయత్నం చేసే విధంగా కాంగ్రెస్ పార్టీ వాళ్ళను ఉసిగోల్పడన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం అన్నారు. గతంలో అధికారంలో ఉన్నప్పుడు వరద బాధితులను మేము ఏ విధంగా ఆదుకున్నామో అదేవిధంగా సహాయం చేయాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్షంలో ఉన్న వారు పరామర్శిస్తుంటే దాడి చేయడన్ని ప్రజలు చూసి చీదరించుకుంటున్నారు అని చెప్పారు. ప్రతిపక్షాలను కలుపుకొని పోయే బాధ్యత ప్రభుత్వం పైన ఉందన్నారు. వరద బాధితులకు ధైర్యం చెప్పి ఆసరా నిలవాల్సిన అవసరం ప్రభుత్వానికి ఉందన్నారు. వాతావరణ శాఖ హెచ్చరిక చేసినా పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేసి ఇంత విపత్తు కారణమయ్యారన్నారు. మీరు ఇటుకలతో దాడి చేస్తే రాళ్లతో దాడి చేసే చర్యకు ప్రతి చర్య ఉంటుంది అన్నారు. ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. ఈ సమావేశంలో మాజీ మున్సిపల్ చైర్మన్ బట్టి జగపతి, మాజీ జిల్లా పరిషత్ ఉపాధ్యక్షురాలు యం. లావణ్య రెడ్డి, పట్టణ పార్టీ కో కన్వీనర్లు లింగ రెడ్డి, జుబేర్ అహ్మద్, కండెల సాయిలు, కౌన్సిలర్ జయరాజు, హవెలిఘనపూర్ మండల పార్టీ అధ్యక్షులు సిహెచ్ శ్రీనివాస్ రెడ్డి, పాపన్నపేట మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకట్ రెడ్డి, ఏడుపాయల దేవస్థానం మాజీ చైర్మన్ బాల గౌడ్, నాయకులు లింగం, జగన్, నరేందర్ రెడ్డి, రంజా, ఇస్మాయిల్, మోహన్, నవీన్, అమీర్, వేణు తదితరులు పాల్గొన్నారు.

ఎలుకపల్లి కాన్ చెరువు గండి పూడ్చిన ఇరిగేషన్ అధికారులు

గండి పూడ్చిన ఇరిగేషన్ అధికారులు ఊపిరి పీల్చుకున్న పీల్చుకున్న రైతులు
నవతెలంగాణ-వెల్దుర్తి

చెడచెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు వరదనీటి ప్రభావంతో కుంటలు చెరువులు జలమయమై నిండుకుండలు తలపిస్తున్న క్రమంలో అక్కడక్కడ బుంగలు చెరువు కట్టలకు గండ్లు పడే అవకాశం ఉన్నందున అప్రమత్తమైన ఇరిగేషన్ అధికారులు మరమ్మతులు చేసే పనిలో నిమగ్నమయ్యారు. మండల పరిధి ఎలుక పల్లి గ్రామ శివారులో ఎలకపల్లి ఖాన్ చెరువు తూము వద్ద పెద్దగోయి ఏర్పడడంతో ఆయకట్టు దారులు ఆందోళనకు గురయ్యారు. ఈ విషయం తెలుసుకున్న ఇరిగేషన్ అధికారి డి ఈ రాజేందర్ రావు



అప్రమత్తమై గ్రామస్తులు సహకారంతో ట్రాక్టర్లతోటి మట్టి పోయించి గండిని పూడ్చి పటిష్టపరిచారు. దీంతో ఆయకట్టు దారులు ఊపిరి పీల్చుకున్నారు. మరి ఎక్కడైనా చెరువుకుంటలకు ప్రమాదం పొంచి ఉంటే మా దృష్టికి తీసుకురావాలని ఆయకట్టు దారులకు సుచించారు..

రామక్కపేటలో పోషణ మాసం పై అవగాహన

దుబ్బాక ఐసీడీఎస్ సీడీపీవో ఎల్లయ్య
నవతెలంగాణ దుబ్బాక రూరల్

పిల్లలు, గర్భిణులు, బాలింతల ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి ప్రభుత్వం పోషణ మాసం అనే కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని, గర్భిణులు, బాలింతలకు ఈ కార్యక్రమం పై అవగాహన కలిగి ఉండాలని దుబ్బాక ఐసీడీఎస్ సీడీపీవో ఎల్లయ్య అన్నారు. పోషణ మాసం ప్రోగ్రాం లో భాగంగా బుధవారం దుబ్బాక మండల పరిధిలోని రామక్క పేట గ్రామంలో విలేజ్ హెల్త్ శానిటేషన్ న్యూట్రిషన్ డే సందర్భంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అందించే బాలమృతంలో అనేక పోషకాహార పదార్థాలు ఉన్నాయని, పిల్లల బరువు ఎప్పటికప్పుడు నమోదు తో పాటు టీకాలు వేయించాలని అంగన్వాడి టీచర్ కి, ఏఎన్ఎం లకు సూచించారు. పోషణ



మాసం కార్యక్రమాలు సెప్టెంబరు 1 నుంచి 30 వరకు జరగనున్నాయని తెలిపారు. అనంతరం బాలామృతం గుడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ స్వరూప ,బ్లాక్ కో ఆర్డినేటర్ శాంసన్,సెక్రటరీ రమ్య, ఏఎన్ఎం, అంగన్వాడీ టీచర్లు సరస్వతి,రాములమ్మ, బాలామని, ఐకెపి సి ఎ, ఆశాలు, తల్లులు, గర్భవతులు ఉన్నారు .

ప్రజలందరు సంతోషంతో శాంతి వైపు నడుచుకోవాలి



ఇందూర్ ఆశ్రమ పీఠాధిపతి చెన్న మల్లికార్జున స్వామి
నవతెలంగాణ- రాయికోడ్

ప్రజలందరు సంతోషంగా ఉండాలనలి, ప్రతి ఒక్కరూ శాంతి వైపు నడుచుకోవాలని ఇందూర్ ఆశ్రమ పీఠాధిపతి చెన్న మల్లికార్జున స్వామి అన్నారు. మండల పరిధి లోని ఇందూర్ ఆశ్రమ పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ సద్గురు చిన్మయ జ్ఞాని చెన్న మల్లికార్జున స్వామి 48వ జన్మదినం వేడుకలను భక్తులు, ప్రజలు బుధవారం ఘనంగా నిర్వహించారు. గ్రామ పురవీధుల గుండా ఊరేగింపు గా అప్పగారికి పల్లకి ని తీసుకెళ్లారు. ఉదయం11.34 నిమిషాలకు అక్క మహాదేవి గుట్ట ఇందూర్ ఆశ్రమం లో అప్పగారికి ప్రత్యేక పూజలు నిర్వహించి పండ్లు, చెక్కర, నువ్వులతో తులాభారం చేపట్టారు. అనంతరం పాద పూజ, డోలారోహణము కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పగారు మాట్లాడుతూ ప్రజలు భక్తి మార్గాన్ని ఎన్నుకొని శాంతి, సమాధానం వైపు నడుచుకోవలన్నారు. ప్రజలకు, భక్తులకు ఆధ్యాత్మికత మంచి మార్గం అన్నారు. పాడి పంటలు బాగా పండి, సుఖ సంతోషాలతో ఉండాలని ఆశీర్వదించారు. భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు మల్లన్న అప్ప, పలువురు నాయకులు, వివిధ గ్రామాల భక్తులు, ప్రజలు, అభిమానులు హాజరయ్యారు.

ఉత్తమ ఉపాధ్యాయురాలుగా ఎంపిక



నవతెలంగాణ-న్యాల్ కల్

రేజింతల్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను విద్యా బోధనలు పెంచుటకు విద్యార్థి కోసం అనేక కార్యక్రమాలు చేపట్టడంతో వారి సేవలు గుర్తించి ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రేజింతల్ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం సఫియా సుల్తానాకు ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు ఉత్తమ అవార్డు వచ్చింది. తోటి మిత్రులు ఉపాధ్యాయులు విద్యార్థులు బంధుమిత్రులు అభినందించారు ..

చెరువు నీరు వృధా పోకుండా కాపాడిన గ్రామస్తులు

మట్టి పోయించిన కౌన్సిలర్ జిన్నా భగవాన్ రెడ్డి



నవతెలంగాణ-తూప్రాన్

తూప్రాన్ మున్సిపల్ పరిధిలో 7వ వార్డు అల్లాపూర్ గ్రామంలో గత 5 రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు తుమ్మాయి చెరువులోకి అధికంగా నీరు రావడంతో చెరువు మత్తడి నుంచి వృధాగా నీళ్లు పోతున్నాయని గ్రామస్తులు గమనించి స్థానిక కౌన్సిలర్ జిన్నా భగవాన్ రెడ్డికి సమాచారం అందించడంతో, తక్షణమే స్పందించి చర్యలు చేపట్టి, జెసిబి సహాయంతో చెరువు నుంచి వృధాగా పోతున్న నీటిని ఆపడానికి మట్టిని పోయించి సమస్యకు పరిష్కారం చూపారు..

ఉపాధ్యాయులు

ఉపాధ్యాయులంటే ఉద్బోధ చేయువారు
విద్యార్థుల ఉన్నతిని ఎప్పుడు కాంక్షించువారు
బాలల భవిష్యత్తుకు చక్కని దారి చూపువారు
పాఠ్యాంశాలతో పాటు జీవిత పాఠాలు నేర్పు వారు

తరగతి గదిలో పాఠాలు సరిగా వినకుంటే
తరువాత నేర్చుకోవలసిన గుణపాఠాలు తెలుపువారు
గొప్ప ఉపాధ్యాయుడి బోధనలే మంచి సమాజానికి నాంది
ప్రతి పౌరుడికి ఉండాలి ఈ మనాది

నవ సమాజానికి సత్య సమాజానికి
సత్యాన్వేషణ చేయువారు
పిల్లలు పక్కున ఏడ్చినప్పుడు అక్కున చేర్చుకునేవారు
వారి సాధక బాధలను సావధానముగా వినువారు
తల్లిదండ్రులతో సత్సంబంధాలు కలిగి ఉండువారు

బడులను గుడులుగా భావించు గొప్పవారు
ఇలాంటివారు ఇంకా ఉన్నారు ఉన్నారు
అలాంటి గొప్పవారు ఇలపై ఇంకా ఇంకా ఉంటారు
జన్మనిచ్చిన తల్లిదండ్రుల తరువాత స్థానం పొందినవారు

ఈ సృష్టిలో ప్రతివారి దృష్టిలో నిలిచినవారు
అన్ని వృత్తులకు స్వీకరించినవారు



ఎలికట్టె అయిలయ్య , ప్రధానోపాధ్యాయులు, జెడ్పీహెచ్ఎస్
గ్రామం నాగపురి, మండలం చేర్యాల, జిల్లా సిద్ధిపేట

ఉపాధ్యాయులు నీడ - తోడు

అంశం : ఉపాధ్యాయులు
శీర్షిక : నీడ – తోడు

తల్లిదండ్రులలోలె
తలపుల్లో మెదులుతూ
తాను ఎదుగుతూనే
తన వెన్నంటే నీడై
అనుక్షణం అనుసరించే
ఆత్మీయులు గురువులు....

జ్ఞానదీప్తిని వెలిగించగ
అజ్ఞానం ఆవిరి చేసి
ఆజన్మాంతం అండగా
తిమిరాల్ని
తొలగించే తోడుగా
తనంత ఎదిగిన శిష్యునిలో
తాదాత్మికరణం చెందే
తన్మయులు గురువులు...

ఎక్కడైనా.! ఎప్పుడైనా.. !
ఎండల్లో వెన్నెలలా..
వానల్లో గొడుగులా..
సంద్రంలో నావలా...
ఆకాంక్షల అలజడులలో
ఆశయాల సాధనలో
ఆయుధమై ఆసరౌతు
నీ చుట్టూ గూడుకట్టి
గూటిలోని గువ్వలోలె
ఎదిగి మీరు ఎగిరిపోవ
ఎదలోపల ఉప్పొంగే
ఆ సంద్రమే.... గురువు

తన రక్తం పంచకున్న..
తన ఎదపై ఆడకున్న
తన తోడుగ ఉండకున్నా
తన
శిష్యుని ఎదుగుదలను
తనువెల్ల పులుముకుని
ఆకాశాన్ని అందుకునే
ఆ శిఖరమే కదా !....
గురువు

వి పద్మ,
ఉపాధ్యాయురాలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, వెంకటాయపల్లి, తూప్రాన్ మండలం.



విద్యార్థుల తలరాతలు మార్చేది గురువే



జి.సిద్ధిరాములు, సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయులు.
నవతెలంగాణ-తూప్రాన్ 83

నేటి సమాజంలో విద్యార్థుల తల రాతలు మార్చేది బ్రహ్మదేవుడు తర్వాత ఆ తల రాతలను వెలుగు గీతలుగా మార్చేది గురువేనన్నారు. ఈ గురుపూజోత్సవం నుంచైనా గురువులను అవమానించకుండా సినిమాలలో గురువులపై జోకులు వేయకుండా ఉండాలని కోరుకుంటున్నాను. ఉపాధ్యాయులు విజ్ఞాన దీవెనల వంటి వారన్నారు. అభ్యాస ప్రయాణంలో విద్యార్థులను నడిపిస్తామన్నారు. స్ఫూర్తిదాయకమైన, ఆదర్శవంతమైన, మానవ విలువలను విద్యార్థులకు తెలియజేయడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు.

విద్యార్థులను జ్ఞాన శక్తులుగా మార్చేదే గురువులు



ఇస్లాంపూర్ జెడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు సత్యం,
నవతెలంగాణ-తూప్రాన్

భారతదేశంలో ప్రభుత్వ ఉద్యోగాలలో ఉపాధ్యాయ వృత్తి అత్యున్నతమైనదన్నారు. నాలుగు గోడల మధ్య విద్యార్థుల యొక్క శక్తి సామర్థ్యాలు సామర్థ్యాలతో కూడిన జ్ఞానాన్ని వెలికి తీసి ప్రపంచానికి చాటి చెప్పేదే ఉపాధ్యాయులన్నారు.జ్ఞానంతో కూడిన సమాజం పట్ల విలువలను విద్యార్థులకు తెలియజేస్తామన్నారు. విద్యార్థుల కలలను సాకారం చేయడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. నేటి బాలలే రేపటి పౌరులు అని నినాదాన్ని నిజం చేయడంలో ఉపాధ్యాయులు పాత్ర వహిస్తారన్నారు. కోవిడ్ 19 కారణంగా విద్యార్థులు కొంత చదువుపై అశ్రద్ధ చూపిన, ఉపాధ్యాయులు విశేషమైన కృషితో సేవలందిస్తున్నారన్నారు.

గురువులు నిత్య విద్యార్థులే



సమాజంలో విద్యార్థులకు తల్లిదండ్రుల తర్వాత గురువే దైవంగా భావిస్తారు. గురువును మించిన దైవం లేదు. గురువులు ఎల్లప్పుడూ నిత్య విద్యార్థులు గానే నేర్చుకుంటారు విద్యార్థులకు నేర్పిస్తారు. బావి భారత పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులకు కీలక పాత్ర ఉంటుందన్నారు. దేశంలో, రాష్ట్రంలో, ప్రభుత్వాలలో కీలకంగా ఉన్న రాజకీయ నాయకులు ,ప్రభుత్వ అధికారులు, సమాజంలో అత్యున్నత స్థానంలో ఉన్న ప్రతి పౌరుడు ఒక ఉపాధ్యాయుడు దగ్గర చదువుకున్న విద్యార్థి అని సంబోధించారు.ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలకు, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు.

డాక్టర్ పి.శారద, ప్రధానోపాధ్యాయురాలు, జెడ్పీహెచ్ఎస్, వెంకటాయి పల్లి, తూప్రాన్ మండలం,మెదక్ జిల్లా

ఆర్థిక సాయం అందజేసిన పరంజ్యోతి



నవతెలంగాణ-చేగుంట

మండల కేంద్రంలో అనారోగ్యంతో మరణించిన భయ్యా సత్యనారాయణ మరణించాడు, ఆ కుటుంబ సభ్యులను బుధవారం అయిత పరంజ్యోతి పరామర్శించారు. అనంతరం తన వంతు ఆర్థిక సాయంగా రూ.3000లతో పాటు 50 కేజీల బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాగరాజు, కిష్టయ్య, పోశెట్టి, దశరథం, రమేష్ గౌడ్, బాబు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా చేగుంట మండల పట్టణ కేంద్రానికి చెందిన భయ్యా సత్యనారాయణ అనారోగ్యంతో మరణించిన విషయం తెలుసుకొని బుధవారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ఆర్థిక సహాయం అందచేశారు. ఈ కార్ర్యమంలో సిద్ధిరములు, నాగరాజు, కిష్టయ్య, పోశెట్టి, దశరథం,రమేష్ గౌడ్,బాబు, తదితరులు పాల్గొన్నారు.